
శ్రీ అభిజ్ఞానశాకుంతలము

(అచ్చతెనుఁగు అనువాదము)



మహాకవి

శ్రీ దాసు శ్రీరాములు



మహాకవి దాసు శ్రీరాములు గారు

(ఏప్రియల్ 8, 1846 – మే 16, 1908)



శ్రీ దాసు శ్రీరాములు గారి సతీమణి

శ్రీమతి దాసు జానకమ్మ గారు

(1853 – 1927)

శ్రీ

అభిజ్ఞానశాకుంతలము

(అచ్చతెనుఁగు అనువాదము)

శ్రీ కాళిదాసు మహాకవి ప్రణీత సంస్కృత నాటకమునకు అనువాదము

మహాకవి

శ్రీదాసు శ్రీరాములు

మహాకవి దాసు శ్రీరాములు స్మారకసమితి

హైదరాబాద్

SRI ABHIJNANASAKUNTALAMU
(Achcha Tenugu)

by
Mahakavi Sri Dasu Sriramulu

అభిజ్ఞానశాకుంతలము

(అచ్చతెనుఁగు అనువాదము)

మహాకవి శ్రీదాసు శ్రీరాములు

ప్రథమ ముద్రణ	:	1898
ద్వితీయ ముద్రణ	:	2014
ప్రతులు	:	1000
వెల	:	**రూ. 200/-**

ప్రతులకు :

ఫ్లాట్ నెం. 201 శ్రీ సాయిరామ్ ఆదిత్యా రెసిడెన్సీ,
ఇంజనీర్స్ కాలనీ, ఎల్లారెడ్డిగూడ, హైదరాబాద్ – 500 073.
ఫోన్ : 040–23734864
email : araodasu@gmail.com

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, నవయుగ బుక్‌డిపో మరియు
అన్ని పుస్తక విక్రయ కేంద్రాలు

ముఖ చిత్రం :

కె.వి. భీమారావు, సెల్ : 9848444841

డి.టి.పి.
సమంత గ్రాఫిక్స్
ఎస్.ఆర్.టి. 208,
జవహర్ నగర్, హైదరాబాద్ – 80.
ఫోన్ : 27670198

ముద్రణ
ఓం సాయి గ్రాఫిక్స్
3–4–709, నారాయణగూడ,
హైదరాబాద్ – 500 027.
ఫోన్ : 27560003

నివేదన

19వ శతాబ్దములో ప్రముఖ న్యాయవాది, సంఘ సంస్కర్త, మహాకవిగా, మహావాగ్గేయకారుడిగా ఆంధ్రదేశంలో సంగీత, సాహిత్య, సాంస్కృతిక, సాంఘిక రంగాలను ప్రభావితం చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి దాసు శ్రీరాములు గారు (1846–1908). స్వయంకృషితోనే విద్యాభ్యాసం చేస్తూ సంస్కృతాంధ్ర భాషల్లో పండితులై ప్రబంధాలు, పురాణాలు, నాటకాలు, శతకాలు, ధర్మశాస్త్ర గ్రంధాలు, కృతులు, జావళీలు, పదములు, యక్షగానాలు మొదలైన వైవిధ్య ప్రక్రియలలో అనేక రచనలు చేశారు. గ్రామాలలో పాఠశాలలు నెలకొల్పి విద్యావ్యాప్తి చేసి ఉత్తమ ఉపాధ్యాయునిగా అందరి ఆదరాభిమానాలకు పాత్రులయ్యారు. ఆంగ్లం, పార్సీ భాషలలో ప్రావీణ్యం సంపాదించి ప్లీడర్ పరీక్షలలో ఉత్తీర్ణులై న్యాయవాద వృత్తిలో గొప్ప పేరు ప్రతిష్టలు సంపాదించారు. సాంఘిక దురాచారాలను వ్యతిరేకిస్తూ సంస్కరోద్యమాలలో చురుకుగా పాల్గొన్నారు. స్త్రీ స్వాతంత్ర్యాన్ని, స్త్రీ విద్యనూ ప్రోత్సహించారు. బాల్యవివాహాలను నిరసించారు. సాహితీ మూర్తులు, సంఘ సంస్కర్తలు వీరేశలింగం, గురజాడ, శ్రీరాములు సమకాలీనులు. ఆంధ్ర రాష్ట్ర తొలి ఆస్థానకవి బ్రహ్మశ్రీ చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి శ్రీరామ మహాకవిని ప్రశంసిస్తూ ఇలా అన్నారు. "ఈయన సాక్షాత్తూ శ్రీనాధుని అవతారమే అంటే ప్రతిచెప్పే వారుండరని నా విశ్వాసం. శ్రీనాథుని కంటే కూడ యీయన జీవితం మిక్కిలి ధన్యం. కవి గృహస్తులలో నిట్టి యదృష్టాలు పట్టిన వారు మృగ్యులనికాని, అసలే లేరనికాని నిస్సంశయంగా చెప్పవచ్చు ... ఇక్కవి సహజపాండిత్య విషయముననే కాక భాగవతాంధ్రీకరణ ప్రసక్తియుందుఁగూడ బోతరాజు గారే! ... యీయన సరసకవి, విద్వత్కవి, స్వతంత్రకవి, ఆశుకవి, దాత, నేత. ఇన్ని యోగాలు పట్టినవారు యేకాలంలోనూ కవులలో మృగ్యులే."

అంతటి మహాపురుషుని వంశంలో జన్మించి, వారి యశో సంపదకు వారసులమైన వారందరము కలిసి వారి రచనలను పునర్ముద్రించి సాహితీ ప్రపంచానికి అందించాలనే ఉద్దేశ్యంతో 'మహాకవి దాసు శ్రీరాములు స్మారక సమితి'ని 1973 సంవత్సరంలో స్థాపించి ఇంతవరకు, 'తెలుగునాడు', 'అభినవగధ్యప్రబంధము' 'శ్రీదేవిభాగవతము', 'సూర్యశతకము', 'కురంగ గౌరీశంకర నాటిక', 'చక్కట్ల దండ', 'భృంగరాజ మహిమ, శ్రాద్ధ సంశయవిచ్ఛేది',

'దురాచార పిశాచ భంజని', 'ఆచారనిరుక్తి, విగ్రహారాధన తారావళి', 'శ్రీరాములు గారి జయంతి సంచిక–1975', 'కృతులు – పదములు – జావళీలు', శ్రీమతి వెలగపూడి వైదేహి (దాసు శ్రీరాములు గారి మునిమనుమరాలు) రచించిన 'మహాకవి దాసు శ్రీరాములు గారి కృతులు – ఒక సమీక్ష' అనే పిహెచ్.డి. సిద్ధాంత వ్యాసం మొదలైన పుస్తకాలను ప్రచురించాము.

వారు చేసిన వైవిధ్య ప్రక్రియలలో నాటక రచన ఒకటి. తెలిసినంతవరకు శ్రీరాములు గారు 'అభిజ్ఞాన శాకుంతలము', 'రత్నావళి' (నాటిక), 'మాలతీ మాధవము' (ప్రకరణము), 'ఉత్తరరామ చరిత్ర' (నాటిక), 'ముద్రారాక్షసము', 'మహావీర చరితము' (నాటకము) మరియు 'సీతారామ కళ్యాణము' (నాటకము) అను ఆంధ్రానువాదములు, 'మనోలక్ష్మీ విలాస నాటిక', 'మంజరీ మధుకరీయ నాటిక' మరియు 'కురంగ గౌరీశంకర నాటిక' అను స్వతంత్ర రచనలుగా నాటక రచనలు చేశారు. 'జానకీ పరిణయము' మరియు 'మనోలక్ష్మీ విలసము', 1890 ప్రాంతంలో బళ్ళారిలోని 'సరసవినోదిని సభ' వారు ధర్మవరము కృష్ణమాచార్యులు గారి నేతృత్వంలో కొత్త పంథాలో మద్రాసులో నాటకాలు ప్రదర్శిస్తున్నప్పుడు, శ్రీరాములుగారు పద్య గీతాలతో అదే నూతన పంథాలో రాసి ప్రదర్శించిన నాటకములు. శ్రీరాములు గారి రెండవ కుమారుడు దాసు నారాయణరావు గారు 'శ్రీ సంగీతరసతరంగిణి యును బుద్ధనాటకము' మూడవ అంకము కొంతభాగము వరకు వ్రాసిన తర్వాత పరమపదించారు. మిగిలిన భాగముతో కలిపి ఏడంకముల నాటకాన్ని శ్రీరాములు గారు రచించి పూర్తి చేశారు. 1907లో కాకినాడః శ్రీ సావిత్రీ ముద్రాక్షరశాలలో ముద్రించబడింది.

'ముద్రారాక్షసము', 'చక్కట్ల దండ' మరియు 'అభిజ్ఞాన శాకుంతలము' అనునవి శ్రీరాములు పంతులు గారు అచ్చతెలుగులో చేసిన రచనలు. 1897 నవంబరు నెలలో పంతులుగారు పనిమీద మదారసు తిరువల్లిక్కేణిలో ఉన్నప్పుడు కొందరు బి.యే. విద్యార్థులు ఒక సంస్కృత నాటకాన్ని తెలుగించమని కోరితే మహాకవి కాళిదాసు విరచిత "అభిజ్ఞాన శాకుంతలము" నే ముందు తెలుగించద నని చెప్పి, 'అనాఘ్రాతం పుష్పం' శ్లోకాన్ని ఆశువుగా అనువదిస్తే అది అచ్చ తెలుగులో వచ్చిందట. అచ్చతెలుగులోనే ఉంటే బాగుంటుందనుకొని 20 రోజులలో మొత్తం నాటకాన్ని అచ్చ తెలుగులోనే అనువదించారు. 1898లో చెన్నపట్టణము

ఆనందా ముద్రాక్షరశాలలో ముద్రించబడింది. శ్రీరాములు గారి రెండవ కుమారుడు దాసు నారాయణరావు గారు బందరులో నిర్వహిస్తున్న నేషనల్ థియేటర్‌లో 'ఎడ్వర్డ్ (vii) కారొనేషన్' ఉత్సవ సందర్భమున ఈ 'శాంకుతలము' ప్రదర్శించారని 1902లో కృష్ణాపత్రికలో వ్రాసినట్లు డా. శ్రీమతి వెలగపూడి వైదేహి తమ పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథంలో పేర్కొన్నారు.

ఒక శతాబ్దం క్రింద ముద్రింపబడిన ఈ పుస్తకము యొక్క ప్రతి ఒక్కటి రాజమండ్రిలోని శ్రీ గౌతమీ పరిశోధనా గ్రంథాలయంలో మాత్రమే ఉన్నది. శ్రీరామకవి యొక్క ఈ అమూల్యమైనరచన ముందుతరాల సాహితీ ప్రియులకు, పరిశోధకులకు అందజేయాలనే ఉద్దేశ్యంతో పునర్ముద్రించి అందిస్తున్నందుకు మాకు ఆనందముగా ఉన్నది. మహాకవి దాసు శ్రీరాములుగారి విశిష్ట వ్యక్తిత్వం, సంగీత, సాహిత్య కవితా విన్యాసవైభవముపై పరిశోధనలు ఇంకా విస్తృతంగా జరగడానికి విశ్వవిద్యాలయాలలో పరిశోధకులకు, విద్యార్థులకు మా ప్రచురణలు ఉపయోగపడుతాయని ఆశిస్తున్నాము.

ఎంతో శ్రమించి వ్రాతపతి తయారుచేసిన మా సోదరి కీ.శే. శ్రీమతి వెలగపూడి వైదేహికి మా సమితి ఎంతో ఋణపడి ఉంది. అరుదైన ఈ పుస్తకము యొక్క జిరాక్సు ప్రతిని మాకు అందించిన గౌతమీ గ్రంథాలయం, రాజమండ్రి వారికి మా కృతజ్ఞతలు. "అభిజ్ఞాన శాకుంతలం – అనువాద 'శ్రీరామ' ణీయకం" అనే అందమైన, రమణీయమైన శీర్షికతో 'ముందుమాట'గా అందించిన ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారికి మా ఆత్మీయ అభివాదములు.

ఈ పుస్తక పునర్ముద్రణకు హృదయపూర్వక ప్రోత్సాహము ఆర్థిక ఆలంబనలందనించిన సోదర సోదరీమణులకు, దాసు వంశీకులకు 'మహాకవి దాసుశ్రీరాములు స్మారక సమితి' పక్షం నుంచి కృతజ్ఞతాభివందనములు. అత్యంత సుందరంగా ముఖచిత్రాన్ని రూపొందించిన శ్రీ కె.వి. భీమారావు గారికి మరియు ఎంతో ఓపికతో అక్షరకూర్పు చేసిన 'సమంత గ్రాఫిక్స్'కు మా అభినందనలు, ధన్యవాదములు.

డా. దాసు అచ్యుతరావు 09-06-2014

మహాకవి దాసు శ్రీరాములు స్మారక సమితి

హైదరాబాద్

అభిజ్ఞానశాకుంతలం

అనువాద ‘శ్రీరామ’ ణీయకం

అనువాదమనేది మూల విధేయంగానే ఉండాలి అన్నది ఈనాటి సిద్ధాంతం. నన్నయ నుంచీ మనం స్వేచ్ఛానువాదాలకే అలవాటుపడ్డాం. అయితే దీనికి భిన్నంగా ఇప్పటికి వంద సంవత్సరాల క్రితమే మూలవిధేయంగా అనువాదాలు చేపట్టిన మన కవులలో దాసు శ్రీరాములుగారు ఒకరు. వీరి రచనలలో దేవీభాగవతమూ ఈ అభిజ్ఞాన శాకుంతలమూ రెండూ యథామూలంగా సాగిన అనువాదాలే. దేవీభాగవతాన్ని నేను వచనరూపంలోకి అనువదిస్తున్న రోజుల్లో ఎక్కడైనా సమన్వయపరమైన సందేహం వస్తే ఆ శ్లోకానికి శ్రీరాములుగారి అనువాద పద్యం నాకు మార్గదర్శకమయ్యింది. అంతటి నిజాయితీతో ప్రామాణికంగా అనువదించారు వీరు.

వృత్తిపరంగా వీరు న్యాయవాదులు. అయితే నేమి, సంస్కృతాంధ్రాలలో పాండిత్యాన్నీ పద్యరచనా పాటవాన్నీ స్వాయత్తం చేసుకున్న కృషీవలులు శ్రీరాములుగారు. పద్యమంటేనే భయపడిపోయే ఆచార్యులూ విద్యార్థులూ ఈ విషయాన్ని గుర్తించాలని ఆశించి ప్రస్తావించాను. అంతే!

కాళిదాసు రచనలను చాలామంది అనువదించారు. అభిజ్ఞాన శాకుంతలాన్ని కూడా ఇద్దరు ముగ్గురు తెనిగించారు. కందుకూరి వీరేశలింగంగారి అనువాదం (1883) సుప్రసిద్ధం. కానీ దాసు శ్రీరాములుగారు తమ ముందుమాటలో ఎందుకోగానీ పంతులుగారి అనువాదం గురించి ప్రస్తావించలేదు. దానిమాట ఎలా ఉన్నా అచ్చతెనుగులో వచ్చిన మొదటి అనువాదం ఇప్పటికీ కచ్చితంగా శ్రీరాములుగారిదే (1898).

ఒక భాషలోని కావ్యాన్ని మరొక భాషలోకి అనువదించడమంటే ఒక విలుకాడు చేసిన రంధ్రంలోకి మరొక విలుకాడు బాణం వెయ్యడమంత కష్టం అన్నారు. అచ్చతెనుగులో అనువదించడం మరీ కష్టం. అచ్చ తెనుగు రచనలు పాఠకుల ఆదరణకు అంతగా నోచుకోవడం లేదు అనే వాస్తవాన్ని గ్రహించి కూడా వీరు శ్రమాధిక్యం ఉన్నా ఇదే బాణీని ఎంచుకోవడానికి కారణం ప్రతిభాపాండిత్యాలూ వైవిధ్యాభిలాష ఇత్యాదులతో పాటు తొట్టతొలి రచన

అనిపించుకోవాలనే ఆగ్రహమూ ఒక కారణమే కావచ్చు. దానికేమిగానీ ఒకటి మాత్రం నిజం– మనవాళ్ళు చేసిన అచ్చతెనుగు రచనల వల్ల పదసంపద పెరిగింది. భాషానిర్మాణ వ్యూహాలు అంటే సమాసాదుల తయారీ వగైరాలు ఎలా ఉంటాయో సాహిత్య విద్యార్థులకు ఎరుకపడింది. ఈ మేరకు శ్రీరాములుగారికి మనమంతా ఋణపడి ఉన్నట్టే. సంజ్ఞావాచకాలను అచ్చతెనుగు చెయ్యను అని పొన్నెగంటి తెలగన్న ఒక నియమం పెట్టుకున్నాడు. దీనినే తరువాతి కవులూ (నీలాసుందరీ పరిణయాదుల్లో) అనుసరించారు. శ్రీరాములుగారు ఇదే చేశారు. పెట్టు పేళ్ళు మట్టుకు మున్ను వాడినవే వాడబడినవి–అన్నారు. అలాగే సామెతల్లోని పదాలనూ (దిక్కు, లోకాలు) అచ్చతెనుగు చెయ్యలేదు అని చెప్పారు. తన అనువాదంలోని మరికొన్ని విశేషాలనూ తమ ముందుమాటలో పొందుపరిచారు.

అనువాదానికి ఒక పట్టాన లొంగనివీ, ఎవరు ఎంత గొప్పగా చేసినా విజ్ఞ పాఠకులకు అంతగా సంతృప్తినివ్వనివీ–కొన్ని శ్లోకాలు ప్రతికావ్యంలోనూ తారసపడుతుంటాయి. ఈ ఘటికలను ముందు చూసేస్తే అనువాదం గురించి ఒక అభిప్రాయానికి రావచ్చు.

అభిజ్ఞాన శాకుంతలంలో నాందీ శ్లోకమే అటువంటిది. పంచభూతాలూ సూర్యచంద్రులూ యజమానుడూ అనేవి శివుడి అష్టమూర్తులు. వీటిని భంగ్యంతరంగా స్ఫురింపజేస్తూ యా సృష్టిః స్రష్టురాద్యా– అనే శ్లోకం రచించాడు కవికులగురువు. దీనిని వరస మార్చకుండా యథామూలంగా అనువదించిన నేర్పు శ్రీరాములుగారిది. యా చ హోత్రీ (యజమానుడు) అనేదాన్ని వేలిమికూడు ఈగి వెలయు దివాణంబు అన్నారు. వేలిమి కూడు అంటే హవిస్సు. దాన్ని దాం చేస్తే గుణానికి (ఈగి) నిలయం – యజమానుడు. అతడే హోత్రి. శబ్దగుణకమైన ఆకాశాన్ని – శ్రుతి విషయ గుణా యా స్థితా వ్యాప్య విశ్వమ్ అన్నాడు కాళిదాసు. మన అవగాహనలో ఆకాశమంటే గగనం. సూర్యచంద్రులూ నక్షత్రాలూ ఉండే చోటు. కానీ ఇంతమాత్రమే కాదు. ఇద్దరు వ్యక్తులకుగానీ రెండు వస్తువులకుగానీ నడుమ ఉండే ఖాళీప్రదేశమంతా ఆకాశమే. ధ్వనితరంగాలను బట్వాడా చేసేది ఇదే. అందుకని శ్రీరాములుగారు ఈ రెండు అర్థాలూ స్ఫురించేట్టు అనువదించి అదనపు సొగసు చేకూర్చారు. పున్నమ యమవసల్ వన్నె మీరిన చోటు (గగనం) జగము బ్రాకిన సద్దు సంచుమూట (శబ్దం= సద్దు. సౌందర్యం = సంచు,

నిలయం= మూట). జగము అనే మాట తత్సమమేమో అనే భ్రాంతిని కల్గిస్తుంది. కానీ తద్భవంగా దంత్యజకారంతో ఇది ఆచ్ఛికమే. అచ్చతెనుగు రామాయణాదుల్లో జగనొబ్బగండ ఇత్యాదుల్లో ఇది ప్రయుక్తం. వాయువును–యయా ప్రాణినః ప్రాణవంతః అన్నాడు కాళిదాసు. ఉసురుదారులకు (ప్రాణధారి–ప్రాణి= ఉసురుదారి) ఉసురొసగు ప్రాపు–అని గడుసుగా తెనిగించారు శ్రీరాములుగారు.

సంస్కృతభాషామతల్లికి పిల్లలెంతమంది ఉన్నా తెనుగే ముద్దుల కూతురనీ, ఇంకా చంకదిగని కడగొట్టు బిడ్డ అనీ, దానికి తప్పటడుగులు నేర్పడం కవి పండితుల కర్తవ్యమనీ వీరు భావించారు (1–3). అచ్చతెనుగులో అనువదించడం వెనుక తెనుగుబాసను పరిపుష్టం చెయ్యాలన్నదే శ్రీరాములుగారి కాంక్ష.

ఋతుగానం చెయ్యమని సూత్రధారుడన్నప్పుడు ఏ ఋతువును గానం చెయ్యను అని మాత్రమే అడిగింది సంస్కృతనటి. శ్రీరాములుగారి నటిమాత్రం ననకాఱు (వసంతం) ఉబ్బకాఱు (గ్రీష్మం) వానకాఱు, తెల్లకాఱు (శరత్తు) చలికాఱు (హేమంతం) చలువకాఱు (శిశిరం) అని ఆరు కాఱులు గదా, ఇందు ఏ కాఱు మీద పాట పాడిన బాగుగా నుండును? అని సూత్రధారుణ్ణే సలహా అడుగుతుంది. ఈ అధిక ప్రసంగం ఎందుకంటే ఆరు ఋతువులకూ తెలుగుపేర్లను మనకు అందించడానికీ తెనుగును పరిపుష్టం చెయ్యడానికీను.

గ్రీష్మర్తుగానంలో దివసాః పరిణామ రమణీయాః అన్న దాన్ని చివరి ప్రొద్దుల అనువులైనవి పవళ్ళు అనీ, శిరీషకుసుమాని అవతంసయంతి దయమానాః అన్నదాన్ని దిరిసెన ననలు కనికరమున కొనచెవి నునుతురు కొమిరెగములు అనీ అనువదించారు. ప్రతిపదం మీదా (పరిణామ–దయమాన) దృష్టి నిలిపి ఎంత శ్రద్ధగా అనువదించారో శ్రీరాములుగారు.

పదం మీదనే కాదు ప్రతివర్ణం మీదా దృష్టి నిలిపారు. మూడవ అంకంలో ముహురంగుళి సంవృతాధరోష్ఠమ్ (27) శ్లోకం – కథమపి ఉన్నమితం న చుంబితం తు – అని ముగుస్తుంది. తు అనేది సంస్కృతంలో ఏకాక్షర పదం. అవ్యయం. దీనిని ఉచ్చరించేటప్పుడు పెదవులు వర్తులాకారంలోకి మారుతాయి. ఇది చుంబనకు సిద్ధపడిన పెదవుల రూపాన్ని స్ఫురింపచేస్తోందని వ్యాఖ్యాతలు వర్ణకృత వస్తుధ్వనిగా సంభావించారు. ఈ సొగసు తెలుగులోకి రావాలంటే అనువాద పద్యాన్ని ఉదంతపదంతో ముగిస్తే సరిపోతుంది. కానీ కందుకూరివారు దీనిమీద

దృష్టి పెట్టలేదు. శ్రీరాములుగారు మాత్రం గడుసుగా – మరి లేదు ముద్దు అని తేటగీతిని ముగించి నామ రూపాలను రెండింటినీ స్ఫురింపజేశారు.

తెలుగు పదాలలో కూడా అర్థాంతర స్ఫూర్తిని కలిగించేవాటిని అవసరాన్ని బట్టి ఎంచుకోవడంలోనూ వీరి గడుసుదనం కనిపిస్తుంది. శకుంతలాదుష్యంతులు పొదరింట్లో ఉన్నారు. వాకిలి దగ్గర అనసూయా ప్రియంవదలు ఉన్నారు. అంతలోకీ వృద్ధతాపసి గౌతమి అటువస్తోంది. గమనించిన ఈ చెలిమికత్తెలు చక్రవాక వధువు వంకతో ఆమంత్రయస్వ సహచరమ్, ఉపస్థితా రజనీ అని శకుంతలను హెచ్చరించారు. నీ సహచరుడికి (దుష్యంతుడు) వీడ్కోలు చెప్పు (ఆమంత్రయస్వ)– రాత్రి (రజనీ–గౌతమీ) సమీపించింది– అని హెచ్చరిక. దీనిని వీరు ఎంత అందంగా తెనిగించారంటే– జక్కవ చక్కెర బొమ్మా! నీ చక్కని మగని ప్రక్కనుండి పంపు తఱియైనది. రాతిరి వచ్చినది– అన్నారు. ప్రక్కనుండి పంపుట అనే మాటలో శయ్య నుంచి పంపించు అనే అశ్లీలార్థం స్ఫురిస్తోంది కదా అనిపించవచ్చును గానీ– మేము నిలబడ్డ ఈ పొదరింటి గుమ్మం నుంచి కాకుండా వేరొక పక్కదారినుంచి నీ మగణ్ణి (సహచరుడు) పంపించు, కంగారులో ఈ దారినే ఇటే పంపుతావేమో దొరికిపోతాం–అనే జాగ్రత్త వినిపిస్తోంది. ప్రక్కనుండి పంపుట– అనే పదబంధానికి ఉన్న అర్థాంతర స్ఫూర్తి రమణీయతరం.

అనువాదము అంటేనే అభివ్యక్తిలో కృతకత్వం అనివార్యం. అందునా మూలవిధేయంగా చెయ్యాలి అన్నప్పుడు ఇది మరింత దుర్నివారం. కవితా సౌందర్యం కొండొకచో దెబ్బతింటుంది. అందుకని శ్రీరాములుగారు లోప పూర్తికోసం తెలుగు నుడికారాన్నీ సామెతలనూ జాతీయాలనూ చాలా గడుసుగా వాడుకున్నారు. పర్యుత్సుకో భవతి (5–2) అనే దాన్ని చంకలు కొట్టుకొందురు– అన్నారు. స్వభావ ఏవైష పరోపకారిణామ్ (5–12) అనేదాన్ని పెట్టిపోతలొనర్చు వారు అట్టి వారె – అన్నారు. ఈ కోణంలో వీరి అనువాదాన్ని ప్రత్యేకంగా పరిశీలించాలి.

ఆపుకోలేక ఆబగా చాలా రాసినట్టున్నాను. ఇంత అందమైన అచ్చతెనుగు అనువాదగ్రంథాన్ని పునర్ముద్రించి పాఠకులకు అందిస్తున్న అచ్యుతరావుగారిని మనసారా అభినందిస్తున్నాను. రచనలు అందుబాటులో ఉంటేనే రచయిత జీవిస్తాడని అలనాడెప్పుడో కావ్యమీమాంసాకర్త రాజశేఖరుడన్నాడు. అది వాస్తవం.

రాజులో శిష్యులో బిడ్డలో కవిగారి తదనంతరం కావ్యాలను అందుబాటులో ఉంచాలని కూడా అన్నాడు. ఈ బాధ్యతను నిర్వర్తిస్తున్నారు అచ్యుతరావుగారు. ఈ దృశ్యకావ్యానికి ఇలా నాలుగు మాటలు రాసే ఈదృశభాగ్యాన్ని నాకు కల్పించినందుకు వీరికి నా ధన్యవాదాలు కూడా.

సెలవు ...

హైదరాబాదు భవదీయుడు

ఫిబ్రవరి 4, 2014 **బేతవోలు రామబ్రహ్మం**

మహాకవి దాసు శ్రీరాములు పంతులు గారి జీవిత సంగ్రహము - రచనలు

- ఆచార్య శ్రీ దివాకర్ల వేంకటావధాని

దాసు వంశమునందలి పూర్వీకులలో నొకరయిన రఘునాధరావుగారు 1560 సంవత్సరము ప్రాంతమున ధార్వాడు నుంచి గోలకొండకు వచ్చినారట. వీరి కుమారుడు గంగోజీ (హరిదాస్) హైదరాబాదులో వుండి హరిభక్తుడగుటచే వీరికి దాసువారను నింటిపేరేర్పడెను. గంగోజీ ద్వితీయ కుమారుఁడైన రఘునాయకులు పోర్చుగీసువారిచే నేదో లౌకికోద్యోగమున నియమింపఁబడి (1640) బందరువచ్చి స్థిరపడిపోయెను. తదుపరి వారు నూజివీడు వచ్చి యచ్చటి నియోగి వంశములలో ప్రముఖమైన మెట్లపల్లివారి వంశముతో సంబంధము చేసి యచ్చటనే కీర్తిశేషులైరి. వారి కాలమునుండి దాసువా రాఱువేల నియోగులుగా పరిగణింపఁబడుచుండిరి. వారి కుమారులైన గంగరాజుగారు నూజివీటి ప్రభువులనుండి గురజ గ్రామమునకు చెంతనున్న యటవీస్థలమును గొంత సంపాదించి యచ్చట అల్లూరను గ్రామమును నిర్మించిరి.

రఘునాధరావు గారికి పదవతరము వారయిన కన్నయ్యగారికి, కామమ్మగారియందు 1846 వ సంవత్సరము ఏప్రిల్ 8 వ తేదీన శ్రీరాములుగారు జన్మించిరి. పూవుపుట్టఁగనే పరిమళించునన్నట్లు వారు బాల్యమునుండియు వినయ విధేయతలను విద్యాసక్తిని గల్గి వర్తించెడివారు. వారు అక్షరాభ్యాసమైన తరువాత 6 నెలలు కొట్టుగుంటపాలెము నందుండిన అడవి సుబ్బారాయుడిగారి యొద్దను తరువాత తండ్రిగారి యొద్దను విద్యాభ్యాసము కావించిరి. 1858 వ సంవత్సరమున నుపవీతులైన పిమ్మట వారాంగ్ల విద్యాభ్యాసమునకై బందరు పురమున కరిగిరి. ఆ రోజులలో నచ్చట హిందువులను క్రైస్తవమతమునకు మార్చుయత్నములు విరివిగా సాగుచుండుటచే తల్లిదండ్రులు భీతులైవారిని స్వల్పకాలమునకే అల్లూరుకుఁ బిలిపించిరి. దానితో నింగ్లీషు చదువంతరించెను. వారు స్వయముగనే యింటి యొద్దనుండి సంస్కృతాంధ్రముల నభ్యసించుచుండిరి, వారికి బందరులో నుండినప్పుడే కవితా కుతూహల మంకురించెను. 'జయజయ

సోమలింగ' అను కీర్తనను వారప్పుడే రచించిరి. 14 వ ఏట వారు 'సాత్రాజితీ విలాసమను' యక్షగానమును చక్కని శైలిలో వ్రాసియుండిరి. 1859 వ సంవత్సరము మార్చి 25వ తేదీన వారికి పెద్దమేనమామ గారైన కూరాడ లక్ష్మీనరసింహంగారి రెండవ కుమార్తెయయిన జానకమ్మగారితో వివాహము జరిగెను.

1865వ సంవత్సరమున శ్రీరాములుగారు తల్లిదండ్రులతోఁగాని మఱెవ్వరితోఁగాని చెప్పకుండనే సంస్కృతము నభ్యసించుటకై ఆకిరిపల్లి కరిగిరి. ఆప్పు డాకిరిపల్లి సర్వశాస్త్రనిష్ణాతులైన పండితుల కాకరమై యొప్పుచుండెను. శ్రీరాములుగాను పది మాసముల పాటచ్చట వ్యాకరణ శాస్త్రము నభ్యసించుచు యితర శాస్త్రములతో గూడ బరిచయము సంపాదించిరి.

అప్పుడు వారు నూజివీటి జమీందారుగారి వలన దినమున కెనిమిదణాలవంతున విద్యార్థి వేతనము పొందఁజాలిరి. తరువాత వారల్లూరు తిరిగివచ్చి స్వయముగా సంస్కృతభాష నభ్యసించుచు నష్టావధానము నభ్యాసము చేసిరి. ఆ కాలమున నవధానవిద్యలో నారితేరి అభినయ పండితరాయ బిరుదాంకితులై యుండిన శ్రీమాన్ మాడభూషి వేంకటాచార్యులవారు శ్రీరాములుగారి మేధాసంపద కలరి 'పన్నెండేడులనాఁడె సత్కవిత చెప్పనేర్చె' నిత్యాదిగా వారినొక పద్యములో ప్రశంసించి యుండిరి. విక్టోరియారాణి స్వర్ణోత్సవ సందర్భమున వారితోపాటు శ్రీరాములుగారుకూడ పద్యములు రచించి యుండిరి.

1867వ సంవత్సరమున శ్రీరాములుగారికి ప్రథమ పుత్రులైన కేశవరావుగారు జన్మించిరి. తరువాత సుమారైదేండ్లకు అల్లూరు గ్రామము విడిచినఁ గాని తమ విద్యాయశోవృద్ధికవకాశముండదని యెంచి వారు మిత్రుల ప్రోత్సాహమున గుడివాడ కరుదెంచి, యచ్చటి ఉన్నత పాఠశాలలో నాంధ్రోపాధ్యాయులుగా ప్రవేశించిరి. సుప్రసిద్ధ న్యాయవాదులును మేధావులు నైన రెంటాల వేంకటసుబ్బారావుగారప్పుడు వారికి శిష్యులైరి. అప్పటినుండియు శ్రీరాములుగారాంగ్ల భాషాజ్ఞానము నభివృద్ధి చేసికొన నారంభించిరి, 1875వ సంవత్సరమున వారు కవుతరము గ్రామమునందలి పెద్దల అభ్యర్థనపై అచ్చటి పాఠశాల కుపాధ్యాయులుగా నరిగి యచ్చట నొక సంవత్సరము పనిచేసిరి. ఈ

సమయముననె వారు 'వేదాచల మాహాత్మ్యము', 'కృష్ణార్జున సమరము' అను కావ్యములను సంస్కృత జటిలమైన ప్రౌఢశైలిలో రచించి యుండిరి. తరువాత వారు డోకిపఱ్ఱు నందలి సంపన్నులైన కమ్మవారి ఆహ్వానమున నచ్చటి కరిగి యొక పాఠశాల స్థాపించి దానిని 1878 సంవత్సరము వఱకు నిర్వహించిరి. ఈ కాలముననే వారు తెలుగు ఇంగ్లీషు జనరల్ టెస్టులను పరీక్షలందును, తెలుగులో ప్లీడరు పరీక్షయందును నుత్తీర్ణులైరి. ఈ సమయముననే వారు 'సంవరణోపాఖ్యానము' అను కావ్యమును, 'లక్షణావిలాస' మను యక్షగానమును రచించిరి. 'బోయియై పల్లకీల్మోయఁగా మోయఁగా కాయలెక్కిన భుజాల్గలుగువాఁడు' ఇత్యాదిగా లక్షణావిలాసమందు రజకుని వర్ణించు పద్యములు రమ్యముగా నుండును. డోకిపఱ్ఱులో నున్నప్పుడు శ్రీ సూరిసీతారామశాస్త్రులుగారను యువకులైన వ్యాకరణ పండితులు తమ దగ్గరకు రాగా శ్రీరాములుగారు వారియొద్ద సంస్కృత వ్యాకరణము నభ్యసించుచు వారి కాంగ్లము నేర్పి తెలుగు ప్లీడరు పరీక్షలో కృతార్థులగు నట్లొనరించిరి. 1878 వ సంవత్సరములో శ్రీరాములుగారాగ్రామము విడిచి న్యాయవాద వృత్తి నవలంబించుటకు బందరునకరుగునప్పుడచ్చటి కమ్మవారు వారికి వెండి పూవులతో పాదపూజను, బంగారు పూలతో శిరఃపూజను గావించి, పల్లకీలో నూరేగించి, అమితమైనభక్తి ప్రకటించిరి.

1878 లో బందరు పురమున న్యాయవాదిగా ప్రవేశించి శ్రీరాములుగారు శ్రద్ధాదీక్షలతోఁ బనిచేసి అచిరకాలమునే మంచిపేరు సంపాదించిరి. అట్లు ప్లీడరుగా పనిచేయుచునే వారు సాహిత్యమునందును శాస్త్రాభ్యాసము నందును కృషిసల్పుచుండిరి. తరువాత ఇంగ్లీషు సివిలు, క్రిమినల్ హయ్యరు పరీక్షలందు కృతార్థులై ఇంగ్లీషు ప్లీడరు కాఁగల్గిరి, వారే పరీక్షకు చదివినను సులభముగా విషయమును జ్ఞాపకముంచుకొనుటకై వానిని పద్యరూపమున వ్రాసికొనుచుండిరి. ఈసమయముననే 'అనల్పజల్పితాకల్పవల్లి' యను నొక మత సాంఘిక మాసపత్రికను కొన్ని నాళ్లు నిర్వహించియుండిరి. అప్పుడప్పుడు వారచ్చట డిప్యూటీ కలెక్టరుగా నుండిన పి.టి. రాఘవాచార్యులుగారితోఁగలసి కూచిపూడి భాగవతులచే భాగవత కాలక్షేపము లేర్పాటు చేయుచుండిరి. బందరులో నున్నప్పుడే వారు మోటుపల్లి రాఘవయ్యగారు మున్నగు వారి ప్రేరణమున 'అభినవ గద్యప్రబంధము'

అను విచిత్ర కల్పనా కథను ప్రౌఢశైలిలో రచించిరి. 1884వ సంవత్సరమున ఫస్టుగ్రేడు ప్లీడరీ పరీక్షకు చదివి యందు కృతార్థులైరి.

ఆ సంవత్సరములో జులైలో నంతకుముందు కడలూరులో నుండిన సబుకోర్టును ఏలూరునకు మార్చిరి. శ్రీరాములుగా రచ్చటి పరిస్థితులు మిక్కిలి అనుకూలముగా నుండుటచే బందరునుండి ఏలూరున కరిగి 1895 వఱకును సబుకోర్టులో న్యాయవాదిగా పనిచేయుచు నఖండమైన కీర్తిని, అపారమైన ధనమును సంపాదించిరి. అప్పుడు పలువురు జమీందారులును, సంపన్నులును, వారికి క్లయింటులుగా నుండిరి. ఎంతపని యొత్తిడియున్నను వారెట్లో తీరికచేసికొని రచనా వ్యాసంగము సాగించుచునే యుండిరి. వారు తోట్లవల్లూరులోని వేణుగోపాలస్వామి కంకితముగా పెక్కుకృతులు, పదములు, జావళీలు రచించియుండిరి. ఆ ప్రాంతపు వారకాంతలు అప్పుడు వాటిని తఱచుగా పాడుచుండిరి.

ఖండ్రిక సీతారామవరమను గ్రామమును క్షత్రియులకు చెందఁజేయుటకై శ్రీరాములుగారు పాపమ్మారావు జమీందారుగారు మున్నగు వారిమీఁద వేసిన వ్యాజ్యము వారి ధైర్యసాహసములకు తార్కాణము. అందులో వారు జయమునుబొంది గ్రామమును వశము చేసికొనిరి. ఏలూరు వచ్చిన తరువాత న్యాయవాదవృత్తిలో తీరికలేని కారణమున వారు రచనలుచేయుట కవకాశము లేకపోయెను. కాని అప్పుడప్పుడు కొన్ని పద్యములు, జావళీలు, కృతులు, పదములు మాత్రము వ్రాయుచుండిరి. ఈ కాలమున ననేక విద్యలందును, శాస్త్రమలందును పండితులైనవారెందఱో వారిని దర్శించి వారి సత్కారమును పొంది యుండిరి. వారు తమ వృత్తి కావశ్యకమగుటచేతను. ఇతర కారణములచేతను ధర్మశాస్త్రమునుగూడ కూలంకషముగా పఠించిరి. గుంటూరు భానుమూర్తి గారిని వైదిక సంఘము బహిష్కరించినప్పుడు శ్రీరాములుగారు వారికి ప్రాయశ్చిత్తము చేయించి పునీతుల నొనరించిన వృత్తాంతము వారి ధర్మపరాయణతకును, ధైర్యమునకును నిదర్శనము. ఈ సందర్భమున వైదికులు లౌకికులయిండ్లకు వచ్చుట ఆపివేసినప్పుడు శ్రీరాములుగారు ధైర్యమువహించి శ్రీఅవ్వాజగన్నాథశాస్త్రి గారను నియోగి పండితుని నేలూరునకు పిలిపించి నిత్యనైమిత్తికములు యథావిధిగా

జరిపించుటయె కాక 'పతితసంసర్గ ప్రాయశ్చిత్త విషయకొపన్యాస' మును రెండు రాత్రులలో రచించి విరోధుల వాదముల నన్నిటిని ఖండించిరి. ఈ సమయముననే వారు 'ఆచార నిరుక్తి', 'దురాచార భంజని' అను రెండు ధర్మశాస్త్రసంబంధ వ్యాసములు రచించి ప్రచురించిరి. తరువాత వారావ్యాసముల కన్యుల నామములతో వ్యాఖ్యానములు కూడ వెలయించిరి. ఇట్లే వైశ్యులకు కర్మలను వేదోక్తముగా నాచరించు నర్హత యున్నదా లేదా యను విషయమున వైదికులు లేదని వాదింప శ్రీరాములుగారు వ్యతిరేక పక్షము నవలంబించి యొక స్వాములవారితో వాదించి వారి నూరువిడిచి పోవునట్లొరించుటయేకాక ధర్మశాస్త్రమును హైకోర్టు తీర్పులను క్రోడీకరించి 'వైశ్యధర్మదీపిక' యను పెద్ద గ్రంథమును, 'శ్రాద్ధసంశయ విచ్ఛేదిని' యను వ్యాసమును రచించిరి.

శ్రీరాములుగారు 1890 ప్రాంతమున సంస్కృతమునుండి "జానకీ పరిణయము" అను నాటకము నాంధ్రీకరించుటయేకాక 'మనోలక్ష్మీవిలాసము' అను నొక స్వతంత్ర నాటకమును గూడ రచించి వానిని ప్రదర్శింపఁజేసిరి. వారి ఇంట విద్యాగోష్ఠులు, సంగీత సభలు నిత్యము జరుగుచునే యుండెను. వారికి భరతనాట్య శాస్త్రముతోఁగూడ పరిచయముకలదు. అందుకు వారు రచించిన 'అభినయదర్పణము' అను నాట్యశాస్త్రగ్రంథము నిదర్శనము. సిద్ధాంతము నెఱుంగుటయే కాక వారు స్వయముగా ముద్రాదులను పట్టి చూపించు చుండెడివారు. వారి ముందభినయ విద్యావిశారదలైన వేశ్యలుకూడ నభినయించు టకు జంకెడివారు. తిరుపతి వేంకటకవులు, ఆదిభట్ల నారాయణదాసుగారు మున్నగు వారెందఱో వారియింట నాతిథ్యము స్వీకరించి వారివలన సమ్మానము లొంది యుండిరి. వారు సంగీత ప్రియులగుటచే నేలూరులో నొక సంగీత పాఠశాలనుగూడ నెలకొల్పియుండిరి. వారు తమ కడగొట్టు సంతానమైన శారదాంబకు సంగీత సాహిత్యములు రెండును నేర్పించి ఆరోజులలో స్త్రీలకు సహితము విద్యాభ్యాస మవసరమేయని నిరూపించియుండిరి. అట్లే, వారేలూరులో సమర్థుఁడైన యొక యుపాధ్యాయునికి జరిగిన అన్యాయమును గూర్చి విని వారికి జీవనోపాధి కల్పించుటకై యొక మాధ్యమిక పాఠశాలను స్థాపించి యైదారేండ్లు దానిని సమర్థతతో నిర్వహించిరి.

ఈ విధముగా శ్రీరాములుపంతులుగారు వృత్తిచే న్యాయవాదులయ్యు నాదర్శోపాధ్యాయులై, సంస్కృతాంధ్రములందు గొప్ప పండితులును, కవులునై, లలితకళోపాసకులై, విద్వత్పోషకులై, సంఘసంస్కారులై 62 ఏండ్లు వైభవోపేతమును పరోపకార పరాయణమునైన జీవితము గడపి యుత్తమ సంతానము బడసి 1908 వ సంవత్సరమున కీర్తిశేషులైరి. వారొకవంక న్యాయవాద వృత్తికిని, వేఱొకవంక సాహితీసంగీతాభినయాదులకును ఆరోజులలో అపార గౌరవము నాపాదించిన మహనీయులు.

శ్రీ శ్రీరామకవీంద్రులు రచించిన కొన్ని గ్రంథములు సందర్భవశమున పైని పేర్కొనఁబడినవి. అవిగాక వారు 'సోమలింగశతకము', 'రఘునాధశతకము', 'పంచనృసింహక్షేత్ర మాహాత్మ్యము', 'సారసంగ్రహగణితము', 'అభినవకౌముది', సంస్కృతమున 'కామాక్షీ శతకము', 'చక్కట్లదండ' యను నచ్చతెనుఁగు శతకము, 'తర్కకౌముది', 'విగ్రహారాధన తారావళి' 'సూర్యశతకము', 'చిలుకలకొలికిశతకము', 'ముద్దులగుమ్మశతకము', 'సీతాకల్యాణ నాటకము', 'నమస్కారవిధి దీపిక', శాకుంతల, ముద్రారాక్షస, మహావీర చరిత్ర, మాలతీమాధవోత్తర రామచరిత్ర, రత్నావళీ, మంజరీ మధుకరీయ నాటకానువాదములు, 'కురంగగౌరీశంకర' నాటిక అను గ్రంథములను గూడ రచించిరి. వారు 'తెలుఁగునాడు' అను పేర నాంధ్రదేశమునందలి సర్వవర్ణముల వారిని వర్ణించుచు రచించిన 'ఆంధ్రవీధి' శ్రీనాధుని క్రీడాభిరామమును బోలి యత్యంత హృద్యముగా నుండును. అది దురదృష్ట వశమున సంపూర్ణమయి యుండలేదు. కీ. శే. చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రులు గారు శ్రీరాములుగారికి శ్రీనాధునితోఁగల పోలికలను వివరించుచు నొక చక్కని వ్యాసము వ్రాసియున్నారు, వారి పద్యములు కొన్ని శాస్త్రులుగారు కూడ ధారణపట్టి యుండుటయే వారి కవితా కౌశలమునకు తార్కాణము.

శ్రీరామ కవీంద్రుల రచనలకెల్ల తలమానికముగా చెప్పఁదగినది శ్రీ దేవీభాగవతాంధ్రీకరణము. శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రులుగారు దానికి దీర్ఘమైన పీఠిక వ్రాయుచు నందలి కవితా విశేషములను ప్రశంసించియుండిరి. వారి యనువాదము మూలాతివిధేయమును అతి స్వతంత్రమును గాక యెడనెడ స్వకపోల కల్పితములైన పద్యములతోఁగూడి హృద్యముగా నుండును. వారి

రచన రసానుగుణమై, జాతీయపద ప్రచురమై, నిర్దుష్టమై, ధారాశుద్ధి శోభితమై, యింపు నింపుచుండు. దేవీమాహాత్మ్యమును ప్రశంసించు భాగములను వారనువదించిన విధానము వారి పాండిత్య పాటవమును, మంత్రశాస్త్ర ప్రావీణ్యమును సూచించును. వారి గ్రంథములు పెక్కు ముద్రితములైనను ఇప్పుడెచ్చటను లభ్యములగుటలేదు. వారి వంశమునకుఁజెందిన పెద్దలును, యువకులును వారి గ్రంథముల నన్నిటిని సేకరించి, మరల ముద్రించి సారస్వత సేవాపరాయణుల కానందము నావహింతురని యాశించుచున్నాను.

హైదరాబాదులోని శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషానిలయములో 8 డిశంబరు 1973న చిత్రపట ఆవిష్కరణము సందర్భంగా వ్రాసిన ప్రసంగ వ్యాసము



ఏలూరులో ఫస్ట్ గ్రేడ్ ప్లీడరుగా

శ్రీ దాసు శ్రీరాములు గారు

శ్రీ దాసు శ్రీరాములుగారి వంశవృక్షము

రఘునాధరావు
1560 ప్రాంతములో ధార్వాడు నుండి గోల్కొండకు రణోద్యోగిగ వచ్చెనట
↓
గంగోజీ (హరిదాస్)
1620-30 ప్రాంతంలో హైదరాబాదులో నుండెను. హరిదాసు డగుటచే ఈ వంశము వారికి **'దాసు'** వారుగా ఇంటిపేరు వచ్చినది.
↓
రఘునాయకులు
1640-1650 ప్రాంతంలో బందరుకు బుడతకీచులతో (పోర్చుగీసు వారితో) లౌక్య వ్యవహారములపై వచ్చెనట
↓
గంగరాజు (కన్నయ్య)
1670 ప్రాంతంలో నూజివీడుకి దండపతి పదివిని వచ్చినారు

↓ **జానకిరామయ్య** | ↓ **సుందరరామయ్య** | ↓ **వెంకటరామయ్య**

(సుందరరామయ్య) ↓
గంగరాజు
బందరులో ఈస్టు ఇండియా కంపెనీవారు రాజ్యస్థాపన చేసినపుడు
1750-60 ప్రాంతంలో వీరు ప్రముఖులుగా ఉండిరి

↓ **అక్కిరాజు**
అల్లూరులో సోమేశ్వర లింగమును ప్రతిష్ఠించినాడు క్రీ.శ. 1760
↓
జోగిరాజు
(మోహ పుత్రుడు)

↓ **రఘునాయకులు (కన్నయ్య)**
క్రీ.శ.1760-92 ప్రాంతంలో గురజ కమదన వారి దివాను
↓
గంగరాజు
దత్తపుత్రుడు. 1851లో మృతి
↓
కుటుంబరాయుడు
1875లో మృతి

↓ **బ్రహ్మయ్య**
↓
కృష్ణయ్య
(1782-1822)

↓ **బ్రహ్మయ్య** 1830లో మృతి | ↓ **కన్నయ్య** 1816-1889 | ↓ **లక్ష్మయ్య** (అవివాహితులు)

(కన్నయ్య) ↓
దాసు శ్రీరాములు
(1846 - 1908)
↓

కేశవరావు	**నారాయణరావు**	**మాధవరావు**	**గోవిందరావు**	**విష్ణురావు**	**మధుసూదనరావు**	**శారదాంబ**
1867 -1934	1869-1905	1871-1934	1874-1944	1876-1939	1878-1948	1881-1899

మహాకవి దాసు శ్రీరాములు గారి వంశము వృద్ధి చెంది, వారి వంశీకులు గొప్ప విద్యాధికులై, రచయితలుగా, శాస్త్రజ్ఞులుగా, న్యాయవాదులుగా పత్రికా, విద్యా, వైద్య రంగ ప్రముఖులుగా, కళాకారులుగా, సంఘ సేవకులుగా, దేశ, విదేశాలలో ఉన్నత స్థానాలలో వెలుగొందుతున్నారు.

(కీ॥శే॥ దాసు విష్ణురావు గారు వ్రాసిన 'దాసువారి వంశచరిత్ర' 1939 ఆధారంగా)

పీఠిక

తెలుఁగులో నాటకములు వ్రాసిన వారిలో నేను మొదటివాఁడనుగాను. కాని యింతవఱకు అచ్చ తెలుఁగులో వ్రాయబడిన నాటకములు లేవని తలఁ చెదను. సంస్కృతములోఁగాని, తెలుఁగులోఁగాని, నేనెక్కుడుఁబాటుపడి నేర్చిన నేర్పరినిఁగాను.

౧౮౯౭ (1897) వ యేడు నవంబరునెల పందొమ్మదవనాడు నేనొకానొక పనిమీద మదరాసు తిరువల్లిక్కేణికి వచ్చి యుండఁగా, బి.యే. చదువు పిల్లలు కొందఱును, గెల్చిన పిల్లలు కొందఱును నన్నుఁ బురిగొల్పఁగ, **'అభిజ్ఞాన శాకుంతలమే'** ముందు దెలిగించెదనని పూని రెండవయంకములోని "అనాఘ్రాతం పుష్పం" అనుదానిని దెనిఁగించుటలో నీ క్రింది పద్దెము పొసఁగెను.

గీ. ఎపుడు మూచూడని విరిగోఱిడని చిగురు
గ్రుచ్చని రతన మానని క్రొత్త తేనె
మించు నోములపంట నమ్మించిరూపు
నెవనిఁ గలయంగఁ గూఱ్చునో యెఱుఁగనలువ.

ఇది యచ్చతెనుఁగుగా నుండుటఁజూచియుఁ, బిమ్మట నాలోనేను పరికించుకొనుటలో నచ్చ తెనుఁగులో నుండుట కొన్ని వితములచేత మంచిదని తోఁచియు పొత్తమంతయు నచ్చతెనుఁగులోనే వ్రాసితిని.

పెట్టుపేళ్లు మట్టుకు మున్ను వాడినవే వాడఁబడినవి. రెండు మూడు చోఁట్లలో సామితెలు చెప్పవలసినప్పుడు, 'దిక్కు,' 'లోకులు', అనునట్టి మాటలు చేరినవి. ఆ మాటలు మార్చిన యెడల వాని యందము చెడునని తలఁచితిని.

పొత్తమంతయునైన పిమ్మట, ఆఁట క్రింద నీనాటకమును వాడుకచేయు వాఱలకుఁబనికి వచ్చునట్లుగాఁ గొన్ని 'టోమిరీ' పాటలు విడిగా నిందుఁ జేర్చఁ బడినవి. ఏ పట్టున నేది వాడుక చేయవలయునో యదియుం దెలియఁజేయఁ బడినది.

కొన్ని పని తొందరలచేత, ఇఱుబదినాళ్లలోనే ముగించఁబడినది. ఎట్టులైన నా తెలివితేట లింతకంటె నెక్కువలు కాఁబోవు. తప్పులుండక పోవు.

తిరువల్లిక్కేణి

౧౮౯౭ వ సం॥ డిశంబరు ౧౦ తేది దాసు శ్రీరాములు

విషయ సూచిక

పదునెనిమిది టోమిరీల వరుస కూర్పు

శ్రీరస్తు

అభిజ్ఞానశాకుంతలము

అచ్చతెనుగు

మొదటి యంకము

ప్రస్తావన - నాంది

సీ. పుట్టించునెఱ దంట మొట్టమొదటి చేత
  వితము లారసి వేల్చు వేల్మితాల్పు
వేలిమి కూడీగి వెలయు దివాణంబు
  పగలు రాతిరులయేఱ్పాటు నెళవు
పున్నమ యమవసల్ వన్నె మీఱిన చోఁటు
  జగము బ్రాకిన సద్దు సంచుమూట
అన్ని బూతాల గూడలరించు సామాను
  ఉసురు దారులకుసురొసఁగుఁబ్రాపు

తే.గీ. ఎల్లఱకు దెల్లమైన యీ యెనిమిదైన
రూపుల ననఁగి పెనఁగి యెఱుంగఁబడిన
యన్ని కలుములతో నొప్పుచున్న జాణ
మేలొసఁగి కీడుఁదొలఁగించి మిమ్మునేలు. 1

(నాందియైన పిమ్మట)

సూత్ర : (తెఱవంకఁ జూచి) తెఱలో నడపవలసిన పని యంతయునైనదా?
ధారుడు అట్లయిన యెడల కొంచెమిటురా.

నటి : (వచ్చి) సామీ! యిదిగో వచ్చినాను నాకు సెలవీయఁదలంచిన పనియేమి?

సూత్ర : ఈఱచ్చకు వచ్చిన వాఱందరును చక్కఁగాఁ జదువుకొన్న పెద్దలు. ఇప్పుడు చేయవలసిన పని విను. ముందు కాళిదాసులవారు చేసిన యభిజ్ఞానశాకుంతలమను నాటకము జగమెఱిఁగినదే కదా; దాని

నిప్పు డచ్చతెనుఁగులో దాసు శ్రీరాములు గారు చేసినారు. ఈ నాటకమును మనము చక్కఁగా నీ వచ్చిన వారి యెదుట నాడి పాడి వినిపించవలయును; కాన మన వేసంగాండ్రును వేసఁగత్తె లందఱును ఏ కొఱతను రానీక నెఱవేర్చవలెను.

నటి : సామీ! తెలుఁగు నాటకము యీ వచ్చిన రచ్చవారికి నిచ్చ దీర మెచ్చుఁదగియుండునా?

సూత్ర : ఇటువిను.

గీ. కఱి మొదవుపాలు వెల్లావు కమ్మపాలు
వేల్పుల బాస తెలుఁగును వేఱు గావు
కలియుఁగలిపినఁ గలపక కలియఁబోవు
మేపి నాతని చేతివిరూపు చవులు 2

నటి : మీరు చెప్పినది సరే కాని దాసు శ్రీరాములుగారు అచ్చ తెలుఁగులో వ్రాసినారే. అదియేమి చవిగానుండును.

సూత్ర : నటీ! యిటు విను. చిన్న బిడ్డ తప్పటడుగులు ముద్దుగా నుండక యుండునా.

గీ. తల్లివేలుపు బాసకు బిల్లలెంద
ఱున్న ముద్దుల కూతుర దొక్క తెనుఁగె
చంకదిగదని చిట్టాట జాడ జూపి
తప్పటడుగుల నడిపింప దలఁచు చుండ్రు. 3

నటి : సామీ! మీరు మిక్కిలి నేర్పుఱులు ఏ కొఱతయునురాదు.

సూత్ర : ఉన్నది యున్నట్లు నీతో నొకమాట చెప్పుచున్నాను విను.

గీ. ఎఱుక గలవారి మేల్మెప్పు వరకు గాని
తలఁచనే మంచిదని కూఱ్పు తెలివి తేట
వచ్చు నే నమ్మఁగడు దిద్ద బడినదైన
తనదు డెందంబు తనయంత దానయగుచు. 4

నటి : (మరియాదగా) సామీ! మీరు సెలవిచ్చినది సరిగా నున్నది. ఇకను తరువాయి యెట్లు నడచుకొన వలసినదో సెలవిండు.

సూత్ర : ఈ అచ్చుకు విచ్చేసియున్న వారి యిచ్చఁదీర్చి మెచ్చుకొనఁ జేయుట కంటె మనకు మఱేమి పనియున్నది?

నటి : సామీ! ననకాఱు, ఉబ్బకాఱు, వానకాఱు, ఱెల్లుకాఱు, చలికాఱు, చలువకాఱు అని ఆఱు కాఱులు గదా; ఇందు ఏ కాఱు మీద పాట బాడిన బాగుగానుండును.

సూత్ర : నేనో నేనోయని మన ముందఱ చిందు లాడుచున్న దానిని వదలివేసి, వెనుకనున్న దానిని వెదకి పట్టుకొనఁబోవుట మంచి పని కాదు; ఇప్పుడు మన పాలబడి యున్న వడకాఱునే మెచ్చిపాడుము.

గీ. నీటఁగడు హాయిగా నోలలాటలు గలి
గొట్ట విరులెనయు నడవి కూన తెమ్మె
ఱలు ముదురునీడ వడినిద్దురలును గలిఁగి
చివఱ ప్రొద్దుల ననువులైనది పవళ్లు. 3

నటి : మంచిది సామి! (అని పాడుచున్నది)

గీ. తేటి ముట్టియు ముట్టక నీడు చెదని
సుత్తు మెత్తని సన్నంపుజూలు కుచ్చు
కొనలు గలిగిన దిరిసెన ననలు గనిక
రమునఁగొన చెవి నునుతురు కొమిరెగములు 4

సూత్ర : మేలు మేలు! వాహ్! సెబాస్! ఏమియిది! ఈ యాటసాల యంతయుఁ జిత్తరు బొమ్మలతోఁగూడుకొని యున్నట్లున్నది కదా! ఆహా! ఎంత చక్కఁగాఁ బాడితివి! సరేకాని యిప్పుడు మనము, ఏయాట యాడి యీఅచ్చుకు విచ్చేసిన వారి మెచ్చుదల బడయఁ గలము?

నటి : సామీ! ఏమియిది! యీలాగున నడుగుచున్నారేమి? బాగుగానే యున్నదే. ఇంతకు ముందే, అచ్చ తెనుఁగులో వ్రాయఁబడిన "యభిజ్ఞాన శాకుంతలమును", ఆడిచూప వలసినదని సామి సెలవిచ్చి యున్నారే, మఱచినారా యేమి?

సూత్ర : ఓహో! యెంతమఱుపు దట్టినది, యిప్పుడు గెపితికి వచ్చినది. ఇదంతయు నీ పాట సొక్కే సుమా.

క. ఒడియంబడితిఁ దటాలున
కడుజిలిబిలి కులుకు రవురుగలనీపాటన్
వడివడిగ లేడిచే ని
య్యెడ దుష్యంతుఁడను పుడమి యేలిక పోలెన్. 5

ప్రస్తావన సరి.

శ్రీరస్తు

అభిజ్ఞానశాకుంతలము

అచ్చతెనుఁగు

మొదటి యంకము

(విల్లునమ్ములును జేత బట్టుకొని తేరెక్కి జింకనొకదానిని వెంటఁదగిలి సాహిణితో, దుష్యంతుఁడను పుడమి ఱేఁడు వచ్చుచున్నాఁడు.)

సాహిణి : (పుడమిఱేనిని, జింకనుఁ జూచి) చూడుండు ఏలినవారు.

గీ. కొదమ లేఁడిఁజూచి కొప్పున కెక్కిన
నారి వింటి నిన్ను దేఱి చూచి
సరిగ మెకము వెంట నఱుఁగుపినాకంబు
దాల్చుమేటి వంచుఁ దలచు చుంటి. 6

దుష్యం : ఏమి యీ లేఁడి సాహిణీ! మనల నెంత మేర దాటించు కొని వచ్చినది! ఇంకను జూడు దీని పొడిమి పొక్క. (అచ్చరువుతో) ఆహా ఏమి యీలేఁడి దౌడు. ఎంత వెంటఁబడ తగిలినను జూపునకే యందుటలేదే?

చ॥ మెడమరలించి సోయగము మీరఁగజేరఁగఁ బారుతేరు వెం
బడిఁబడ మిట్టిచూచు మునుమై వెనుమైఁగుదియించుఁ గోల పైఁ
బడునని దబ్బమేపు సగఁ బాల్దిని వేనటఁ ద్రోవఁగ్రక్కు మీ
దడుగులు లెస్స క్రిందదుఁగు లక్కడ నక్కడ బోవుఁజూడుమీ. 7

సాహిణి: చిత్తగించుడి యేలినవారు. ఈ నేల మిట్టపల్లాలుగా నున్నది. అందుచేతఁ బగ్గాలు బిగఁబట్టినాను. తేరునడక మందగించినది. లేఁడి దవ్వులు దాటిపోయినది. ఇప్పుడు మనము సరినేలఁ బట్టినాము. ఇకను మీకు దొరకకపోదు.

దుష్యం : అలాగయిన యెడల పగ్గాలు బిగఁబట్టక వదలించుము–

సాహిణి: ఏలినవారి శలవు చొప్పునఁజేయుచున్నాను. అయ్యా! ఇపుడు

చూడుండుc(అని యరదము వడినిc జూపి) చూడుండయ్యా. చూడుండయ్యా.

ఉ. పగ్గము లొగ్గుడుంబొడుcగు పాఱిన మున్నొడళుల్ కదల్చుటల్
నెగ్గని కుంచెలున్ నిగిడి నిక్కిన వీనులు గల్గి డెక్కలన్
నుగ్గయి లేచు దుమ్మొడయ నుంగడ చూపక తేరి గుఱ్ఱముల్
తగ్గకc బాఱు లేcడి వడి దాటుల కీరసపట్టి యోయనన్. 8

దుష్యం : (సంతసముతో) ఔరా! ఈ గుఱ్ఱములు పగcటి దేవర పచ్చగుఱ్ఱాల నటుండు మంచున్నవే. సేబాస్. సేబాస్.

చ. నలుసును దొడ్డగుం దటుకునన్ నడుcదూటగునద్ది చేర్చిన
ట్లలరునుcబుట్టుసారమల కైనది తిన్నcగc గన్నుcదోయికిన్
బొలుచును లేదు దౌలదిదిపోయననే, మఱిప్రక్కప్రక్క చా
యలదిదినాcగనే, నిముస మైనను నాయరదంబు నెవ్వడిన్. 9

సాహిణీ యిదిగో చూడు. ఇప్పుడే యీ జింకను డింకcగొట్టించు చున్నాను. (అని వింటియందమ్మునుc గూర్చుచున్నాడు) (తెఱచాటున)

ఓహోహో రాచకుమారుcడా! ఇది తపసుల పల్లెలోc బెఱిcగిన లేcడి. దీనిం జంపరాదు. చంపరాదు.

సాహిణి: (మొగముcద్రిప్పి చూచి) అయ్యా ఇదిగో చూడుండు. నీ యమ్ము పడునంత మేర నున్న యీలేడికిని నీకును నడుమcగొందఱు తపసులు వచ్చుచున్నారు.

దుష్యం : (తొందరపడుచు) అలాగైన యెడల పగ్గాలు బిగియబట్టుము.

సాహిణి: ఏలినవారి సెలవు చొప్పునc జేయుచున్నాను.

(వైఖానసుcడను తపసియు, ఆయన యొద్దcజదువుకొనుచున్న పిల్లవాండ్రిద్దఱును వచ్చుచున్నారు.)

వైఖా : (చేయెత్తి) ఓ రాచబిడ్డా! ఈ మెకము మాతపసి పల్లెలో నుండు జింక. దీనినిఁ జంపకూడదయ్యా.

గీ. కొట్టఁగూడదు కూడదీ కోలనిట్టి
మెతకమేని మెంకంబు పూఁ బొతకఁజిచ్చె
అతుకులగు లేఁడిపిల్లల బ్రతుకులేఁడ
తొఱ్ఱిలని పట్టుపసల నీ తూపులేడ. 10

ఆ.వె అంగలాఱ్చు వారి బెంగఁదీర్చుటకె మీ
యమ్ము, తప్పులేని యట్టి వాని
నడపఁరాదు, కానఁ గడు బెట్టుతోనున్న
యంపఁగోల నెక్కు డింపుమయ్య. 11

దుష్యం : అయ్యలారా! ఇదిగో నా విల్లెక్కుడించినాను. (అని యట్లు చేయుచున్నాడు.)

వైఖా : (చెలఁగుచు) పురువంగడమునకుఁ బరువుఁదెచ్చిన నీ విట్లే చేయుదువుకాని మఱి యొక లాగునఁజేయవని నే నెఱుఁగుదును.

ఆ.వె. పురుని వంగడమునఁ బుట్టువు గల్గిన
దంట వీవు నీకుఁ దగు సెబాషు
ఇట్టి మేలుగొనము లుట్టి పడఁగ నెల్ల
పట్టు లేలు నొక్క పట్టిఁగనుము 12

పిల్లలు : (చేతులెత్తి) అల్లారుముద్దుగా నీ యుల్లమును సంతసిల్లం జేయునట్టి యెల్ల జగమునుఁ జల్లగా నేలు పిల్లవానిం బడయుదువు గాక.

దుష్యం : (జోహారు చేసి) పాఱుల దీవెనలు బమ్మ దీవెనలుగాఁ గైకొంటిని సామీ.

వైఖా : ఓ రాచకొమరుడా! సమిదెలు వెదకి తీసికొని పోవుటకు మేము పైనమై వచ్చితిమి. ఇది మా కులపెద్దయగు కణ్వుని కాపురమగుఁ దపసి పల్లె. ఇచ్చట మాలిని యను పేరుగల యేఱున్నది. దాని

యొద్దుననే ఈ పల్లె యున్నది. మీకు మఱి యొక పని తొందర లేని యెడల నచ్చటికి దయచేసి తగు మరియాదలనుఁగైకొనుటకుఁ గోరుచున్నాను. అదియుంగాక.

గీ. తపసిపని కల్మికల వారి తంతరమ్ము
లంకిలిఁ దొలంగి సొబఁగులై యలరఁదేరఁ
గాంచి తెలియంగఁ గల వల్లె కాయలెక్కు
నా బుజమ్మెంత మేరకు న్మనుచు ననుచు.

దుష్యం : మీ పెద్దలిచ్చట దయచేసి యున్నారా?

వైఖా : పల్లెకు వచ్చిన వారికిఁ దగు మరియాదలు సేయుటకుఁ దన కూతురైన శకుంతల నేర్పఱచి, ఆ చిన్నది నోచిన నోములు ఇంకనుఁ బండనందున ఆ కొఱతఁ దీర్చుటకు సోమతీర్థమను చోటికి ఇప్పుడే వెళ్లియున్నారు.

దుష్యం : (తనలోఁదాను) కానిమ్ము ఆ చిన్నదానిని నేను చూచుట కలుగుచున్నది. (వెలుపలికి వినఁబడునట్లు) నాకా తపసుల పెద్దయందు హత్తియున్న బత్తిని, ఆ బిత్తరియే తెలియఁజేయఁ గలదు కదా.

వైఖా : ఓ రాచకొమరుడా! ఇఁక మాపనులమీద మేము పోవుచున్నాము. (అని పిల్లవాండ్రతో వెళ్లిపోయెను)

దుష్యం : సాహిణీ ఇకను గుఱ్ఱములనుఁదోలుము. ఈతపసుల పాళెమునుఁ గన్నులతోఁ జూచి పున్నెము నొడిఁగట్టుకొందము.

సాహిణి: అయ్యా! తమసెలవు చొప్పునఁ జేయుచున్నాను.(అని మఱల తేరును వడిఁగా నడుపుచున్నట్టు చూపుచున్నాడు.)

దుష్యం : (నలువంకలఁజూచి) సాహిణీ! ఇదే తపసి పల్లె యని మన కొకఱు చెప్పకున్నను ఇది చూడఁగనే జడదారులు కాపురము సేయు పల్లెయని తెలియవచ్చుచున్నది.

సాహిణి: అది యేలాగు అయ్యా!

దుష్యం : నీకుఁ గనఁ బడుట లేదా? ఈ చోటుచూడు.

చ॥ చిలుకల గూళ్ల నుండి పడుచెట్టుల క్రిందిని వారి వడ్లగిం
జలొకట గారకాయలన ణంచిన నున్నని రాళ్లు నమ్మికల్
కలచను వాడితెన్ను విడ కన్‌సడి సైఁచు మొకాలు నారవ
ల్వల కొననీటి చాల్కొలని బాటలెపోయెడి యాల మిచ్చెడిన్. 14
మఱియు

చం॥కరువలికాడు కాల్వ జలకంబులు ప్రాఁకుల వేళ్లు దోమెడిన్
తెరలు, చివుళ్ళ కుందొవరు తీఱులు నేతి పొగల్ పయింబడన్
చొఱవను దబ్బమోళ్ళు గల చోటుల లోపలి దాపుతో పులం
దెఱఁబులుమేయగాఁదిఱుఁగు, నిఱ్ఱుల కుఱ్ఱలు, మెల్లమెల్లగన్15

సాహిణి: మీరు చెప్పిన దంతయు సరిగా నున్న దయ్యా!

దుష్యం : (కొంచెము లోపలికి నడచి) సాహిణీ! ఇదిగో ఈ పల్లెలోనున్న వారికి రవంతయైన తొందర కలుఁగరాదు సుమా. ఇక్కడనే తేరు నిలుపు. నేను దిగుచున్నాను.

సాహిణి: అయ్యా! పగ్గములను పట్టుకున్నాను. ఏలినవారు దిగవచ్చును.

దుష్యం : (దిగి) సాహిణీ! తపసులు కాపురము సేయునట్టి యడవులలోనికిఁ జొచ్చునప్పుడు మనము మిక్కిలి యణగి మణగి యుండవలెను. సరే కాని యిది పుచ్చుకో (అని తన చేతిలోని విల్లును, అమ్ములును సాహిణి చేతికిచ్చి) నేను ఇక్కడి పెద్దలనుఁజూచుకొని వచ్చు వరకు ఈ గుఱ్ఱముల వీపులనుఁ దోముచు నీవిక్కడ నుండుము.

సాహిణి: అలాగే చేయుచున్నానయ్యా!

దుష్యం : (ఇటు నటు గొంచెము నడచి చూచి) సరే తెలిసినది, ఈ పల్లె లోపలికిఁబోవుటకు ఇదే పుంత. ఈ పుంత దారినే పోయెదను.

(అని లోపలికిఁ జొఱ బాఱునట్లుగాఁ గనపఱచి, తనకొక మంచి సగినమైనట్లు తెలుపుచు)

క. ఇది తపసి పల్లె కడునె
మ్మిది; బుజమదిరెడిని దీని కేమేలగుఁబోఁ
గదియఁగ వచ్చెడి కలిమికిఁ
గదియుచునేయుండు నెల్ల కడలం దెరువుల్ 16

(తెఱచాటున)

చెలియలారా! ఇదిగో ఇదిగో ఇచ్చట

దుష్యం : (చెవిని ఆ వైపుగాఁ ద్రిప్పి వినినట్లుండి) ఇదిగో ఈ తోపునకు దక్కినముగా ఎవతో మాటలాడుచున్నట్లు వినవచ్చుచున్నది. ఆ వైపునకుఁబోయెదను. (చుట్టు తిఱిగి చూచి) ఓహో ఇదా! వీరు తాపసి కన్నె పడచులు. ఒడ్డుఁబొడుఁగులకు సరియైన బుడ్డి కుండలతో చిన్న చెట్లకు నీళ్లుఁ బోయుటకు ఇచ్చటికే వచ్చుచున్నారు.

గీ. రాణివాసంబు వారికి రాని సొగసు
పట్టెఁగా యిది జడదారి పల్లెవారి
తీవికులు కులఁ బూదోఁట తీవియలనె
యడవి తీవెలు తోసిరాజనిన యుట్లు. 17

ఈ తోటలోని చెట్ల నీడను నిల్చి వీరి యంద చందములనుఁ గనుంగొనియెదను.

(ముందు చెప్పియున్న పని మీదనే యిద్దఱు చెలికత్తెలతో శకుంతల వచ్చుచున్నది.)

శకుంతల : సకియలారా ఇదిగో ఇటు జూడుండు.

అనసూయ: చెలీ శకుంతలా! అయ్యగారికి నీమీదనున్న నెనరునకంటే ఈ పల్లెలోని చెట్ల మీదనే యెక్కువ నెనరుషుమా. ఏలనంచ్చున్నావా?

ఓషీ! జాజిపూల దండ కాదషేనీ యొదలు ఇసువంటి సుతు మెత్తని దానవు. నిన్ను ఈ చెట్ల కుదుళ్లకు నీళ్లు పోయుమన్నారు. కదా!

శకుం : అయ్యగారు చెప్పినారనియే అనుకొంటివా యేమి? నేనుఁగూడ ఈ మొక్కలనుఁ దల్లి తోడుఁగాఁజూచుకొనుట లేదా అనసూయా! (అని నీళ్లు పోయుటనుఁజూపుచున్నది.)

ప్రియంవద : అమ్మాయీ శకుంతలా! ఇదివరకే నీళ్లు బాగుఁగాఁ గట్టియున్న చెట్లు ఈ వడకాఱులోఁ బూత కెక్కినవి. కనుక పూత విడిచిన చెట్లకిప్పుడు నీళ్ళు పోసితిమా పున్నెము కట్టుకొను చున్నాము.

శకుం : ప్రియంవదా, నీవు చెప్పిన మాట నిజమే సుమీ (అని తిరిగి నీళ్ళు పోయుటనుఁ జూపుచున్నది.)

దుష్యం : ఆఁ ఏమి యిది, ఈ చిన్నది కణ్వుల వారికిఁ గూతురా! వారు మిక్కిలి పెద్దలే. ఇంత పరికించ కుండఁ బని చేసినారా! దీనినా! ఈ పనిలోఁ బెట్టవలసినది. ఇది బాగుగా నున్నది కాదు.

గీ. ఔర యిది సాజమైన మితారిరూపు
జోగి మోములఁ గడతేఱ్ఱ జూచునట్టి
గబ్బి జడదారి సమిదెల ఱెబ్బనల్ల
గలువఱేకు మొనంగోయఁగవియు నిజము 18

ఏదయినఁగానీ, ఈ చెట్లచాటున నుండి ఎవ్వఱికినిఁ, గనపడకుండా డాఁగి ఈ చిన్నదాని యట్టుపుట్టువులు గట్టిగానారసెదను. (అనియట్లు చేయుచున్నాడు.)

శకుం : అనసూయా! చూడు ఆ ప్రియంవదను కొంచెము రవిక తిన్నఁగా ముడివేసి పొమ్మంటిని ఎంతఁబిగియఁగట్టినదో చూడు. అబ్బా! క్రిక్కిఱిసి నట్లున్నదమ్మా. కొంచెము వదులు చేసెదవా?

అనసూయ : అలాగే ఏదీ (అని ముడి సడలించు చున్నది.)

ప్రియం : (నవ్వుచు) ఓషీ, శకుంతలా, నన్ననవలసినది లేదు షుమా. నీకు

ఈడు వచ్చినది. (మెల్లగా) నీ కులుకుపాలిండ్లననుకో. అవి యిమడకున్న నేనేమి చేయుదును?

దుష్యం : ఉన్నమాట చెప్పినది ప్రియంవద. దీని మేని సింగారమునకీ నారచీరె తగినది కాదు.

చ॥ జిగిబిగి జవ్వనం బెగయఁ జిత్తిన బిత్తరి క్రొత్త క్రొత్త సో
యగమిది పండుటాకులగుయారముఁగప్పిన పూవుపోలికన్
నిగ నిగలం బయల్పఱుప నేరదు వ్రేల్ముడి మూపురాయఁగన్
బొగరుఁదనమ్ము నారముడి పుట్టములోఁబడి గుబ్బలుండగన్. 19

కాని ఈ నార చీరె తగని దైనను దీని మేనిమెఱుఁగను రవంతయైన దగ్గించ లేకున్నది సుమా.

ఉ॥ తామరపూవు నాచుమడతంబడియుం గననొప్పునెంతయున్
బ్రామిడి యయ్యుఁజూడ మురిపంబగుఁ జందురులోఁగలంకునీ
కోమలి ప్రానిపీచుముడి కోక కడుంగనుదోయి మన్చు, నే
లా? మిసి మెక్కుమేనులకు నా నగ లీనగలంచు నుంచగన్
ఇంతియ కాదు. 20

గీ. ముద్దియకు నారవలువెంత ముతక దైన
నించుకయు మేని మెఱుఁగు దూలించదయ్యెఁ
గ్రొత్త నెత్తమ్మి పూఁదూడు గొంతుకొంత
విడువగఱగఱ గఱుకైన తొడిమపోలె. 21

శకుం : (ముందుచూచి) చెలియలారా! ఇదిగో చూడుండు ఈ గున్న పొగడ గాలికిఁ గదలుచు నన్ను వేగిరము నీళ్ళు బోయరమ్మని పిలుచుచున్నట్లున్నది. అవిగో ఆ చివురుటాకులు వ్రేళ్ళ వలెనే యున్నవిసుమా. దానికి ముందు నీళ్ళు పోయవలెను. (అని వెళ్ళఁ బోవుచున్నది.)

ప్రియం : శకుంతలా!వేగిరించకు ఇక్కడనే కొంచెము సేపు ఉండరాదా ఏమిషి.

శకుం : ఎందుకు ఆలాగు చెప్పుచున్నావు.

ప్రియం : ఇదిగో ఇచ్చటి పొగడచెట్టునుఁజూడ నీవు ఈ చెట్ట దాపున నున్నంత వరకు తీగె ప్రాకిన చెట్టు వలెనున్నది.

శకుం : నీకీ పేరు బెట్టిన వారెవ్వరో కాని ఎంతో పరికించి పెట్టినారు షుమా. నీమాటలు మామిడిపండ్లను మించి యున్నవి.

దుష్యం : మామిడిపండ్ల వలెఁదియ్యఁగా నుండుటయే కాదు. నిజము కూడ అంతే.

క. కెమ్మోవి చివురు లేవియ
కొమ్మలు నెటకేలు దోయి కోరం దగియెన్
నెమ్మేని తానకమ్ముల్ల
ఱెమ్మిన జవ్వనము క్రొవ్విరింబురుడింపన్ 22

అనసూయ : శకుంతలా! ఈగున్న మామిడి చెట్టునకు ఈ సన్నజాజి తీగె కోరుకున్న మనుముగానున్నది షుమా! ఈ విరజాజి పెండ్లికూతురి పేరు అడవి వెన్నెల యని కాదా నీవు పెట్టినావు?

శకుం : (విరిజాజి తీఁగెనుఁజేరి) ఎప్పుడేది జరుగవలెనో అప్పుడది జరుఁగవలె షుమా. ఈ కాఱున ఈ యెల మామిడికి ఈ లేఁదీగె అల్లిబిల్లిగా నల్లుకొనుట ఎంత చక్కగానున్నదో చూడు. ఇది లతకూన, ఈగున్నమావి కొమ్మల మేలువాడు, సరిపోయినది. (అని చూచుచు నిలచియున్నది.)

ప్రియం : (ఎలనగవుతో) చెలియా అనసూయా, ఈ విరిజాజినిఁ దేరిచూచుచు ఈ శకుంతల నిలచియున్నది. ఎందుకో నీ వెఱుఁగుదువుషే.

అనసూ : అది యేమో నాకుఁదెలియదు. నీవే చెప్పుము.

ప్రియం : ఈ విరజాజి ఈగున్నమామిడిని ఎష్ట్లాకలసిమెలసి యున్నదో అష్టుగానే తానునుఁ దగిన మగనితో ననఁగి పెనఁగి యుండవలెనని షుమా.

శకుం : (ఈసుతో) తమకేలాగుననో అందరికి ఆలాగుననే అనుకొందురు. నీ కటువంటి కోరిక లున్నవి కాcబోలు. (అని నీళ్ళబుడ్డినిc దటుక్కున గుమ్మరించుచున్నది).

అనసూ : అమ్మాయీ శకుంతలా, అయ్యగారు నిన్నేలాగున బెంచినారో ఆలాగుననే యీ బండి గురివింద తీcగెను గూడ బెంచినారు కదా. ఆషీ దానికి నీళ్ళు పోయ మఱచినావాయేమి?

శకుం : నేను దీనినా మఱతును. ఆలాగైన యెడల నన్ను నేనే మఱచితి నన్నమాటే. (అని తీcగెనుcగాంచి) ఇదేమి వింత? ఇదేమి వింత? ప్రియంవదా? నీకొక మేలుమాటc జెప్పెదను.

ప్రియం : నాకేమి మేలు? అదేమిటో చెప్పు అమ్మా.

శకుం : కాఱు తప్పిపోయినను, ఈ బండిగురివింద తీcగె మొదలంట మొగ్గలు గెలపోసినది చూడు.

ఇద్దఱు : (వడివడిగా నడచుచు) ఆలాగుషే, ఆలాగుషే, నిజముగా, నాతోడు.

శకుం : మీతోcగల్లలాడెదనా ఏమిటి? కుడువc బోవుచుc గూరచవు లడిగెదరేమి? చూడరాదాయేమి.

ప్రియం : (సంతసంబునంగని) శకుంతలా నాకు మేలుcజెప్పినావు సరే. దానికి మాఱుమేలు నేను నొక్కటి చెప్పుదును వినియెదవా?

శకుం : నాకు మేలేమిటి అమ్మా. ఏదో పన్నుcగడ చేసినావు కాని అదేమిటో చెప్పు. విందము.

ప్రియం : నీకు వేగిరమే పెండ్లి కాబోవుచున్నది.

శకుం : (ఈసుతో) నీకేమి పిచ్చెత్తినదా యేమి. చెప్పువారి చేదస్తమే కాని వినువారు వెట్టివారు గారు.

ప్రియం : అమ్మాయి నేను నవ్వుటాలకుcజెప్పినది కాదు. ఒకనాడు అయ్యగారు ఈ బండి గురివిందనుc జూచి ఇట్లుగా ఇది కాఱుపూc

తఁ బూయుట శకుంతలకు వేగిరమే పెండ్లి కాఁబోవుటకు సకినమని సెలవిచ్చినారు.

అనసూ : ఆషీ అష్టాగా కత, అందుచేతనే ఈ బండిగురివింద తీఁగెకు ఈమె గారు, ఇంత వేడుకతో నీరు పోయుచున్నారు.

శకుం : లేకపోయిన నీరు పోయనా మేమి?

దుష్యం : (తనలో) ఈ చిన్నదానికి ఈ కోరిక యేలాగునఁబొసఁగును. పెద్దలైన కణ్వుల వారి వంగసములోఁ బుట్టినది కాదా యేమి? కానట్లే యున్నది.

గీ. సందియంబేల యిదిదొరసాని గాఁగఁ
దగినదే కాకయున్ననిద్దంపు నాదు
తలఁపుదగులునె మంచి చెడ్డలనుఁబెద్ద
లరయుచో లోని మెళఁకువల్ గుఱులుకావెఁ 23

అయినను దీని నిజము నిలుకడమీదఁ దెలియకుండునా?

శకుం : (తొట్రుపాటుతో) చెలులారా. ఇదేమమ్మా నీళ్ళు పోయుచుండగా ఈ తుమ్మెద మిడసిపడి విరజాజి తీఁగె మీద నుంచి జమ్మున లేచి నా మొగమున ముసరి ముసరి యాడుచున్నది. నేనేమి చేయుదును ఇస్సో! (అని తుమ్మెద ముసరినట్లు చూపుచున్నది)

దుష్యం : (లోలోపల ఉవ్విళ్ళూఱుచు) సెభాష్ ఈ తుమ్మెద చేత ఈ చిన్నది తక్కిస లాడుచుండుట కూడ మిక్కిలి ఠీవిగా నున్నదే.

క. ఇఱు మూడు కాళ్ళపుఱుగే
కరణీం దిరుఁగాడు నట్లే కనులుం బొమలున్
దిరిగించు నిచ్చలేనిదె
కఱచెడినో బెళుకు చూపు కడుమెఱపుమెయిన్ 24

(కనలి చూచి)

ఉ॥ ఆఱ్ఱేడి కంటఁజూడఁబడి యంటెదు దొ(ట్రిలు దాని మాటికిన్
దీఱ్ఱేదు నాదు నేకతము దెల్పెదవో యనఁగూబ నాడికే
లాఱ్ఱిన ముట్టెదమ్మరుని యాట వడారము సొమ్మువాతెఅన్
బేఱ్ఱి తటోయిటో యని సుమీ చెడిపోతిమి వేచి తుమ్మెదా 25

శకుం : చూచితిరా చెలియలారా! ఈ తుమ్మెద మంచి చెడ్డలించుకయు నెఱుఁగక నన్నెంత గిలిగింతలు గొట్టించు చున్నదో. నన్నుఁ గాపాడరటమ్మా.

ఇద్దఱు : (చిఱు నవ్వుతో) కాపాడుమని ఎవ్వఱి నడుగుచున్నావు ఏమిషి? ఈ తపసి పల్లెలో ఇప్పుడు అందఁరిని గాపాడుచున్న దొర దుష్యంతుఁడు. ఆయనకు మొఱఁబెట్టుకో.

దుష్యం : (తనలోఁదాను) నేను వీరికిఁ గనఁబడుటకిదే యదనుగా నున్నది. (వినబడునట్లుగా) వెఱవ వలదు. వెఱవ వలదు. (అని సగము పల్కి తనలో) ఈ లాగున మాటలాడితినేని దొరనను కొందురు, కానిమ్ము ఈ లాగున ననియెదను.

శకుం : ఈ మాయదారి ఱెక్కలపుఱుఁగు నన్ను విడువనట్లున్నది. మఱియొక చోటికైన బోయెదను. (అని యొక యడుగు నడచిచూచి) ఇంకను నా వెంట వచ్చుచున్నది. ఏమి యిది.

దుష్యం : (వేగిరముగాఁజేరవచ్చి)

క. పురు వంగడమునఁబుట్టిన
దొర పుడమికి నేలికగుడుఁ దులువలపస బెం
పఱు ముగిద తపసి కన్నెల
నెఱపించెద నెవ్వడవుర విడుదుండగమున్ 26

(అందఱును దుష్యంతుని జూచి తొందరపడిరి)

అనసూ : అయ్యా! అంత గొప్ప తొందర యేమియు రాలేదు. మా చెలికత్తె యగు ఈ ముద్దరాలు తుమ్మెద జుమ్మని మొగమ్మునారడఁజొచ్చి నందునఁగొంచెము బెదరినది.

(అని శకుంతలనుఁ జూచుచున్నది.)

దుష్యం : (శకుంతల దిశ మొగముంచి) తపసుల నేమములు బాగుగా జరుగుచున్నవి గదా?

(శకుంతల సిగ్గుపడి నిలిచి యున్నది.)

అనసూ : దొరగారు మా పల్లెలో అడుగు బెట్టుట మేళ్ళలో మేలు గొప్ప మేలు గదా. మానేమములు చక్కఁగా జరుగుటకు సందియమేమున్నది. (అని శకుంతల ప్రక్కకుఁ దిఱిఁగి) అమ్మాయీ నీవు మన పాకకుఁబోయి ఈ దొరగారిని మరియాద చేయుటకుఁ దగిన పండ్లు మొదలగువానినిఁదెమ్ము. అడుఁగులు గడుఁగు కొనుటకు నీళ్ళిక్కడ నున్నవిలే.

దుష్యం : మీరు మరియాదలు సేయకపోతిరను సందియము మా కించుకయు లేదు. మీ మాటలే కమ్మతేనియల మూటలు. వాని వలననే మాకన్ని మరియాదలు చక్కఁగా జరిగినవి.

ప్రియం : మీరా లాగుననే తలఁచిన యెడల ఈ యేడాకుల యరటుల నీడసేద దీర్చుకొనుఁడు. దేవరవారిచ్చ వచ్చినంత సేపు కూర్చుండ వచ్చును.

దుష్యం : మీరు మీపనులచేత వేసటఁబడి యున్నారు గదా.

అనసూయ : సకియా శకుంతలా! మన యింటికిఁ దయఁజేసిన గొప్పవారిని మనము మరియాద చేయుట నాయముగదా. కాబట్టి అందఱమును గూర్చుందము.

(అని యందఱును గూర్చుంచున్నారు)

శకుం : (తనలోఁదలపోసి) ఏమో కాని యీ రాచబిడ్డనిఁ జూచినప్పటి నుండి నాకేమో ఒక తీరుగా నున్నది. ఈ తపసి పల్లెలో నుండు వారికిఁ బుట్టరాని బుద్ధి పుట్టుచున్నదేమి?

దుష్యం : (అందఱినిఁ జూచి) ఏమి మీ చెలిమి! ఈడునకుఁ జోడునకుఁ దగినట్లున్నదే.

ప్రియం : (చాటుగ గుసగుసతో) ఈయన రూపు చూడఁగాఁ గన్నుల పండువుగా నున్నది. ఈయన మాటలు పానకపుఁదేటలుగా నున్నవి. ఈయన యెవ్వరో దొరతనము చేయువారుగా నున్నారే.

అనసూయ : సకియా, నాకునుఁ దెలుసు కొనవలయునని వేఁడుకగానే యున్నది, అడుగుదునా? (అని బిగ్గరగా) అయ్యా! మీ కమ్మపలుకులు మాకుఁ గండచక్కెఱ పలుకులుగా నున్నందున మీరు మామాటలను మన్నించి మాఱు పలుకుదురను మానమ్మకము. మమ్ముల తొందర పెట్టు చున్నందున మిమ్మడుగు చున్నాము. దేవర వారు ఏరాచ తపసి కొలమును సింగారించిన మేలిమానికముగా నున్నారో, మిమ్ము నెడఁబాసి ఏసీమవారు దిగులు బెట్టుకొని యున్నారో, ఈ మిసమిస లాఱు సుగుమారి మేనును ఈ యడవి తపసి పల్లెలలో వేసట నందించుట కేమికతమో, సెలవీయఁగోరుచున్నాము.

శకుం : (తనలో) డెందమా ఏల తొందర పాటు. ఇదిగో, నీవు తలంచినదే తెలియఁబోవు చున్నది.

దుష్యం : (తనలో) నేనేమి చెప్పుదును. ఎవ్వడనని చెప్పుదును, కానీ ఈ లాగునఁ జెప్పుచున్నాఁడను. (వినబడునట్లు) పురువంగడమునఁ బుట్టినపుడమితేని యానతి చొప్పున పున్నెములనుఁగాపాడు పనుల నెరవేఱ్చుటకు ఏర్పాటు చేయఁబడి ఈ పున్నెంపుటడవులలో నున్న తపసుల నోములకు వెఱపు లేమైన కలుఁగు నో యని యీ కానం బరికింప వచ్చితిని.

అనసూయ : పున్నెములు చేసుకొనువారి పున్నెములు ఇప్పుడు కదా పండినవి. ఏలిన వారుండఁగా అన్ని పున్నెములుఁ జక్కఁగా నెఱవేఱు చున్నవి.

శకుం : (సింగారపు సిగ్గునుఁ జూపుచున్నది.)

చెలికత్తెలు : (ఇద్దఱి యొక్క వగ యొద్దికలు చూచి గుసగుస లాడుచున్నారు) (బిగ్గరగా) అమ్మాయీ, శకుంతలా, ఇప్పుడు నాయనగారుండ వలసినది షుమా.

శకుం : నాయనగారుండిన నేమగునేమి?

చెలి : ఉనికి మనుకులు వడారము నిచ్చియైన ఈ వచ్చిన గొప్పవారిని మరియాద చేయుదురు.

శకుం : ఏమో గుసగుసలాడుకొనుచున్నారు. ఏమో అనుకొనుచున్నారు. ఇది చూడఁగా లోపల యేమో తలంచుకొని మాటలాడు చున్నట్లున్నారు. పొండి నాజోలికి మట్టుకు రావలదు. మీ మాటలను నేను పాటించు దానను గాను.

దుష్యం : మేమును మీ చెలికత్తెనుఁ గూర్చి కొంచె మడుఁగు చున్నాను.

అనసూయ : మీ యట్టివారడిగినప్పుడు మేము చెప్పఁగూడదా. అడుగవచ్చును.

దుష్యం : చెప్ప నలవికాని గొప్ప తపసియై పుట్టు బమ్మసారి యని గట్టి పేరు బడసిన కాశ్యపుల వారికి మీ చిట్టి చెలికత్తె పట్టి యగుట యెట్టుగాఁబొసఁగెను.

అనసూయ : దేవరా అవధారుము. తనపేరిట కొలము నిలిపి వెలుఁగు చున్న కౌశికుఁడను రాచతపసి కలఁడు గదా!

దుష్యం : కలఁడు, వానిం గూర్చి వినియే యున్నాము. ఇకను దరువాయి చెప్పుము.

అనసూయ : మా చెలికత్తెనుఁ గడుపాఱఁగన్నది ఆయనగారే. కని, ఆయన

విడిచివేయఁగా మా పెద్దలైన కాశ్యపులవారు తెచ్చి పెంపు చేసుకొన్నారు. కాఁబట్టి కౌశికులవారు కడుపునఁ గన్నవారు. కాశ్యపుల వారు కన్నులఁ గన్నవారు.

దుష్యం : విడిచి వేయఁగా ననుచున్నావే. ఆ మాట వినఁగానే ఈ చిన్నదాని అట్టుపుట్టు ఆనవాళ్ళన్నియు వినవలెనని వేడుక పుట్టుచున్నది. కాన వినఁగోరుచున్నాఁడను.

అనసూయ : అయ్యా వినుండు. తొల్లి యాతపసుల రాయఁడు డెందము బిగియఁ బట్టి, ఉసురుగాలి నిలిపి, చేతులు మీఁది కెత్తి, బాసికబొట్టు వైచి, కూర్చుండి కొన్ని యెడలను, ఒంటికాలి వ్రేలిపై నిలుచుండి గొన్ని యెడలను, ఒక చేతివ్రేళ్ళతో ముక్కుమూసి కొన్ని యెడలను, పలుతెఱఁగుల తపసి నేమమునడపఁగా, జేజేలు మిగుల వెఱఁ గుపడి, మేనకయను తెఱఁగంటి యాటఁగత్తెంబించి, యానేమం బునకు చెఱుపుఁగావింప సమకట్టి యట్లు చేసిరి.

దుష్యం : వేలుపులకు తపసుల గోరంపు నేమములు చూడఁగానే గడగడ వడఁకుట కలదే, తరువాయి చెప్పుము.

అనసూయ : అంతట మంచి పూఁతకాఱు వచ్చినది. ఆ కాఱులో పుట్టవలసిన వెఱ్ఱులా జడదారి రేనికిఁ గూడఁబుట్టినవి. ఆ మేనక మేని సోయగము చూచి తమకము నిలుపలేక (అని సగము చెప్పి సిగ్గుపడి నట్లూఱ కొన్నది).

దుష్యం : ఆ పైన జరిగినదేమో తెలియుచునే యున్నది. ఓహో, ఇది యచ్చరల యాడుఁబడుచా, ఎల్లవితముల నట్లుగానే కానఁ బడుచున్నది.

అనసూయ : అయ్యా, అవును.

దుష్యం : ఓ! బాగుగాఁదెలిసినదే.

క. మానిసులనిట్టి రూపే
లా నివ్వటిలుం దళత్తళత్తళమనుడా
లీను నెఱ మెఱుఁగు దీవియ,
కానంబడ నుప్పతిలుట కలుఁగదు నేలన్. 27

శకుం : (తల వొంచుకొని యున్నది.)

దుష్యం : (తనలో) నేను కోరిన కోరికలకు సందు దొరికినది. అయినప్పటికిని ఈ శకుంతలతో చెలికత్తె యాడిన నవుటాల మాటలలో మంచి మగనిఁబొంద గోరుచున్నదనుమాట వినునప్పటి నుంచి నాడెందము రెండు వితములుగా ఇటునటు నుయ్యెల లూఁగుచున్నది.

ప్రియం : (నవ్వుచు శకుంతల వంకఁజూచి తాను దుష్యంతున కెదురై) దొరవారింకను ఏమో చెప్పఁదలంచి నట్లున్నది.

శకుం : (ప్రియంవదనుఁ దనయన్న వ్రేలు చూపి బెదిరించుచున్నది.)

దుష్యం : ఏమున్నది మేము చెప్పఁదలచినది. మీమురిపెముల మెఱుఁగు లాడినిఁ గూర్చియే ఇంకను వినఁదలంచితిమి.

ఉ॥ కాఁడలు కాయ లోగిరము గాగల పస్తుల బెట్ట నోము పెం
డ్లాడిన దాఁక నోయవలెనాయిది యవ్వల రాచ వేడుకల్
పాడగునట్లహో కులుకులం గడిదేరిన చూడ్కులొప్పునీ
యాడు మెకాలతోఁ దిఱుఁగులాడఁగనయ్యె నొయారి యెంతయున్ 28

ప్రియం : అయ్యా! యీ చిన్నది పెండ్లిపేఱంటముల జోలి తనంతటఁదాను పైవేసికొననేరదు. అయ్యగారికి ఈ చిన్నదానిని ఎల్లవితముల ఈడు జోడు గలసిన వారికే ఈవలెనని యున్నది.

దుష్యం : ఈ కోరిక యీడేరుట సుళువు కాదు సుమా (తనలో)

క. ఓ డెందమ! యిక నీ తోఁ
కాడింపుము నేడు సందియుంబునఁ జిక్కల్
వీడెను నిప్పుం ద్రొక్కిస
లాడితి వెద్దానిఁగాంచియది కెంపాయెన్ 29

శకుం : (రోసము గల దానివలె) అనసూయా, ఇక నేను బోయెదనమ్మా.

అనసూయ : ఎందుకు బోవుచున్నావు?

శకుం : ఈ ప్రియంవదను జూడు. పోరాని పోఁకలు పోవుచున్నది. ఇది గౌతమమ్మకు జెప్పుచున్నానమ్మా.

అనసూయ : అమ్మాయీ, నేనొక మాట చెప్పెదను విను. మన యింటికి వచ్చిన గొప్పవారిని మనము మరియాద చేయక దిగవిడిచి విచ్చల విడిగాఁ దిఱుఁగుట మన తపసి పల్లెవారికి నాయము కాదు.

శకుం : (ఏమియు మాటలాడక బయలుదేరి పోవుచున్నది)

దుష్యం : (పట్టుకొనఁబోయి తమకమును నిలుపుకొని, తనలో) అబ్బా! వలపులు గలవారి పనులు తలఁపులకుఁ బ్రతులే. కనుక నేను.

క. కన్నియ వెన్నాడఁ దలఁచి
యున్నిలచితి పరువు పోవునోయని యిపుడే
నున్న యెదనున్న నాచా
యన్నడచియు మఱలివచ్చి నట్లుఁదోచెన్. 30

ప్రియం : (శకుంతలకడ్డముబోయి) అమ్మాయీ నీవిప్పుడు పోవీలులేదు.

శకుం : (కనుబొమలు చిటిలించి) ఎందుచేత నేమి?

ప్రియం : ఈ రెండు చెట్లకు నీళ్ళు నీవుపోసెదనని ఒప్పుకొని యున్నావాలేదా? ఎవ్వరు పోయుదురను కొన్నావు? అచ్చి యున్న దానినిచ్చి కదలవలెను. రా, తర్వాత పోవచ్చులే. (అని బలిమిని నిలుపుచున్నది.).

దుష్యం : అయ్యో! అయ్యో! నీళ్ళు పోసి పోసి యీ చక్కని చుక్క మిక్కిలి యలసి యున్నది కనుకనే దీనికి.

ఉ॥ కోరి పనంటి మ్రోయుటను గ్రుంగె బుజాలెఱుపెక్కె గేళ్ళు సిం
గారపు గుబ్బదోయి వడకం దొడఁగెం గొలకెక్కుడాయె ని
ట్టూరుపు చెమ్మటించె జెవి నుంచిన దిర్సెమువాడ మోము చి
క్కా రెడి నొక్క చేత విడినట్టి ముడిన్ సవరింప వెంట్రుకల్. 31

కాబట్టి, యామచ్చెకంటి యచ్చియున్న దెంతో నేనిచ్చివేసెదను. (అని తన ముద్దుటుంగరము నిచ్చుచున్నాడు)

చెలికత్తెలు : (ఆ యుంగరము మీదనున్న వ్రాతను జూచి యొకతీ మొగము లొకఱు చూచుకొనుచున్నారు.)

దుష్యం : మమ్ము మఱియొకలాగున నెంచవలదు సుమా. ఇది మాకు మా దొరగారిచ్చినదై యున్నది.

ప్రియం : కనుకనే కదా యీ యుంగరము మీ చేయి విడిచి యుండఁ గూడదు. మీరు సెలవిచ్చినదే చాలును. దీని యచ్చుదల విచ్చి పోయినది. (కొంచెము నవ్వి) అమ్మాయీ, శకుంతలా ఈయనగారు నీయందు మిక్కిలి నెనరు గలవారై నీ యచ్చుదలలను దీరుమానము చేసిరి. నెనరు కలవారు మట్టుకే కాదు సుమా. రారాజు కూడనై యున్నారు. ఇప్పుడు నీవు విడువఁబడినావు పో.

శకుం : (తనలో) నేను పోఁగలనా యిచ్చటినుండి. (బయిలకు) ఓయమ్మా ననుఁబొమ్మనుటకుఁగాని, యుండుమనుటకుఁగాని నీ వెవ్వరవమ్మా?

దుష్యం : (శకుంతలనుఁజూచి, తనలో) ఈ చిన్నదాని మీద మన కేలాగున్నదో అలాగుననే ఈ చిన్నదానికి ఉండి యుండునా? ఇంతకును నా కోరికలకు సందు దొరికినది. ఏలననగా –

చ॥ కలపదు నాదు పల్కులఁదగం దన పల్కటులైన మోమెదు
ఱ్కొలుపుచు నేను బల్క నొసఁగుంచెవి, మిక్కిలి సేపు లేమదా
నిలువదు నాదు కట్టెదుట నెమ్మొగ మిచ్చి, యటైన నేమియా
పొలఁతుక చూడ్కి యన్నెమగు పోకలఁబోదొకయింత యేనియున్ 32

(తెఱలో)

ఓహో తపసులారా, మీ తపసి పల్లెలో నుండు లేళ్ళను బదిలముగాఁ గాపాడుకొనుటకుఁ గట్టాయితంపడి యుండుడు. పుడమి రేఁడైన దుష్యంతుఁడు వేటకై యీ చేరువకు వచ్చి యున్నాడు.

గీ. గుఱ్ఱముల డెక్క రాపులఁ గొట్టుదుమ్ము
కొమ్మలకుఁ గట్టు తడి నార కోకలందు
పడును సంజనుఁగెంజాయఁ బారు మిడత
గుంపు జడదారి పల్లెమ్రాకులనుఁబోలె. 33

దుష్యం : అయ్యో! మన బలగము నన్ను వెదుకుచు వచ్చి యీ తపసులు కాపురములున్న కోనలకు నలుఁగుడులు గలుఁగఁజేయు చున్నారు

(తిటీఁగి తెఱచాటున.)

తపసులారా ఇదిగో యొక యేనుఁగు దాపురమైనది. దీని వలన ముసలివారు, ఆడువారు, చిన్నబిడ్డలు మిక్కిలి ఱిచ్చపడి యున్నారు.

చ॥ ఉరువడి దెబ్బ మ్రా నొకటి యూడి తగుల్కొను నొంటికొమ్ముతోఁ
దెరలకఁగాళ్ళ నీడ్వఁబడు తీవియ చుట్టలతోడఁ వేళ్ళ గిం
దురు గొనజేసి, యత్తపసి నోముల యంకిలిరూపుఁదాల్చెనా
నరదము సూచి బీతుగొని హత్తి యొకండిదె పల్లె సొచ్చెడిన్.

(అందఱు విని తొట్రు పాటుతో నుండిరి.)

దుష్యం : (తనలో) అయ్యో ఈ తప్పు నేను జేసినదేనే. ఇది నేనే సవరించు కొనవలయును కాన, ఇఁక బోయెదను.

చెలికత్తెలు : అయ్యా యీ కాటియేనుఁగును గూర్చి వినఁగానే గుండె లదరుచున్నవి. ఇక మాకు సెలవిండు.

అనసూ : అమ్మాయీ శకుంతలా, పెద్దది గౌతమమ్మ నీకొఱకు ఎదురు చూచుచుండెను. ఇక వేగిరమే పోయి నలుగుఱము నొక చోటఁ జేరుకొందము. రాఅమ్మా.

శకుం : (తొందరపడి) అయ్యో అయ్యో! కాలూని నడవలేనే. ఎట్లు పోదును.

దుష్యం : (తడబాటుతో) మీరు పొండు మీరేమియు వెఱవవలసినది లేదు. నేనున్నను మీపల్లెలకు తొందర రానీను.

(అందఱును లేచుచున్నారు.)

చెలికత్తెలు : అయ్యా మావలన తమకు దగిన మరియాదలు జరుగలేదు. దేవర వారిని తిరిగి యొకసారి చూచుటకు మాకు వేడుక యగు చున్నది. విన్నపము చేసుకొనుటకు సిగ్గుగా నున్నది.

దుష్యం : అలాగునకాదు. మీ మొగములు చూచుటతోనే అన్ని మరియాదలు మన్ననలు మాకు జరిగినవి.

శకుం : అనసూయా! నాయఱకాలిలో దబ్బముల్లు గ్రుచ్చుకొన్నదమ్మా. సూదిలాగున నున్నదమ్మా. దెసమాలినముల్లు. ఇదిగో నా కట్టు చీరె గోరంట కొమ్మకుఁబట్టుకున్నదమ్మా. వచ్చుచున్నాను. కొంచెము నిలువ రాదమ్మా. (అని పుడమిరేని నోఱచూపులం జూచుచు మెల్లఁగా నడచి తడవు సేయుచు చెలికత్తెలతో శకుంతల వెళ్ళిపోయెను.)

దుష్యం : నాకు నగరునకుఁబోవలెనన్న వేడుక మట్టు పడినది. ఇకఁను నన్నుఁగూడి వచ్చిన వారినందఱిని ఈ తపసి పల్లెకుఁగొంచెము దవ్వున విడియించి వచ్చెదను. ఈ శకుంతల, ఈ మాటలు, ఈ తేటలు ఇవన్నియుఁజూడఁగా ఈడెందము మఱలులాగులేదు. నాకు,

క. ముందంజ బొందినడవన్
దెందంబులఁ వోక పరువిడెన్ వెనుకకుఁజూ
డం దెమ్మెర యెదుఱుగ వీ
వందూఁగెడి సిడెము పట్టు వలువం బోలెన్

(అందఱు వెళ్ళిపోయిరి.)

శ్రీరస్తు

అభిజ్ఞానశాకుంతలము

అచ్చ తెనుఁగు

రెండవ యంకము

ప్రవేశకము

(అంతట దేబిరిగొట్టు మొగముతో విదూషకుఁడు వచ్చుచున్నాఁడు.)

విదూ : (నిట్టూర్పునిగుడించి) ఏలిన వాఁడా నాసామిరంగఁడా, ఎప్పుడు చూచినఁగాని వేటోవేఁటో అను మాటకు విసుఁగు లేనివానితో సావాసము వచ్చెఁగదా నాకు, చచ్చిపోవు చున్నాను. ఇదిగో యిదిగో లేఁడి వచ్చె అదిగో యదిగో పంది వచ్చె చూడు! చూడు పులివచ్చె అంచు ఈ మండు వేసంగిలో పట్టపగలు నిప్పులు గురియు చుండగా ఏమో పుంతలట, బుగ్గియట. ఆ పుంతలైన తిన్నఁగా ఏడ్చినవా? దట్టమైన నీడలైన లేవు. పొద నీడలు ఈ కాఱడవులలో ఇక్కడ నుండి యక్కడికి, అక్కడ నుండి యిక్కడికి తిటిఁగి తిటిఁగి జిమ్మ దిరిగి పోవుచున్నది. దప్పిక తీర్చుకొందమని పోతిమా, ఈ కొండ గెడ్డలలో ఆకులు కుళ్ళి ముఱుఁగుడు కంపుగొట్టు చున్న అఱగాక నీళ్ళు గదా మాపాలఁబడినవి. ఆకలి అయినప్పుడు కమ్మని కూరాకా గడ్డలా, నంజుడింత మొగానఁ బారవేతురు. అది కడుపు లోనికిఁ బోఁగానే గుఱ్ఱు గఱ్ఱుమనిఁ చిఱు ప్రక్కలలో నొప్పి పుట్టుచున్నది. గుఱ్ఱము వెంట బఱుగెత్తి, పఱుగెత్తి, నాళ్ళు గూళ్ళు కీళ్ళు కదలిపోయినవి. ఈ రాతిరి యిట్టి కన్నుమూయు లేదుగదా! తెల్లవారు గట్లనే లేచి కొంటె లంజకొడుకులు చెంచువాండ్రు పోళ్ళరికట్టి గలగలగల గల గందరగోలము చేసి నానిద్దుర చెడఁగొట్టినారు. ఇప్పుడైనను గడచి గటెక్కితిమా గోఱు చుట్టు మీద రోఁకటిపోటన్నట్టు ఇంకొక్కటి

దాపరించినది. ఇప్పుడు నాకు చుక్కఎదురైనదను కొంచున్నాను. నిన్న మేమెవ్వరము దగ్గర లేనప్పుడు జింక నొకదానిని వెంబడించి తపసి పల్లెకుఁబోయి, అక్కడ నొక జడ చుట్టలవారి యాడబడచట. ఆబిడగారి పేరు శకుంతలమ్మట. ఆదొరసాని గారు ఈ దొరగారి కన్నుల యెదుట తళుక్కుమని బెళుక్కుమన్నదట. ఇకను మాయూరి దారిపట్టుట హుళిక్కేనట. ఊరిపేరు తలఁచుటయే మానివేసినాఁడు. ఈనాటి రాతిరి యంత ఆ చిన్న దాని మొగమేమి? ఆముక్కేమి! ఆ!హా!హా! ఆ నడకేమి! ఆ తొడలేమి! ఆ నారచీర లేమి! ఆదిరిసెన పూల బావిలీలేమి! ఆ తామర తూండ్ల కడియాలేమి! ఆ నీళ్ళ బుడ్లేమి! ఆ చెట్లకు నీళ్ళు బోయుట యేమి! ఇటువంటి తలపోఁ తలతోనే కోడికూసినది. ఇకను నాకే తెన్ను? ఏదారి? అయ్యో! ఈ పాటికి చెలికాఁడు మొగము కడుగుకొని యుండును. అతనిం జూడఁబోవలుయును. (అని కొంచెము నడచి చూచి) ఇదిగో విళ్ళు, అమ్ములు, అడవి పూలదండలు బట్టుకొని అంపసానులు వచ్చుచున్నారే. వీరి నడుమ మా చెలికాఁడు కూడ ఇచ్చటికే వచ్చుచున్నాఁడే, కానీ! ఏదయిన టక్కు చేసి ఇచ్చటనే నిలిచి యుందును. కాళ్ళును జేతులును బిగయబట్టి కీళ్ళు గదలి నడవలేని వానివలెనుందును. ఇందువలన నైన విడుదల యగునేమో! (అని యొక దుడ్డుగట్టను గడ్డము క్రింద నుంచుకొని నిలిచి యుండెను.) (తర్వాత బలగముతో దుష్యంతుఁడు వచ్చుచున్నాఁడు.)

దుష్యం : (తనలో)

క. మగువ యొక పట్ల చిక్కదు
వగలు గనం బొగులు మనము వలపుల పంటన్
బుగితికి రాకున్ననుఁ బం
డుగ నెఱపెడి నొక్క టొకటి నోరూట కడున్. 1

(కొంచెము నవ్వి) ఈలాగుననేక దావలపులపాలైన వాఁడు తన వలపుల వలెనే తాఁగన్ను వైచిన వారి తలపులు కూడ నుండునని తలంచి తుదకు నలుగుఱు నవ్వునట్లగుచున్నాఁరు. ఎట్లన –

ఉ॥ ఉఱ్ఱుటలూగె గల్కితన మొండెడఁగన్నుల నాతి పుచ్చినన్,
మిఱ్ఱు పిఱుందు వ్రేఁగు గొని మెల్లనఁబోయె నొయారముం బలెన్
జుఱ్ఱునఁబోవఁగావలదు సుమ్మన నీసునఁ జీదరించె బో
యట్టె గయించుఁబిల్లి కడి కట్టుల నాసలమారి యెయ్యెడన్2

విదూ : (అట్లే నిలచి) ఓ నెచ్చెలీ, నాకుఁగాళ్ళు చేతులు కదులాడవు. నోటి మాట, కంటి చూపుమట్టునకున్నవి. మాటలతోనే దీవించవలసి వచ్చినది. నీకు సేమమవు గాక!

దుష్యం : (కొంచెము నవ్వి) నీకీ వక్కిదనమెక్కడ దక్కిన దబ్బా.

విదూ : వక్కినదన మెక్కడదట, చూచినారా కనుఁబొడిచి కాఱుచున్న నీళ్ళకు కతమేదని యడుగు చున్నావా?

దుష్యం : ఏమో చెప్పుచున్నావునీవు. నా కేమియుఁ దెలియలేదే. అదియేమో తెలియునట్లు చెప్పు.

విదూ : సరికాని. నీటి ప్రబ్బలి చెట్టున్నది గదా. అది పొట్టిగా నుంచున్న దనుకో. అది చెట్టు పొట్టిదనమా, ఏటి నీటి గొనమా? చెప్పు చెలికాఁడా!

దుష్యం : అది యేటి నీటి పెంపు చేతనే.

విదూ : నీకును నాకును అదే సామితె.

దుష్యం : అది యేలాగో కొంచెము చెప్పు.

విదూ : ఈ లాగున నీవు ఇంటి పనులు రాచఱికపు పనులు వదలి వేసి కాకులు దూరని కాఱడవులు చీమలు దూరని చిట్టడవులనుఁ బట్టి, ద్రిమ్మరివై యుండవలసి వచ్చెఁగదా. నేను కల్లలాడు వాఁడఁగాను. నిజము చెప్పుచున్నాను. ప్రతిపూట తిఱిఁగి తిఱిగి

మెకాలనుఁ దోలితోలి నా కాళ్ళు గూళ్ళు కీళ్ళు కదలి, కదుములు గట్టి మెదలనీయవు. కనుక, నా మీద నెనరుంచి, అలయికఁ దీఱ్చుకొనుట కొక్కనాడు విడిచి పెట్టుము.

దుష్యం : (తనలో) ఈ చెలికాఁడును. ఇట్లుగాఁ జెప్పుచున్నాఁడు. నాకును ఆ తపసి కన్నియ మీద తమకము చేత వేఁటషోకు ఏటిపాలైనది. ఏలననఁగా.

గీ. కఱుకు టమ్ములఁజెక్కి సింగాణి వాంచి
యిక్కడి మెకాల మీద నేనేయఁజాల
కలికి కీయవి చూపులఁ గలికిఁదనము
ప్రక్కనే యుండి కఱపిన పగిది దోచె. 3

విదూ : (దుష్యంతుని మొగము చూచి) ఏమి దేవరా నేను కుయ్యో మొఱ్ఱో యని మొఱబెట్టుకొను చుంటినే, నీవేదో తలంపులో నుంచుకొని, నా మొఱాలకించనే యాలకించవు. "నట్టడవిలో యేడుపాయెనో నాబ్రతుకు, నాకేమి దిక్కుముందు?" అన్నట్లాయెఁగదా నా బ్రతుకు.

దుష్యం : ఏమున్నదోయి, నిన్ను గూర్చిన తలంపే కాని వేఱు తలంపేమి యున్నది. సరే నీవు నేస్తము చేసినాఁడవు. నీ మాట మీఱరాదు. అలాగే సెలవిచ్చు చున్నాను.

విదూ : వేయేండ్లు బ్రతుకు నాయనా (అని పోఁబోయెను)

దుష్యం : ఓయి చెలికాఁడా! పోవద్దు. నిలువవోయి. ఇంకను నీతో మాటలాడ వలసిన పని నిలిచియే యున్నది.

విదూ : ఆనతీవయ్యా వేగిరమే.

దుష్యం : నీకు సేదదీరిన తర్వాత నాకొక చిన్నపనిలో సాయము చేయవలెను. అది వేసట లేని పని. కాఁబట్టి చెప్పినాను.

విదూ : ఏమిటయ్యోయి. లాడో, బర్ఫీ, పూరణబూరెలో, గారె తునకలో, పోళీలో కడుపునిండ ద్రొక్కవలసి యున్నదా యేమి?

దుష్యం : చెప్పుచున్నాను. కొంచెము సేపు నిలువుము.

విదూ : అలాగే కనిపెట్టి యుంచున్నాను.

దుష్యం : ఎవ్వడురా అక్కడ?

పణిహారి : (వచ్చి) బుద్ధి బుద్ధి, సెలవిండయ్యా.

దుష్యం : ఓరీ రైవతకా, దండు పడవాలును పిలువుము.

పణిహారి : బుద్ధి బుద్ధి (అని వెళ్ళిపోయి, తిఱిగి పడవాలుతోఁగూడి వచ్చుచున్నాఁడు.) అదిగో, ఏలినవారు మీకేదో సెలవీఁదలంచి ఇటుకై చూచుచున్నారు. దగ్గిరపో సామీ.

పడవాలు : (దుష్యంతుంజూచి) వేఁటలో నేమో దోసమున్నట్టు పైకిఁదోఁచుఁ గాని ఏలినవారిపట్లమట్టునకు ఆలాగున చెప్పరాదు. అది మంచికే కాని మఱియొకటి కాదు. ఎట్లనఁగా, ఏలినవారు.

చ॥ విడువక వింటినారి బిస వెట్టఁగ పెట్టఁగ గట్టి పాఱుము
న్నొడలును గల్గి యెండలకు నోర్చి చెమఠ్చని మేను సన్నమై
బడలిన యట్లు తోచినను బట్టిన చేవను దేలికై మలల్
పొడిచెడి హత్తి నానుసురు లోపలి మెఱ్వడి మెట్టు తాల్పెడిన్4

(దగ్గరగావచ్చి) జోహారు సామీ! జోహారు. ఈ యడవిలో పఱవదోలినారము ఇకను జాలము సేయఁ బనిలేదు.

దుష్యం : ఓయి మొనగాఁడా, ఆమాదవియ్యవేఁటను జెడగొట్టుటయే కాక వేఁటమీదనున్న నాషోకంతయుఁ బాడు చేసినాడు.

పడవాలు : (మఱి యొకఱికిఁ దెలియకుండ విదూషకునితో) నేస్తకాఁడా నీ పట్టు మట్టుకు వదలక యుండుము. నేను ఏలిన వారికి మెప్పుఁ దగల నడిచెదను. (అందఱికిఁ దెలియునట్లు) ఈ తెలివితక్కువ బాపనయ్య ప్రేలుట కేమి. ఇందున కేలిన వారే తార్కాణ చూదుండు.

చ॥ సుళువుగ లేపు జొజ్జఁగఱఁచుం దల క్రొవ్వణచు న్మెకాలకున్
జలము వెఱుంగు మున్నయిన జాడలు దెల్పును విల్లుఁదాల్చుపె

ద్దలకది గొప్ప తూపు గుఱిఁ దప్పక పాఱెడి దాని నేసినన్
బలుకుదు ఱేల వేఁట చెడు వాడుక యంచది కల్ల కాదకో 5

విదూ : (రోసముతో) ఓరీ యేమి పురికొల్పుచున్నావురా? నీ తెలివి తెల్లవారినది, నా తెలివి యెంచఁబోవుచున్నావటోయి, ఉండు. దేవరకు వేఁట మీది షోకు ఊరేగినదిలే. నీ కింకను ఆస యున్నది. ఈయడవిలోబడి కొట్టుకో. తుట్టతుదకు మానిసి ముక్కు కండల మీద ఎఱగొన్న యే ముసలి యెలుగు గొడ్డు నోటనో పడనున్నావులే.

దుష్యం : ఓయీ! మొనగాడా నీవు మిక్కిలి మంచివాఁడవు. నీకెక్కడను రోసము లేదోయి. సరికాని, యీ తపసుల పల్లె యొద్ద మనమున్నాము, నీవు ఎన్ని మాటల చెప్పినను మేము వేఁటకు నొప్పుకొనునది లేదు. ఇక నిప్పుడు చేయవసిన పని యేమనఁగా.

చ॥ కొలఁకుల నీళ్ళు మాటికినిఁ గొమ్ములఁగొట్టి కలంచుఁగాక యె
న్ములు, పలుమాఱు నిఱ్ఱులగ ముల్ నెమరుల్ గొనుగాక నీడ, వి
చ్చల విడి తుంగకాయలమె సంగెడిఁగావుత గుంటపట్లఁ బం
దులు, కనుగాక యెక్కడఁచి త్రోచిన నాదు కమాను తీరికన్ 6

పడవాలు : ఏలినవారి సెలవు చొప్పున జరిగించుచున్నాము.

దుష్యం : ఆలాగయిన యెడల ముందు నీవుబోయి వలలు, ఉరులు పన్ను వారిని వలదని చెప్పి పంపు. ఈ తపసి పల్లెలో నుండు వారినిఁ దొందర చేయకుండునట్లు మన రాణువకుఁగట్టు సేయము.

గీ. తాల్మి మొదటిదిగాగల తపసులకును
మంట లెత్తెడి తేజులో మణఁగి యుండు
వెన్నడఁచి వచ్చు పెరవారి వెలుఁగు గన్న
నుమియుఁ జల్లని సురియకాంతమునుఁబోలి. 7

పడ : ఏలినవారానతిచ్చిన చొప్పుననే జరుగుచున్నది.

విదూ : అంకు తొత్తుకొడుకా. పోరా నీ పట్టుదల పాడైనదిలే.

దుష్యం : (కొలువుకాండ్రం జూచి) మీరందఱునిక వేఁటవేసములు తీసివేయుఁడు. ఓరీ! రైవతకా నీవును అట్లు చేయుము.

బలగము: మాప్పబూ సిత్తాలుండి సిత్తాలుండి (అని వెళ్ళిపోయిరి)

విదూష : ఇప్పుడు గదా యీఁగనైన దగ్గిర లేకుండఁజేసుకొంటిని. మ్రాని నీడను అల్లిబిల్లిగా నల్లుకొని యున్న తీగె పందిరి క్రింద, నున్నని రాతిమీద విచ్చేయుము. నేనును నీదగ్గిరనే హాయిగా పీటవేసెదను.

దుష్యం : ముందు నడవవయ్యా.

విదూష : రావయ్యా సామీ, రావయ్యా (ఇద్దఱును నడచిపోయి కూర్చుండి)

దుష్యం : మాదవియా నీకును గన్నులున్నవి కదా. పనిలేదు, గ్రుడ్డివాడవే. ఎందుచేత ననగా చూడఁదగిన దానినిఁజూడలేదు.

విదూష : ఏమీ దేవరవారు నాయెదుటనే యున్నారే. ఆలాగున నంచున్నారేమి?

దుష్యం : విన్నావా మాదవియా, ఎల్లవారును తమ తమ వారినిఁ జూడదగిన వారని యెంచుకొనుచునే యున్నారు. కాని నామట్టునకు ఈ తపసి పల్లెను సింగారించుచున్న శకుంతలనుఁ గూర్చియే చెప్పుచున్నాను.

విదూష : (తనలో) ఈతనికి నాగుట్టు తెలియనీను. (వినఁబడునట్లు) చెలికాఁడా, ఆమె తపసుల ఆడఁబడుచుగదా. అట్టివారి మీద మనము తమకముంచవచ్చునా? ఆమెనుఁజూచి నందున నేమి కలుఁగును. చూడఁగా చూడగాఁ గన్నులు కలఁగును.

దుష్యం : నేస్తకాఁడా ఇటువిను. మాపురువంగడములో కోరఁగూడని వారిని కోరువారు పుట్టనే పుట్టరు.

విదూష : ఆలాగైన యెడల ఇదివరకుఁ జెప్పినదంతయు నేమిటయ్యా.

దుష్యం :

క. జేజేల నెలంత కనియెఁజు
మీా జడదారి కొమరితెజుమీా యతఁడు విడం
గాఁ జిక్కెఁజుమీా విడివడి
వేజిల్లెడు మీాదఁబడిన విరిజాజి వలెన్. 8

విదూష : (నవ్వి) మిక్కిలి చక్కఁగా నున్నది గదా మీా కోరిక. తినగా, తినగా కజ్జూరము కనరై చింతపండు పచ్చిపులుసు మీాద బోవుచున్నదే! మీారు ఈ యడవికి వచ్చినది మొదలు పచ్చిపులుసే కదా మనకాదరువు. నగరులోనున్న రాణివాసపు వారిమీాద వెగటు పుట్టినదా యేమి?

దుష్యం : అయ్యో! నీవు ఆపడుచునుఁ గనులతోఁ జూడలేదు గదా; చూచిన యెడల ఈలాగున చెప్పనే చెప్పవు.

విదూ : ఓహో! మీా కనులకే అంత చక్కనిదిగాఁదోచినదా? ఇఁక దాని చక్కఁదనమడుగ వలసిన దేమి?

దుష్యం : ఓయీ! వేయి మాటలతోఁబనియేమి.

గీ. నలువ మేలైన సొబగులుఁ గలిపి మదిని
బొసఁగఁ జేసి పటము వ్రాసి యుసురుఁబోసె
నొక్కొ చూచితి బమ్మనేర్పు విదరూపు
వింతగా నెంతు నింతి మేల్బంతి చేత 9

విదూ : ఆలాగైన యెడల ఆబిడగారు తక్కిన యందగత్తెల నందఱినిఁ దలదన్నినవారే. ఆఁ! చెప్పరేమి. ఇక సందియ మున్నదా?

దుష్యం : కాని యొకటి నాడెందములోఁ దలపోయుచున్నాను.

గీ. ఎపుడు మూచూడని విరి గోరిడని చిగురు
ఁగుచ్చని రతన మానని క్రొత్త తేనె
మించు నోముల పంట నమ్మంచిరూపు
నెవనిఁ గలయంగఁగూఱ్చునో యెఱుఁగ నలువ 10

విదూ : అయ్యా, అలాగయిన యెడల ఆపడుచును నీవు తటుకున లటుకుమని పించవలసినదే. లేని యెడల ఇంతలో ఏ గారనూనెతో, దడిసిన మెతకతల ముతక తపసి పాలై పోవునో ఆ వాలుగంటి.

దుష్యం : ఆ చిన్నది యేమను కొన్నావేమి? అట్టే తనంతట తాను ఒకటికి లోఁబడుననుకున్నావా? గొప్ప తపసి యానలో నున్నది. ఇదియుంగాక పెద్దలు కూడ నింటివద్ద లేరు.

విదూ : అయ్యా, మీ కామె మీదనున్న తమకమును జెప్పినారు సరే, ఆ చిన్నదానికి మీ మీదనేమైన కన్నుఁగలిగినట్లున్నదా?

దుష్యం : అది తపసుల కన్నియ కదా. మెట్టున జాణతన మెఱుఁగదు. అయినను.

గీ. ఎట్ట యెదుట ననుంజూచి యట్టె త్రిప్పె
గన్ను లింకొక్క పని నన్న కరణి నవ్వె
గుట్టు జెడకుండ వలపు దాబెట్టుజేసి
లోనుదాగదు బయిలకు రానురాదు. 11

విదూ : ఓహూ! ఏమీ! చక్కఁగాఁగుదిరినదే. ఈసారి! దేవర వారినిఁ జూడఁగానే ఆమెగారు బిరబిర వచ్చి తొడల మీదనే కూర్చుండు లాగుననే యున్నదే.

దుష్యం : ఇంతే యనుకున్నావా యేమి? యింకను ఉన్నది. చెలికత్తెలతో వెడలిపోవుచు పరువు మరియాద అణఁకువ కలిగినదైనప్పటికి బెట్టుగానే నాయందున్న తమకమునుఁ గనపఱచుచునే నడచినది సుమా.

గీ. నమలు నడుగు దబ్బ నామంటెనని యింతి
యుఱక నాలుగడుగు లరిగి నిలచె
నట్టె విడువలాగెఁ జెట్టుకొమ్మను నార
చీర చిక్కనిదియె చిక్కెననుచు. 12

విదూ : సరే, సరే తెలిసినది. ఇకను అలాగైన యెడల బత్తెపు గింజల బస్తాలు ఇక్కడికి నడిపించవలసినదే. ఈ కాఱడవి దేవర వారికి సికారు పూవులతోట అయినదిలే పో.

దుష్యం : నెచ్చెలీ నేనిచ్చడనున్నాడని యిచ్చటి తపసులకుఁ గొందఱికి తెలియును. మనము ఏ పన్నుగడ చేసి మఱియొకసారి ఆ తపసి పల్లెకు, బోవుదము.

విదూ : ఏమి పన్నుగడ కావలసియున్నది. అయ్యా, రాయలు దలచిన దెబ్బలకు కొదువా యని మీరాయల బిరుదు మీదనే పోవచ్చును.

దుష్యం : రాయలు కాఁగానే యేమి, వారినిఁగెలువఁబోయెదమా?

విదూ : కాదు అయ్యా, మీకు ఈ జడదారి సన్నాసులు ప్రోగు చేయు నీవారి గింజలలో పుట్టికి మూడు గుంచాల అయిదుగిద్దల అంబారము చేయవలసినది కదా! ఆయంబారము మాకు కొలిచెదరా లేదా! కొంపలలో గంపలు గ్రుమ్మరించుచుండు అని అడుగుచుఁబోదము.

దుష్యం : నీవేమి పిచ్చివాడవా, వెఱ్ఱివాడవా. ఈ తపసులిచ్చు నారవపాలు నీవారి గింజలలో ననుకున్నావటయ్యా, కాదు. వారిచ్చెడి యాఱవపాలు రతనాల కుప్పలకైన మాఱ్చవలసినది కాదు. చూడు!

గీ. పంటకాపుల వలని రాబడిఁబొసంగు
పాలు ఱేండ్లుకు వెచ్చంబు పాలబోవు
కోటి తపసుల నోముల కలసి రాక
చెడని యాఱవపాలు మా చేతఁజిక్కు. 13

(తెఱచాటున)

ఆహా! ఇకను మా కోరికలు తీరఁగలవు. మానోములు పండఁ గలవు.

దుష్యం : (చెవియొగ్గి) ఏమి యీ పలుకు, బెదురు లేనిది గాను, గరువము లేనిదిగాను నున్నదే. ఇది చూడఁగాఁ దపసు లెవ్వఱో వచ్చుచున్నట్లున్నది.

పణిహారి : (వచ్చి) జోహారు, ఇద్దఱు తపసి కొమరులు వాకిట వచ్చి నిలచి యున్నారు.

దుష్యం : అలాగయిన యెడల గ్రక్కున లోపలికి రమ్మను.

పణిహారి : అయ్యా, ఆలాగుననే చేయుచున్నాడను. (అని వెళ్ళి తపసి కొమరులతో వచ్చి) చిన్న బాబులార ఈడనే.

(ఇద్దఱును పుడమి ఱేనిం జూచి)

మొదటి వాడు : ఆహా! యేమి యీరూపు, దగ దగమని మిగుల వెలుఁగుచుండియు, చంటి పిల్లకుఁ జనవిచ్చులాగుననున్నదే, ఈలాగున నుండ వలసినదే. ఈ రారాజునకును, తపసులకును సరియైన వన్నె చిన్నెలే కదా! ఏమనిన

ఉ॥ ఎల్లఱ నొక్కలాగు దనియించెడి పట్టును బట్టి నేమముల్
పెల్లుగనిచ్చు పున్నెములఁ బెట్టెల చెట్టు యితండు సైరణన్
వెల్లి కొనంగ మాటికిని వేలుపువేఁగుల వారి జంటలే
యల్లిరి రాచపై తపసి యాడిక పాటల మిన్ను ముట్టగన్. 14

రెండవవాడు : గౌతమా, ఈతఁడు వేలుపుల యేలికకు నేస్తగాఁడైన దుష్యంతుఁడా?

మొదటి వాఁడు : అవును అతఁడే యీతఁడు, కాఁబట్టి యేనా,

చ॥ బురుజుల మీదికెత్తఁ దుదిముట్టని బారలవాఁడు వీఁడుదా
నెఱదొర సంద్రముల్ దొరయు నేలకు నంతకు నంటయబ్రమా
విరివిగఁగెల్పు గోరుదురు వేలుపుఁగొమ్మలు సోకు మూకలు
క్కఱఁగసి పట్టి మార్మొనల కత్తికి నీతని యెక్కువింటికిన్ 15

ఇద్దఱు : (దుష్యంతుని దగ్గిరకు వచ్చి) నీకు సేమమవు గాక పుడమిరేఁడా.

దుష్యం : (గద్దె నుండి లేచి) మ్రొక్కు చున్నాడను మీకు అయ్యలారా!

ఇద్దఱు : పెంపు సొంపులు గలిగి లెక్కలే నన్ని యేండ్లు చక్కఁగాఁ బుడమి నేలుము పుడమిరేఁడా.

(అని, పండ్లు కానుక యిచ్చుచున్నారు)

దుష్యం : (మ్రొక్కుచుఁ గానుకఁగైకొని) అయ్యలారా! మీ సెలవున కెదురు చూచుచున్నాను.

ఇద్దఱు : మా పెద్దలు కణ్వుల వారింటిపట్టున లేరు. అందువలన రక్కసులుక్కు మీఱి మేము చేయు జన్నంపు పనులలో చిక్కులు కలుఁగఁజేయు చున్నారు. కావున కొన్ని నాళ్ళు మా తపసి పల్లెలో విల్లమ్ములుఁదాల్చి, సాహిణిని మట్టుకుఁజెంత నుంచుకొని మా పల్లెను గాపాడఁగోరుచున్నాము.

దుష్యం : మీరు సెలవిచ్చిన పనినిఁదలమ్రోచి చేయుచున్నాఁడను.

విదూ : ఇప్పుడు వీరు కోరిన పని దేవరవారికి చక్కగా నక్కఱకు వచ్చునదిగా నున్నది.

దుష్యం : (చిఱునవ్వుతో) ఓరీ! రైవతకా, విల్లమ్ములతోఁ గూడ తేరు కట్టుకొని రమ్మని నేను చెప్పినానని సాహిణితోఁజెప్పుము.

ఫణి : బుద్ధి, బుద్ధి. సామీ ఆలాగుననే చేయుచున్నాఁడును. (అని వెళ్ళెను)

ఇద్దఱు : (సంతసముతో)

క. గొడవ గల వారి గొడవల
నడcగించెడి నోము పట్టు నట్టిఱు పురువం
గడముగలారా యయ్యలు
నడచిన తెరవుననె నీవు నడచెదిది తగున్. 16

దుష్యం : (వారికి మ్రొక్కి) మీరు ముందు దయచేయుడు. నేను మీ వెంబడి వచ్చెదను.

ఇద్దఱు : పుడమి ఱేcడా? నీకు సేమమవు గాక! (అని వెళ్ళిపోయిరి)

దుష్యం : ఏమి మాదవియా, శకుంతలనుcజూడ వేడుక కలదా?

విదూ : దొరగారూ, ఏమి చెప్పను. మొదల మీరు శకుంతల రూపు రేకలు చెప్పినారే, అప్పుడు ఆకన్నె పడుచును ఎప్పుడా, ఎప్పుడా, ఎప్పుడా మనము చూచునది అని ఉత్తర వానలకు నిండిన క్రొత్త చెఱువు లాగున నా వేడుకలు తొఱుకు తొఱుకు లాడినవి, కాని ఇప్పుడీ తపసి బిడ్డ లిద్దఱు వచ్చి రాకాసులేమో పల్లె మీదcబడి పాడు చేయుచున్నారని చెప్పినమాట విన్న తరువాత విసాగ వానకుc దెగిన క్రొత్త కట్టగండి వలె గండిపడి వేడుకలన్నియు ఓడిపోయినవి. ఒక్కచుక్క నిలువ లేదు. తుదకు బురద కూడా లేదు.

దుష్యం : వెఱవకయ్యా మాదవియా. నా ప్రక్కనే యుందువు గదా.

విదూ : ఇంకనేమీ, పులిప్రక్కజోఱీcగ నైతిని. రక్కసుల వలన దప్పించుకొని బ్రతికిన వాcడనే.

పణిహారి : (వచ్చి) సామీ జోహారు. తేరు అమర్చcబడి యున్నది. ఏలినవారి రాకకు వేచియున్నది. ఇదిగోనండి అయ్యగారు మనయూరి నుండి తమ అమ్మగారు పంపినారని కరభకుcడు వచ్చియున్నాcడు.

దుష్యం : (మక్కువతో) ఏమీ! మా అమ్మగారు పంపినారా?

పణిహారి : అయ్యా అవునండి.

దుష్యం : వానిం దీసికొని రమ్ము.

పణిహారి : బుద్ధి బుద్ధి (అని వెళ్ళి కరభకునితో వచ్చి) అయ్యగారు అరిగో చూడు. అలాగున పో.

కరభకుఁడు: (చేరి) బాబో! బాబో! జోవోరు, జోవోరుండి. అమ్మగారు సెలివిచ్చిందేమంటేనుండి, ఉఁ మఱగంటే నుండి. నేటికి నాల్గో నాడంట కడుపున గన్నబిడ్డల కంట, కాలూ సేయీ నొచ్చకుండా నంట, బాబూ, సెప్పుకుంటానండి. రచ్చగట్టే నోమంటండి. ఉపాసం సేస్తారంట, అబ్బాయిగారు అక్కడ వుండాలంట.

దుష్యం : ఇక్కడఁ జూడఁగా తపసుల పని, అక్కడఁజూడఁగా తల్లి గారి పని. రెండును రెండే. ఇందులో ఏదియు మీరదగినది కాదు. ఇపుడేమి చేయవలసియుండును.

విదూ : ఇపుడేమి చేయవలసిన దేమిటి. త్రిశంకుఁడవలె ఉయ్యాలో, జంపాలో అంచు నడుమను వ్రేలాడుటే!

దుష్యం : చాలులే నీ కోడిగాలు. నేనెఱుఁగనా యేమిటి. నిజముగానయ్యా, నాయుల్లము మిక్కిలి తల్లడించుచున్నది.

క. ఇట్టుంబని యట్టుంబని
పట్టెను డెందంబు రెండు పాయలగుం దా
నెట్ట యెదుట గట్టు దిరుఁగఁ
గొట్టిన పెన్నేట చాలు కోలుం బోలున్. 17

(మది బరికించి) ఇదివరకే అమ్మగారు నిన్ను కన్నబిడ్డ వలె జూచుకొనుచున్నారుగదా. నీవిక్కడనుంచి వేగిరమే బయలుదేరిపో. తపసుల తప్పుగూడని పనిమీద నేనిక్కడ నున్నానని అమ్మగారికి మనవి సేయుము. ఆమె గారి యెడల నేను నడుచుకొనవలసినట్లు నీవు నడుచుకో. అందునకు నీవు తగిన వాఁడవే.

విదూ : నేనిక్కడ రక్కసులకుజడిసి తోఁకమడతబెట్టినానని మీరను కొందురేమో.

దుష్యం : (చిఱునవ్వు నవ్వి) ఇంతటి బాపనయ్యను మేమలాగను కొందుమా. అనుకొనము పో.

విదూ : అలాగయిన యెడల దొరగారి తమ్ముఁడేలాగున పోవునో, నేనును అలాగుననే పోవుదును గదా.

దుష్యం : ఈ తపసులపల్లె చుట్టుప్రక్కల అడవిపల్లెలలో తొందరలు లేకుండ నేను కనిపెట్టి యుందును. మనతో వచ్చిన బలగమంతయు నీతోనే వచ్చును.

విదూ : (ఉబ్బి) అలాగైన యెడల ఇప్పుడు నేను తోడు దొరగారనే.

దుష్యం : (తనలో) ఈ బమ్మసారిగానికి చేదస్తమున్నది గదా. మన చాటుమాటు కోరికలను ఎప్పుడైన లటుక్కున నగరులో రాణివాసము వారి చెవిని బడవేయునో ఏమో! అంత వాడవును, కాని వీనితో ఈవితముగా చెప్పెదను. (విదూషకుని కేలు తనకేలఁ గీవించి బిగ్గఱగా) నేనీ తపసుల యందు గల బత్తిచేత నిజముగా నిచ్చట నిలువ వలసి వచ్చినది. కాని శకుంతల మీది తమకము చేతఁగాదు సుమీ.

క. మే మెక్కడ వలపెఱుఁగక
ఈ మెకముల కూనలందు నెదిగిన పడుచుం
గోములు లెక్కడ నెచ్చెలి
నా మాట నిజంబుగాదు నవుటాలు సుమీ 18

(అని యందఱు వెళ్ళిపోయిరి)

శ్రీరస్తు

అభిజ్ఞానశాకుంతలము

అచ్చతెనుఁగు

మూడవ యంకము

(తర్వాత దబ్బలు చేతఁబట్టుకొని వేలిమి పెద్దలగు కణ్వులవారి యొద్ద జదువుకొనుచున్న యొక చిన్నవాఁడు వచ్చుచున్నాఁడు)

చిన్నవాడు: ఆహా! ఏమి యీపుడమిఱేఁడు దుష్యంతుఁడు. ఎంత దొడ్డవాఁడయ్యా! ఎంత దొండవాడయ్యా! ఆయనగారు ఈ తపసి పల్లెలో అడుగుపెట్టినారు. మా వేలి ముఱుగు లెంత చక్కఁగా జెలఁగి వెలుఁగుచున్నవో చూడుఁడు. గొడవ లన్నియు నడుగంటి పోయినవి కదా.

క. జొఁ బో తూపుంగూఱ్చిన
నే బాగో! వింటి గుఱ్ఱు నెనయుచునల్లెన్
దాఁబుట్టిన సడిదౌలకు
సేబాషీతండు పనుల చెఱుపులఁదోలెన్ 1

ఈ దబ్బలు వేలిముఱుఁగు మీద ఏర్పాటుగాఁ బఱచుటకు వేలిమి పనులు నడిపించు వారికి అప్పనఁజేసెదను. (అని కొంచెము నడచి ఆకసము వంకఁజూచి.)

ఓహో! ప్రియంవదమ్మగారా? ఏమిటమ్మా ఏమో కుంకుమ, తూండ్లతో బచ్చితామరాకులు, తీసుకొని పోవుచున్నా రెందు కమ్మా? (ఏదో విన్నట్టుఁజూచి) ఆఁ ఏమి చెప్పుచున్నావూ, శకుంతలమ్మకు ఎండఁదగిలినదీ! వెచ్చఁజేసినచో కాఁకఁగా నున్నదా? ఉబ్బకాఱులే అందునకై మందుగా నయ్యందగత్తె మేనికిఁ జెందించవలెననియో చెప్పుచున్నావు. ఇదిగోనమ్మా ప్రియంవదమ్మ! అలాగైన యెడల

నేలాగున గనిపెట్టి పనిచేసెదవో. కన్ను గలిగియుండవలయునుఁ జుమీ! ఆ ముద్దరాలు మనపెద్దలకు గుండె పట్టు. నేను కూడను కొంచెము మంతరపునీళ్ళు గౌతమ్మ చేతికిచ్చి పంపెదను గాని వేగిరము వేగిరము, ఊఁ (అని వెళ్ళిపోయెను)

ఇది శుద్ధ విష్కంభము

(పిమ్మట విరాళిచేఁజిక్కి దుష్యంతుఁడు వచ్చుచున్నాఁడు)

దుష్యం : (దిగులుతో నిట్టూర్పు నిగుడించి)

గీ. ఎఱుఁగుదును తపసి మోముల యుఱువు నెఱవు
ఎఱుఁగుదునుఁ గన్నెఁ బెరల చేతిది యిటంచు
ఐన నా డెంద మిది వన్నెలాడి నుండి
నెట్టి వెనుకకుఁద్రిప్పంగ నేరకుంటి. 2

ఓ యొప్పులకుప్పవైన పూవింటివాఁడా! నీవునుఁ జంద మామయును, మీ చెలువములే చూపి వలపులతోఁదగులు కొనినన వారిని బలుమోసముల పాలుచేయుచున్నారు కదా!

గీ. నీదు విరివిల్తుఁ దనమును నెలచలువల
తేనిఁదనమునుఁ గల్లగాఁ గానఁబడియె
నా యెడన్ మంచు కప్పు నిప్పేయుఁజందు
పూవుటమ్ముల బిడుఁగులఁ బోల్తు వీవు 3

సామీ వలఱేఁడా! నామీద నెనరు లేదా నీకు! (అలసటఁ గనపఱచి) పూవుటమ్ములఁ దాల్చిన నీకింత బగ్గు పాటెక్కడిదయ్యా! తెలియ వచ్చినది. తెలియ వచ్చినది.

గీ. కనలికడు వెల్గు కరకంఠు కంటి మంట
కలదె నీ యందు నీర్చిచ్చు కడలిఁబోలె
ఇంకఁగాకున్న నీరైన యీవె మఱల
నెట్లు మా బోంట్ల నిట్లుడికింపఁగలవు. 4

ఇది యంతయు నేటికి.

క. ఎడలేక మొసలి టెక్కపు
టొడయఁడు నాడెంద మెంత యుడికించన నే
ఱ్పడ నాకది యింపేసుమి
పడతి పనియ కాదె నన్నుఁ బడలించుటయున్. 5

ఈలాగున నిన్నుఁ ఆరడి బెట్టినను ఇంకను జాలి తెఱుఁగ లేదు గదా నామీద.

గీ. కలసి రాని నాదు తలఁపులచే నీవు
వలపు ఱేఁడ యెంతవాఁడవైతి
విల్లు వీనులంట చెల్లుగాలాగి నీ
వాలుతూపు విడువవచ్చు నటర. 6

(నెగులునం బొగులుచు, కొంచెము నడచి) జన్నము తుద ముట్టినది. అచ్చుటికి దయచేసిన పెద్దలందఱు నాకు సెలవిచ్చిరి. అలసటఁగిని యున్న నాయుల్లమునుఁ జల్లఁజేసికొనుటకు ఎక్కడికిఁబోవుదును. (ఊఱ్పు) నేనా ముద్దులాడి యొద్దికిఁబోవుట యొక్కటియే నన్నుంబ్రతి కించు దారిగా నున్నది. ఆ దారి వెదకి కొనుచు బోయెదను. (ప్రొద్దువంకఁజూచి) ఎండ మిడిసిపోవు చున్నది. ఇట్టి యెడ మానిని యేటిగట్టున అల్లిబిల్లిగా నల్లుకొని యున్న తీగెలు గల చోటుల బోటులఁగూడి శకుంతల ప్రొద్దుపుచ్చు చుండును. అక్కడికి బోయెదను. (కొంచెము నడచి చూచి) ఈగున్న చెట్ల చాలు వెంటనే తెన్నొకటి కాన వచ్చుచున్నది. ఈతెన్నుననే యావన్నెలాడి చన్నటులున్నది. ఎందుచేత ననిన.

చ॥ కులుకు మిటారి యీవలనఁ గోసెననన్ తన ముద్దు వ్రేళ్లతో
మలఁచినఁజాడదోచెఁ దొడిమల్ మొగిడించిన మాడ్కి జూడఁజా
యలనదె యౌనవుందలిరు టాకులఁ దాఁగొనగోళ్ల ద్రుంచె నూ
టలుగాని బోదెలబొట బొటం గడుఁజిప్పిలి పాలుగారెడిన్. 7

(ఏమో మేనికిఁ దాకినట్లు చూపి) అహహహా ఏమి గాలి వెట్టుచున్నది. ఇక్కడ మిక్కిలి హాయిగా నున్నదే!

క. తామరల కమ్మతావుల
లే మాలిని తరగ చినుకుతోఁ దెమ్మెర యెం
తే మెలసి బాళి మండిన
యీ మేనను బిగ్గఁగౌఁగలింపఁగ నొప్పున్ 8

(నడచి చూచి) ఇదిగిదిగో తప్పదు. ఈ ప్రబ్బలికిఁజుట్టుకొన్న తీగెల గుబురున్నదే అక్కడ శకుంతల యుండి యుండవలెను. తప్పక యున్నది. దానికి గుఱుతేమనఁగా (క్రింద చూపి.)

క. మును మున్ను బయికిఁదేలున్
వెనువెనుకను నేల ప్రోయుఁ బిఱుఁదు బరువునన్
నునుఁగ్రొత్త యడుఁగు జాడలు
మొన దారినిఁ దెల్లని యిసుమునఁ గనఁబడియెన్ 9

కాఁబట్టి చెట్లమఱుఁగున నిలచి చూచెదను. (బరికించి సంతసముతో) ఆహా కన్నుల పండువగా నున్నదే. నా మొహరీల మూట ఇదిగో. ఈ పూవులు పఱచిన నున్నని రాతి మీద గూర్చుండి చెలికత్తెలచే నూడిగంబుల చేయించు కొనుచున్నది. సరే, ఇకను వారు విచ్చల విడిగా నాడకొనుచున్న మాటలను వినియెదను. (అని చూచుచు నిలచి యున్నాఁడు).

(అంతట శకుంతల పైనఁజెప్పిన తీరున వచ్చుచున్నది.)

చెలి కత్తెలు : (విసరుచు మక్కువతో) చెలియా శకుంతలా, ఈ తామరాకుల వలన వచ్చుచున్న గాలి చల్లగా నున్నదా?

శకుం : ఏమిటమ్మా విసరుచున్నారా?

చెలి : (దిగులు పడినట్ట ఒకటి నొకరు చూచుకొనుచున్నారు)

దుష్యం : ఈ గారాలబాల శకుంతల ఓపికతప్పి యున్నట్టున్నదే. (సందియముతో) ఏమి యిది ఎండ వేడిమిచేతనై యుండునా! తాళరాని విరాళిచేతఁగాఁబోలునా! రెంటను ఐయుండఁగలదు. (అని యువ్విళ్లూఱుచు) ఇంకను సందియమున్నదా?

ఉ॥ ఔమ్మునఁ గుంకుమాయె వదలుం గడియమ్ములు తూఁడులాయెనీ
యుమ్మలి కెక్కువాయె నటులుండియు మేని హొయల్ కనందగున్
బ్రమ్మిన యెండతాఁకు వలరాయనిసోఁకు సరుద్దులై ననుం
గొమ్మల యందు నిట్టి సొబగున్నదు వేసఁగి పెట్టనేర్చునే 10

ప్రియం : (గుసగుసగా) అనసూయా, విన్నావా ఆరాచ తపసి యిచ్చటికి వచ్చి వెళ్ళినది మొదలు షుమా, దీనికి కడగండ్లు ఇవేమిషో ఏమో. ఏమి బుద్ధి ఏమి చేయుదము.

అనసూయ : చూడఁగా అలాగుననే యున్నదే యమ్మా ఏమి చేయఁగలము అషే దీనినే అడిగెదనే. (బిగ్గరగా) చెలియా, నిన్నొకటి యడుగ వలసి యున్నది. నీకు కాక మిక్కిలి యెక్కువగా నున్నదా?

దుష్యం : నా యొప్పుల కుప్ప కిప్పుడు చెప్పక తప్పదు లే.

చ॥ నెలనును సోగ వెన్నెలల నిండిన నీటును దెల్పుతెల్పుతో
బొలిచిన తమ్మితూఁడు సరమున్ కరము న్నలుపెక్కిమిక్కిలిం
జిలుకలకొల్కి మేనికిని జేసిన వేడిమి పోడిమింతయున్
నిలుపఁ దరమ్మె గానిదిది నిక్కము నిక్కమటంచుఁజాటెడిన్11

శకుం : (విరిపాన్పు నుండి సగము లేచి) ఏమిటమ్మా అడుగుచున్నావు.

అనసూయ : ఈ వలపు లేమిటో ఉద్దరేమిటో మేమెన్నడైన ఎఱుఁగుదుమా ఏమిషి. ఏమో పాటలలో, పద్దెములలో, కతలలో చెప్పు కుంచారే, అలాగే ఏమో విరాళిపిచ్చిపట్టినట్టున్నావేమే తల్లి, అదేమిషో ఉన్నది యున్నట్టు చెప్పరాదా యేమి. ఆకాకలేమిషి ఆపోకలేమిషి బాగుగానే యున్నది. మంచో చెడ్డో మాతోఁ జెప్పినంగాని, మందో మాకో ఎలా చూస్నాము. నిజము చెప్పకున్న ఏలాగమ్మా.

దుష్యం : అనసూయకును నాకును ఒకే సందియము కలిఁగినదే.

శకుం : (తనలో) వలపు నిలుపను లేను, వీరికిఁ జెప్పను లేను. ఏమి చేయుదును.

ప్రియం : అమ్మాయి, అనసూయ చెప్పినమాట బాగుగానున్నది. "కడుపులో తెగులు ఱట్టు, కాపురములో మాటలు గుట్టు" అన్నారు. ఇదియేమో అనుకుంచున్నావుషమా. ఆ నాటికానాడు ఒడిసి వరుగవు చున్నావు. మిసిమి చాయందానవు గాన మిసమిసలాడుచున్నావు గాని ఏమున్నదే.

దుష్యం : ప్రియంవదమాట నిజమే.

చ॥ సొటసొట సొక్కె నెమ్మొగము స్రుక్కెను గుబ్బల ఔమ్ముచాల చి
క్కుటఁగనెఁగౌను దద్దయునుఁ గ్రుంగెను గ్రిందికి మూపుమేనుమి
క్కుటముగఁ బాలెనమ్మరుఁడు గొట్టెనుఁ బింజలు పింజలంటగాఁ
నటులయినన్ మిటారికి నొయారము మీఱెనుఁ బండుటాకులన్
మిటమిటలాడు బండి గురివిందయ నన్ వలినాలి తెమ్మెఱన్
12

శకుం : (సిగ్గుతో) మీఁకుగాక మఱియెవ్వఱికిఁ జెప్పుకొనఁబోవు చున్నాను. కాని మీకు మిక్కిలి తొందర కలుఁగఁజేయుదాన నగుచున్నాను.

చెలి : అదిగో, అలాగునా? నీవు చెప్పక దాచుటయే మాకు తొందర గాని చెప్పుటవలన తొందరలేదు. ఒకటి కీడుమేళ్లొకఱు పంచుకున్నప్పుడే కదా తొందర తీరుచున్నది.

దుష్యం :

ఆ.వె. వారెవీరు వీరెవారైనదడిగెను
లోని కలఁత వితము చాన తెలుపు
బాళి మీఱఁజూచెఁ బలుమాఱు నన్నిది
వినుట కింద మీద వెఱపు పుట్టు
13

శకుం : (సిగ్గుతో) ఈ తపసుల యడివినిఁ గాపుదల సేయుటకై రాచతపసి వచ్చి నా కన్నులఁబడినాడే (అని సగము చెప్పి సిగ్గుఁజూపుచున్నది.)

చెలి : అవ న్మాయి, అమ్మాయి, చెప్పమ్మా, ఇదిగో ఇటు చూడు. మాతో జెప్పుటకేమి సిగ్గమ్మా.

శకుం : నాటినుంచి నాకతని మీద కోరిక పుట్టి ఈ కడగండ్ల పాలైతిని.

దుష్యం : (చంకలు కొట్టుకొనుచు) బేష్! బేష్! వినవలసిన మాట విన్నాను.

క. వేఁడిమి చేసెను మరుఁడే
వాఁడే నా వేఁడి మడఁచు వాఁడెట్లనఁ గా
ఊడెడి మబ్బులు గల్గిన
నా డెంబగు నుబ్బకాఱు నాడుం బోలున్ 14

శకుం : మీకు నేఁజెప్పినది యొప్పుదలగా నుండి చేయఁగలిగితిరా, ఆరాచ తపసి మఱల నా యొద్దికి విచ్చేయు వీలు చేయుండు. లేదా నాయాస యింతటితో వదలు కొండు.

దుష్యం : ఇకను ఈ మాటతో సందియములన్నియు బోయినవి కదా.

ప్రియం : (గుసగుస) అనసూయా చూచినావుషే. దీనికి వలపులు తలకెక్కినవి షువూ. ఇక జాలము సేయరాదు. ఇది కోరినవాఁడు పురువంగడమునకు బంగారు తొడవు అమ్మా! ఎంత కోరిక కోరినదమ్మా! సెబాష్!

అనసూయ : (గుసగుస) ఉన్నమాట చెప్పినావు ప్రియంవదా (బిగ్గరగా) శకుంతలా నీవు చేసిన పనిలో తప్పేమియు లేదు. పెద్దయేఱు సముద్రములోఁ జేరుఁగాని మరియెందుఁజేరును.

ప్రియం : ఇన్ని మాటలేమిటి. చూడరాదుషే. మన బండి గురివింద తీగె గున్న మామిడి మీదఁ బ్రాకినదా మఱియొకటా.

దుష్యం : ఇఱుబది యేడు చుక్కలలో పదియాఱవ చుక్కకు గుఱుతులైన రెండు చుక్కలును నెలవంక దగ్గిర నున్నప్పుడెట్లుగా నుండునో

అట్లుగా మీరిద్దఱు ఈముద్దియ యొద్దఁజేరియుండగా ఏదియు వింతగాదు.

అనసూయ : ప్రియంవదా. ఇక తడవు సేయరాదు. గుట్టు చెడరాదు దీని కోరిక తీఱ్చవలెను. ఇందుకు వీలేమి?

ప్రియం : వేగిరమే కోరికఁ దీఱ్చవచ్చునుఁగాని గుట్టు చెడకుండ నెట్లుండునో యని తలంచెదను.

అనసూయ : పోనీ గుట్టుమాట అట్టెయుంచు వేగిరమయ్యెడి వీలేమి?

ప్రియం : ఏమీ తెలియని దానిలాగున అడగుచున్నావు షుమా, ఆరాచ తపసి దీనిమీద కన్నువైచి రేయుంబగలు నిదురలేక నవసి యున్నష్టుఁ జూడలేదా యేమి.

దుష్యం : (తనమేనుఁజూచు కొని) నిజముగా అలాగేయున్నానాయేమి, అవును.

తరువోజ :

తలక్రింద రేలఁ జేతుల నుంచి పంద
తలపులో నుడుకు చేగళపెళఁగ్రాఁగి
కలఁగి వెల్లువలై కనుల నుండి సాగి
వలవలఁ గారు నీళుల వన్నె మాపు
గల రతనాల బంగరు కడియంబు
వెలందు మణికట్లగల నారి కాయ
వలనను బైకొత్తి పలుమారు నొత్తి
నిలిపిన జారు మఱల జారు జారు. 15

ప్రియం : (పరికించి) అనసూయా, యీ చెలియ పుడమిఱేనికి వలపులరేక యేల పంపరాదు. ఆరేకను విరిజాజి పూవుల పొట్లములో నుంచి సామి ప్రసాదమని పేరుపెట్టి అందఁజేయ వచ్చుఁగదా.

అనసూయ : ఈ యేర్పాటు మిక్కిలి చక్కఁగా నున్నది. నేనందునకు సంతసించు చున్నాను. మన శకుంతల యేమనునో యేమో.

శకుం : ఏమీ మీ మాటలకు మించి మఱియొకలాగున నడతునని తలచ వద్దు.

ప్రియం : ఆలాగైనయెడల నీకోరికలను దెలియఁజేయుచు ఒక మంచి పద్దెమును చక్కఁగా దలపోయుము.

శకుం : ఆలాగుననే తలపోసెదను గాని, అతఁడు నా మాటలు పాటించునో లేదో అని నాడెందము సందియం పడుచున్నదమ్మా.

దుష్యం : (ఉల్లము చెలరేగి)

ఉ॥ ఉన్న యతం దితండు విఱులూరుచు నిన్గలయంగ, నేలనో
పన్నెద వీవు కాయయొకొ పండొకొ యంచును సందియంబునో
కన్నియ కోరువాఁడు సిరి గాంచ గలండొకొ కాంచ లేడొకో
క్రన్నన లచ్చి చేత సమకట్టని కోరిక యెట్టులుండెడిన్ 16

ప్రియం : అసీ యేమి యిది, నీ నీడను జూచుకొని నీవే వెఱచెదవు. నీవెవ్వరు నేనెవ్వరు. ఇదియునుగాక, నీమంచిని నీవు దూఱుకొనియెద వేమి? మేనికాకను దీఱ్చు ఱెల్లు పూతకాఱు చందురుని వెన్నెలలు సోకకుండ బట్ట నడ్డము చేసికొను పిచ్చివారున్నారుషే.

శకుం : (చిఱునవ్వుతో) మీరు చెప్పినట్లనే చేయుదానను (అని కూర్చుండి తలపోయుచున్నది.)

దుష్యం : ఎంత చక్కగా దీనిని చూడఁగల్గినది, నా కన్నులకు ఱెప్పలున్నవా? మఱచియే పోతిని. ఱెప్ప వ్రాలినట్లే కానరాదే.

క. సొగసు గులుక నొక కనుబొ
మ్మెగయించుచు నీనెలంత యేలలు గూర్పన్
మొగమే నాపై బాళిన్
గగురించిన చెక్కు చేత గణ గణ మ్రోగున్ 17

శకుం : సకియలారా! ఇదిగో చక్కని యొక జావళీ కట్టినాను. కలము, కాకితము, సిరాలేదాయె గదా.

ప్రియం : ఇదిగో నమ్మా ఏమి కావలె నేమిటి? చిలుక పొట్టవలె మెత్తగా నున్నది. ఈ పచ్చి తామరాకు మీద నీ గోళ్ళతో వ్రాయరాదటమ్మా.

శకుం : (అట్లేచేసి) ఇందులో నా కోరిక బాగుగా నిమిడి యున్నదో లేదో చూడుండు.

చెలులు : ఏది ఏది చదువు చదువు.

శకుం : క. కనికరమున్ గనికరమొం
దనివాఁడా యెఱుఁగ నీయెదన్ బైపైనే
నినుఁగోరిన నొడలుడుకఁగ
నను రేయుం బగలు మరుఁడు నలిబిలి చేసెన్. 18

దుష్యం : (దిగ్గున దగ్గరఁజేరి)

క. వడలం బారిన చక్కని
యొడలు గలుఁగుదాన నిన్ను నుడికించు మరుం
డెడలేక నన్నుఁ బేల్చున్
కదునడచున్నెలను బవలు కాదట కలువన్. 19

చెలులు : (చూచి చంకలు కొట్టుకొనుచు) మీరాక మాకు మేలైన రాకగదా. “ఆడబోయిన తీర్థమెదురాయె” నన్నట్లుగా నైనదే. అయ్యా సేమమా?

శకుం : (ఎదురుమొగమై లేవఁబోవుచున్నది)

దుష్యం : అంతవరకు చాలును, నీ మెత్తని మేని నుత్తల పెట్టకుము.

క. పూవుంబానుపు పైఁబడి
దూవుం దెలుపెక్కు తుదల తూండ్ల వలపు పా
లై వెచ్చదగిలినది నీ
మావిడి పట్లోపలేవు మరియాదలకున్ 20

అనసూయ : ఇదిగో దయచేసినారే. ఏమి మీనెయ్యము దేవరవారు, ఈ నున్నని ఱాతి మీద మెత్తని కొబ్బరియాకు చాపమీద దయచేయుండు.

శకుం : (సిగ్గుతో నిటునటు చూచుచున్నది.)

ప్రియం : అయ్యా, మాకు నెయ్యంపు చుట్టము లైతిరి. మీ యిద్దఱిలో ఒకఱి కొకఱికిఁ గలసిన కూర్మి కన్నులకుఁ గనపడుచునే యున్నది. అయినను మా చెలికి మీమీఁదఁగలిగిన తమకమును నేను తిఱిగి చెప్పఁబూనుట నమలినదేనమలినట్లున్నది. అబ్బబ్బా! దీని వెతలనుఁజూచి యుండుటనుఁ బట్టి మీకుం జెప్పుచున్నాను.

దుష్యం : అదియేమి నీకు నీవారిమీద నంతనెనరు గలిగి యున్నదే. నీవు చెప్పఁదలంచినదానినిఁ జెప్పవలసినదే. చెప్పకున్న నెగులు కలుగును గదా.

ప్రియం : "సీమ లేలెడి వారు చేటుపాటుడుప, బాలుపొంగిన యట్లు పజలు పొంగెదరు," అని నట్లుగా మీ సీమలోనున్న మావంటి వారి చేటుపాట్లారయవలసినది మీకు నాయమే కదా.

దుష్యం : కాదా మఱి.

ప్రియం : చూచినారా? అయ్యా, మీ మీద చూపు నిల్పిన యీ కుఱ్ఱదానిని వలరాచవేలుపు, ఎన్ని వితాలనైన గారించుచున్నాఁడు. కనికరించి దీనిఁ బ్రతికించుటయే మాకుఁగావలసిన పని.

దుష్యం : ఓహో! నాకు మేలు కూర్చినదానవు నీవు చెప్పినపని చేయుటకేమి? ఇట్టి పనులు మీ చెలికత్తెయెడల మట్టునకే కాదు ఎల్ల యెడల కలదు. ఇది మట్టుకు మీ వలనఁ గలిగిన మేలును తలమోచి చేయవలసిన పని.

శకుం : (ప్రియంవదనుఁజూచి) ఇక చాలించుమమ్మా తల్లి, యెక్కడి మాటలు. ఆ దొరగారు రాణివాసము నెడఁబాసి తడువైనది ఎంత తొందర పడుచున్నారో? వారి నేల యడ్డగించఁబోయెదవు.

దుష్యం :

క. ఎదఁగల వాల్గంటీ నా
మది యొరులం జేరఁబోదు మఱివేరుగనీ
వుదలంచిన మరుతూపుల
నిదివరకే చెడితి, చెడితినిప్పుడు మఱలన్. 21

అనసూ : మాకు దేవరవారు నెనరు జూపిన చుట్టాలు గదా. మాకు చనువుచేత ననుచున్నాము. పుడమిరేండ్లకు పలువురు పడతులుందురని వినుచున్నాము గదా. మాకు వగపుగలుగకుండ మా చెలికత్తె నేలుకొనవలయునని కోరుచున్నాము.

దుష్యం : నాకింత మేలు చేసిన మీరు ఇన్నివితములఁ జెప్పవలెనా?

క. పలువురకుఁ దాళిఁ గట్టినఁ
గొలము నిలుప నాకు రెండగుంజుమి కడకా
మొలనూలగు పుడమియు మీ
చెలికత్తియ యయిన ముద్దు చేడియ యిదియున్. 22

చెలులు : (ఒకటితో నొకఱు) ఇకను మనము సుగపడితిమి పో.

ప్రియం : (చూపు నిగుడించి) అనసూయా ఇదిగో ఈ వైపుగా మన లేడిపిల్ల తల్లిని వెదకు కొనుచున్నది కాబోలునమ్మా! ఇష్టాపడి వచ్చుచున్నది. రా,రా. దాని తల్లి దగ్గిరకు దానిం దోలివత్తము.

(అని యిద్దఱు బయలు వెళ్ళిరి.)

శకుం : ఇదిగో ప్రియంవదా, ఇదిగోనమ్మ అనసూయా, నేను ఒంటరిగా నున్నానమ్మా. మీలో నెవ్వరైన నొకటిచ్చుట నుండుండు. నా దగ్గిరఁ గా రండి.

ప్రియం : ఒంటరివేల అయితివి. సీమలన్నియు నేలెడిదొరయే నీ చేరువన నున్నాఁడు. (అని వెళ్ళిరి.)

శకుం : ఏమిటి ఇది, వెళ్ళిపోయినారే.

దుష్యం : ఎందుకు ఆలాగున తొందరపడుచున్నావు. నీకుఁగావలసిన యూడిగము లన్నియు జేయువాఁడు నీ చేరువనుండఁగా నీకు కొదువయేమి?

శకుం : పెద్దల యెడల తప్పుగా నడుచుకొనవలసి వచ్చినదే. (అని బయలు వెడలెను)

దుష్యం : నిన్నుఁ జూడఁగా మిక్కిలి వేసటఁజెంది యున్నావు. ఇంకను ఎండ వేడిమి కొంచెమైనను తీరలేదు.

చ॥ విసరుదునా కడుం జులువ వీవనలౌ తడిగాలి తామరల్
వెసరయి కారు చెమ్మటలు వేతొలగం గననంటి కంబపుం
బసతొడలాడి సందిటనుఁబట్టి సుగమ్మున కెట్టులట్టులన్
బిసువుదు నాయడుంగులను పేరిటి యెఱ్ఱని తమ్మిపూవులన్. 23

అదిగాక.

క. విరిసజ్జఁ దామరాకుల
బరగించిన గుబ్బదోయిపై గవిసెనఁ జె
చ్చెర విడిచి యేల వెడలెదు
నలిగించెదె యెండ నంగనాచి యొడళ్ళన్ 24

(అని బలిమిచేసి మరలించుచున్నాడు)

శకుం : పురువంగడమువారి పరువు నిలుపుకొనుండు. ఎంత నేను మరుని బారికి జిక్కినను నేను నాదానఁగాను. పెద్దల చాటుదానను.

దుష్యం : ఇంత పిఱికిఁదనమేమి? పెద్దలని యింత వెఱచెదవేమి. మీ పెద్దలకన్ని తగవులు తెలియును. నీ యందు కొంచెమైనను నేరము మోపరు. ఇంతియ కాక.

గీ. గాణ వేల్పుల పెండ్లిండ్ల కాను వాయి
విన్నదే రాచ తపసుల కన్నెలెంద

రెందరో చేసి రిదియంచు నిట్టివారు
కన్నవారి యెడంబాటు గాంచి రంచు. 25

శకుం : సామీ యిప్పుడు మట్టుకు నన్ను విడవుండు. నా సావాసగత్తెల యొప్పుదలనుఁ బుఁచ్చుకొని తిఱిగి వచ్చెదను.

దుష్యం : ఆలాగుననే విడిచెదను. తొందర యేమి?

శకుం : ఎప్పుడు విడిచెదరు.

దుష్యం :

క. ఆనంబడి కసుగందుం
బూనని క్రొవ్విరి నిఁదేటి పోల్కెన్నన బో
ణీ నీ కమ్మని వాతెర
తేనియఁగైకొందు నెనరు తేట పడంగన్ 26

(అని చిన్నదాని మొగము నెత్తుచున్నాడు)

శకుం : (మొగమును సొగసుగా నటు ద్రిప్పుచు నట్టువతో కొంచెము విదలించుచున్నది.)

(తెఱచాటున)

(జక్కవ చక్కెర బొమ్మా, నీ చక్కని మగని ప్రక్కనుండి పంపు తఱియైనది. రాతిరి వచ్చినది.)

శకుం : (చెవి యిచ్చి విని తొందరపడి) సామీ పురువంగడమునఁ బుట్టిన రతనమా, పెద్దది గౌతమమ్మ నా యొడలు బాగుగా లేదని చూడ వచ్చుచున్నది. సందియము లేదు. ఈమ్రాని కొమ్మ మీదనైన మరుగుగా నుండుము.

దుష్యం : ఆలాగుననే! ఆలాగుననే! (అని డాగియున్నాఁడు.)
(తర్వాత చెంబొకటి చేతఁబుచ్చుకొని గౌతమియు, చెలికత్తెలును వచ్చుచున్నారు).

చెలులు : అవ్వగారూ, ఈలాగున రండి. ఇదిగో ఈ వైపుగా.

గౌతమి : (శకుంతలనుఁజేరబోయి) అషీ! యేమే శకుంతలా. ఏలాగున నున్నదే నీయొడలు. కొంచెమేమైన నిమ్మళమేనషే. బిడ్డా బొత్తిగా నలిగి పోయినావే.

శకుం : అవ్వా. ఇప్పుడొక తీరుగా నున్నది.

గౌతమి : ఇదిగో బిడ్డా. ఈ మంతరపు నీళ్ళ చేత నీ యొడలు చూడ రెండు గడియలలో కుదురు బాటవుచున్నది. (అని నీళ్ళు తలమీదఁ జల్లి) కుఱ్ఱదానా ప్రొద్దు గ్రుంక వచ్చినది. పాక లోనికిఁ బోవుదము రా అమ్మా (అని బయలుదేరిరి).

శకుం : (తనలో) ఓ! నా తెలివిమాలిన డెందమా, నీకు చులకనగా జేకుఱునప్పుడు పిఱికినై వదలి వేసితిని. విడిచిపోయిన వెనుక నేర్చిన నేమి యున్నది. (అని కొన్ని యడుగులు జరిగి బిగ్గరగా) వగచెడి వారి వగపులు దీర్చు తగవు లెఱిగిన సొగసులు గల తీగె జొంపమా తిఱిగి నీమఱుగునకు వేగిరమే యరుగుదేర గోరుచున్నాను. సెలవు సెలవు. (అని కన్నీరు పెట్టుకొనుచు, అందరితో వెళ్ళెను.)

దుష్యం (ఎప్పటి చోటికి జేరి) తీరవచ్చెడి కోరికలకు తారుమారులు కలుగక పోవు.

గీ. పలు మఱును వ్రేళ్ళతోఁదాచఁ బడిన మోవి
వలదు వలదను పలుకుల వగల హొయలు
గలిగి తొంగలి ఱెప్పల కులుకుఁజూపు
కలికి నెమ్మోము బుజుము చక్కటికిఁదిరిగి
లేపఁబడె నెట్టకో మఱి లేదు ముద్దు. 27

ఇప్పుడెక్కడికిఁబోవలయును. ఈ తీగె జొంపములోనె ముద్దరాలి ముద్దులకు నొద్దికయైన ఈ రాతి గద్దియ యొద్దనే రెండు గడియ లుండెదను (అని యంతట పరికించి).

చ॥ చెఱఁగెను రాతిపై విరులు చేర్చిన పానుపు మేనులంటుటన్
దరిగెను తామరాకు పయినంజిగి నేస్తపుఁగోరు లేకకున్
దొఱఁగెనుఁజేత నుండు నునుఁ దూఁడుల కద్యమిదే యిదేయటం
చెఱవిడ నేరనుత్త పొద యేనియుఁబ్రబ్బలి యిల్లు గొబ్బునన్. 28

(తెఱచాటున)

ఓహో! పుడమిరేడా.

ఉ॥ సందెను జన్నపుం బనులు సాగిన బున్నెపుటగ్గి దేవరల్
విందుల నారగింపఁదగు వేలిమి తిన్నెల చుట్టు ప్రక్కలన్
సందులఁబ్రాకె రక్కసుల చాయలు సంజమొయిళ్ళ చాయలన్
ముందును వెన్కనుం దముల ముట్టిన రాయని బీతుతో ననన్ 29

దుష్యం : ఇదిగో వచ్చితి, వచ్చితి.

(అందఱు వెళ్ళిపోయిరి)

శ్రీరస్తు

అభిజ్ఞానశాకుంతలము

అచ్చతెనుగు

నాల్గవ యంకము

- విష్కంభము -

(అటు పిమ్మట పూవులు గోయుటనుఁదెలుపుచు అనసూయయు, ప్రియంవదయు వచ్చుచున్నారు.)

అనసూయ : సకియా, ప్రియంవదా వేలుపులలో పాటఁబాడుట యందు జాణలైన వారిని గాణ వేలుపులందురు. వారిలో నొకవాడుక యున్నది. మగవారును ఆడువారును, తమలో తామే తమ యిచ్చవచ్చిన వారినిఁగోరుకొని, చుట్టాలు పక్కాలు పెద్దలు, ఎవ్వటి జోలి లేకయే, కోరుకొనునప్పుడే నగరు పెండ్లి చేసుకొందురష. ఆపెండ్లిని తర్వాత పెద్దలు ఒప్పుకొందురష. ఆపెండ్లి రాచ వారిలో గూడ కలదష. అది నీవును ఎఱిగియే యుందువు. ఓహో! అషువంటి పెండ్లే మన శకుంతలకును దుష్యంతనకును జరిగినది షుమా. కానీలే మనుము మంచిదే కదా. ఇంత కంటె నెక్కువ మనము ఏడేడు పదు నాలుగు జగములను లేదనుకో. అదేమో గాని నాకు మిక్కిలి ముచ్చటగా నున్నది షుమా. అయినప్పటికి కొంచెము పాఱఁజూడవలసినదున్నది.

ప్రియం : పాఱఁజూడవలసిన దేమిషి.

అనసూ : ఇక్కడి వేలిమి పనులన్నియు ఏయనుపు, అడ్డు లేకుండ తిన్నగా జరిగి ఆ రాచతపసి మనతపసుల యొద్ద సెలవు తీసుకొని నగరుకు బోయిన తర్వాత, నగరు వగలాడుల దగులుకొని ఇక్కడి యుబుసు మఱచి దీనిని తలఁచునో తలఁచడో అని.

ప్రియం : అటుల ఎప్పటికిని జరుగదు నమ్ము. ఆరాచతపసినిఁజూడఁగా అటువంటి వాఁడు కాఁడని నాకు దోఁచినది. కాని మన కొల పెద్దలకుఁ దెలిసిన నేమి సెలవిత్తురో తెలియదు.

అనసూ : ఆయనగారు ఒప్పుకుంచారే. అందునకు సందియము లేదు.

ప్రియం : ఏమోలే, నీకేలాగున తెలియును.

అనసూ : మొదటి నుండి ఆయనగారి తలంపులు నేనెఱుఁగుదునే. అన్ని చిన్నెలు మంచివై వన్నెవాసి కలవారికీ వలయునని యున్నది. ఆయన మిక్కిలి పనిచేయకయే తనంతట తానే యొనఁగూడినప్పుదు ఆయనకు సంతోషమే కాదుషే.

ప్రియం : (పూలబుట్టనుఁజూచుకొని) ఇదిగో చూడు బుట్ట. చాలవూ, చాలును.

అనసూ : నేడు మన శకుంతల మిక్కిలి వేడుకతో నున్నందున పండగ జేసుకోదుషే. అది కలుముల గౌరును కొలువక మానదు. యింకను కొంచెము కావలెను సుమా.

(అని తిరిగి పూలు గోయుచున్నారు)

(తెఱచాటున)

ఓహో! ఇదిగో నేను వచ్చియున్నాడను.

అనసూ : ఎవ్వఱో మనము తగిన మరియాద చేయఁదగిన పెద్దలింటికి వచ్చినట్లున్నదే.

ప్రియం : శకుంతల యింటి యొద్ద నున్నది కదా.

అనసూ : అది యున్న నేమి లేక యేమి. దాని మది మదిగా నున్నదా యేమి. ఏమి తలపోయుచు బరాకుగాఁ గూర్చున్నదో.

(అని వెళ్ళిరి)

(తెఱచాటున)

ఓసీ మన్ననఁగోరి మీ యింటికి వచ్చిన మా వంటి పెద్దలనుఁ గంటఁజూడక పంటఁబలకరించకయుంటివి కదా.

ఉ॥ ఎవ్వతె వీవు నన్నెఱుఁగవే జడదారుల పెద్దనంచు నీ
వెవ్వని మీదఁ జూపిడితివే యత డెంతగ మేలు కొల్పినన్
అవ్వయు నిన్నుఁజూడఁడు పరాకున దద్దయు మత్తు గొన్న వాఁ
డెవ్వగఁ దొంటిచైదముల నెద్దియుఁజెప్పఁగ నేరఁడవ్వగన్ 1

అనసూ : అయ్యో! అయ్యో! ఎంత మోసము వచ్చెనే. యెంతనుకొన్నామో. అంతయే అయినది గదే! అమ్మా! ఈ శకుంతలకు మదిమదిగా నుండలేదు. పెద్దలు దయచేసినారు. వారిని మరియాద చేయక తప్పు చేసినది కదా (అని ముందుచూచి) మఱియొక టెవ్వతైననా ఎప్పుడు జూచిన అక్కసు ముక్కున వ్రేలాడు చుండు దుర్వాసులవారే, బెట్టెదపుతిట్టు తిట్టి చర చర చర పోవుచున్నాఁడు చూడవే. ఆ మంటల మారి తుంటరి తపసి దగ్గఱనైన పో వసమా? నీవు వేగిరమే పోయి వారి అడుగులు బట్టుకొని ఏలాగుననైన తీసుకొనిరా అమ్మా! నేను కాళ్ళు గడుగుటకు నీళ్ళు తెచ్చుచున్నాను.

ప్రియం : అలాగే (అని వెళ్ళుచున్నది)

అనసూ : (ఒక యడుగు పెట్టి తొట్రుపడి) అయ్యో! కాళ్ళు తడఁబడుచున్నవి. పూల బుట్ట నేలఁబడినది. (అని పూలు ఎత్తుచున్నది.)

ప్రియం : (వచ్చి) అబ్బబ్బా! ఏమి చెప్పనమ్మా! బగ్గుపాటి వారి యొద్ద బ్రతుకలేకున్నట్టు, ఆతపసిని ఎవ్వఱు చల్లఁబడఁజేయఁగలరు. అయినను కొంచెము కనికరము పుట్టునట్లు చేసినాను.

అనసూ : (కొంచెము నవ్వి) అయ్యో! అదైన మంచిదే కాదషే; ఏమి జరిగినది, ఏమిషి?

ప్రియం : నేనెంత బతిమాలినను అడుగు మరల్పలేదు షుమా. తర్వాత యీలాగన్నాను.

అనసూ : ఏమాన్నావు, ఏమిషి?

ప్రియం : సామీ ఈ కుఱ్ఱదాని కేమియు తెలియదు. ఒక చెంపఁగొట్టిన పాలు, ఒక చెంపఁగొట్టిన నెత్తురు, మీరు గొప్ప సత్తి కలవారని దానికి తెలియక అట్లు చేసినది. ఒక తప్పితము. ఇదియు మొదటి నేరము కావున మన్నించి కాపాడ వలయునని వేడితి.

అనసూ : తర్వాత ఏమన్నారు?

ప్రియం : పిమ్మట ఆయన యన్నదేమనగా “నేను ఏ తిట్టు తిట్టెదనో, ఆ తిట్టు అయి తీరవలసినది. అది తప్పదు. అయినప్పటికి నీవింతఁగా నంగలార్చుచున్నావు కనుక ఒక వీలు కలుఁగఁజేయుచున్నాను. అది యేదనగా, అడియాలమైన యొడలి తొడఁగు పుడమి ఱేని కనులఁబడఁగానే నా బెట్టిదంపు తిట్టు యొక్క బెట్టు మట్టగుచున్నది.” అని చెప్పి యంతలోనే మాయమై కనులకుఁగానఁబడ లేదే.

అనసూ : ఇంతట మన మూఱడిల్లి యుండవచ్చును. ఇంత కంటె మనమేమి చేయగలము. ఇదిగోనే ఓషీ! బాగుగానే యున్నది. ఆరాచతపసి మన శకుంతల పొందు నుండి వెడలి పోవునప్పుడు తన యానవాలుగా నుంచు కొమ్మని తన ముద్దుటుంగరము వ్రేలినిఁ బెట్టి వెళ్ళినారు షుమా. కనుక మనము శకుంతల కిది చెప్పవలసినదే లేదు. ఈ బెట్టిదపు తిట్టు నెట్టుగా నెట్టి పోవునో అట్టుగా జరిగించుకొనుట దానంతటదియే పొడకట్టును.

ప్రియం : రావమ్మా! యిక మనకు ఇలువేలుపు కొలువున్నది గదా (అని నడచుచున్నారు). అనసూయా, ఇదిగో శకుంతలనుఁజూడు చెక్కిట చెయి చేర్చుకొని చిత్తరు బొమ్మవలె నున్నదే. ఇది తన వగకాని మీద తలపు నిలిపి ఏమో తలపోయుచు తన్ను తానే మఱచి నట్లున్నదేమమ్మా. ఇటువంటిది వచ్చిన పెద్దలను గంటఁజూచి పంటఁబలకరించునా!

అనసూ : ఇదిగో ప్రియంవదా, ఈ నడచిన దంతయు మనయిద్దఱిలోనే యుండవలసినది షుమా, నీ నోట నూవు గింజ నానదులే, బయిలు పుచ్చెదవా యేమి? వద్దు షుమా! మన శకుంతల మొదటి నుండి మెత్తని గుండె గలది. దీనిని మనము ఏలాగు మరుగుగా నుంచవలెనో, అట్లుగా నుంచవలెను. అమ్మతోడు, ఇదిగో నా మీద వట్టు. ఎవ్వరికిఁదెలియరాదు.

ప్రియం : సరే అలాగేలేనమ్మా. నేను మట్టుకు ఎఱుఁగ నాయేమి. విరిజాజికి యెవ్వరైన వేడినీళ్ళు పోసిరో లేదో పోవలె. (అని వెళ్ళిపోయిరి.)

(అటు తర్వాత నిదురనుండి లేచి, పెద్దలైన కాశ్యపుల వారి యొద్దఁ జదువు కొనుచున్న చిన్నవాడు వచ్చుచున్నాఁడు)

చిన్నవాఁడు : పొఱుఁగూరుఁబోయి వచ్చిన కాశ్యపులవారు రాతిరి యెంత యుండునో తెలుసుకొని రమ్మన్నారు. నేనందునకు వాకిటికి వచ్చితిని. ఎంత రాతిరి యున్నదో చూచెదను. (అని కొంచెము నడచి నలువంకలను ఆకసమునుఁజూచి) అయ్యయ్యో! బొత్తిగా తెల్లవారి పోయినదే.

ఉ॥ ఈవల క్రుంకు మెట్టతల కెక్కఁగఁబోవునుఁ జందురుండుదా
నావల ప్రొద్దునుం బొడుచు నత్తడ లేని సిపాయి మున్నుగా
దీవెలు రెండు నొక్కపరి దిగ్గుట యెక్కుట గల్గె నిబ్బువిన్
కావటి కుండలట్టులగు గల్మియు లేమియు నన్న తీరునన్. 2

మఱియు

మ॥ నెల క్రుంకంగ గడున్ మెఱుంగు దొలఁగన్ లేఁగల్వపున్ జూడ్కిఱం
పిలగాఁజేయదు నేస్తకాఁడు పొఱుఁగూ రేగంగఁబాల్పడ్డయ
గ్గలపుంగొందల పాటు పోటు దిగులెక్కం జిక్కు పూబోండ్లకున్
దలమా యెంత యడంచు కొన్నదిట మైతాళంగ నొక్కింతయున్
3

అనసూ : (తెర లేకయే వచ్చి) అయ్యో! ఎంతపని చేసినాఁడు దుష్యంతుఁడు. మేము, ఎంత అడవులలో నుండి నార చీరెలు కట్టుకొని నౌరు నాజూకు లెఱుఁగక పోయినను వలపు మెళకువలలో వలతులము గాకపోయినను, శకుంతల పట్ల, ఆ రాజు తగవు మాలియున్నాఁడని, మానిసులమై పుట్టినందుననే తెలియుచున్నది.

చిన్నఁవాడు: వేలిమి తటి మించి పోవుచున్నది. అయ్యవారికి మనవి చేసెదను (అని వెళ్ళెను.)

అనసూ : నా కన్నియుఁ దెలుసును. తెలిసి నేనేమి చేయఁగలను. పని పాటలు కూడదోచక యున్నవి. ఆరాచ తపసి నమ్మించి గొంతు గోసెఁగదా. నల్లనివన్నియు నీళ్ళు, తెల్లనివన్నియు పాలు అనుకొని, అబము సుబము ఎఱుఁగని మా శకుంతలకు వలపులు దగులు కొలిపిన వలరాయని కోరికలు కొనసాగినవి. ఇంతకును ఒకటినను కొన్న పనియేమి? దూర్వాసుల వారి తిట్టే యింత చేయుచున్నదేమో! ఆలాగున గాదేని అంతలేసి బాసలు చేసిన ఆరాచవాఁరు ఇనాళ్ళ వరకు ఒక కమ్మయైన వ్రాయఁగూడదా? ఇక్కడ నుండి ఆయనగారు మా శకుంతల వ్రేలికిఁదగిలించిపోయిన యుంగరము నానవాలిచ్చి యెవటినైన బంపుదమా యని యొక బుద్ధిపుట్టచున్నది. కాని ఎప్పుడు చూచినను చేటు చేదస్తాలలో మణిగి యున్న యీ ముక్కు మూఁతల వారిలో ఎవ్వటినిఁబతిమాలిన పోవు వారున్నారు. అయ్యగారితో, శకుంతల పెండ్లాఁడినది. దుష్యంతుని వలనఁ చూలు నిల్చినది, ఓప లేకయున్నది, అని చెప్పఁదలంచెద ననుకో. పయినములో నుండి యుండి విసుకుఁదలలో నున్నవాఁడు బాగుగాఁ బరికించక ఆకుట్టదాని యందు తప్పు పెట్టునేమో, ఏమి బుద్ధి! ఏమి చేయుదు!

ప్రియం : (చంకలుగొట్టు కొనుచు వచ్చి) ఓషే, అనసూయా, లే,లే, లే. మన రొట్టె నేతఁబడినది.

అనసూ : ఏమి! ఏమి! ఏమి

ప్రియం : ఓషే! ఇదిగో, విన్నావా. చక్కఁగ నిదుర బట్టినదా యని యడుగుటకు శకుంతల యొద్దికి నేనిట్టేపోతిని. ఆఁ

అనసూ : అక్కడ యేమి జరిగినదేమి.

ప్రియం : శకుంతల సిగ్గుచేతఁదలవొంచుకొని యున్నది. అయ్యగారు చూచి బిరబిర వచ్చి కౌఁగిట జేర్చుకొని, మంచి పని చేసినావు బిడ్డా. సందియ పడవద్దు. "కన్నులు పొగతోఁగ్రమ్ముక పోయిన పిండీ,నేయీ గుండములోనే బడినది" అని నట్లు, నీవు చేసిన పని యెట్టుగాఁజేసినను అది మంచిదే అయినది. మంచి చిన్న వానికిఁ జెప్పిన చదువువలె నీవు చేసిన పని తగి యున్నదైనది. దీనికిక వగవం బనిలేదు. ఇప్పుడే తపసులలో నెవతినైన నీ వెంట నిచ్చి పెన్మిటి యొద్దికి నిన్నుఁబంపెదను. అని అన్నారు షుమా.

అనసూ : సరే సంతోసమే కాని ఈ నడచిన దంత అయ్యగారి కెట్లు తెలిసనదో షుమా.

ప్రియం : అయ్యగారు వేలిమిసాల దాపునకు రాఁగానే, రూపులేకయే ప్రాఁ బలుకు పలుకులు వినవచ్చిన వమ్మా.

అనసూ : (అచ్చెరుపడి) ఏమి మాటలు వినబడినవేమి?

క. బాపల మేటి జగముల
ప్రాపగు దుష్యంతు తేజు బట్టిన దనుచున్
నీ పట్టినిఁ దెలియుములోఁ
దాపిన పున్నెంపు టగ్గి తగుజమ్మి వలెన్ 4

అనసూ : (ప్రియంవదను గౌఁగిటఁజేర్చుకొని) నా కెంత సంతసముగా నున్నదనుకున్నావు. ఔనుఁగాని సంతోసము కొంత వంతతోఁగూడి యున్నది. ఇఁక నత్తింటనే యుండుఁగదా అది.

ప్రియం : మన వంతకేమిలే? శకుంతల యెంత వంతలఁ జిక్కి యున్నదో చూడు. దాని దిగులు దీరెనా మనకదియ పదివేలు.

అనసూ : అలాగే కాని అదిగో చూడు. మామిడి కొమ్మకుఁ దగల్చిన కొబ్బరాకుల బుంగలో ఎన్నాళ్ళున్నను తావులు చెడవు గదా అని శకుంతలకొఱకనియే పొగడపూవుల దండ యొకటి దాచి యుంచినాను. దానిని దీసి నీ చేతిలో నుంచుకో. నేనును కొంచెము గోరోజనము, తిరుమణి, గరికె చివుళ్ళు చేర్చి సేమంపు గందముఁ జేసెదను. (అని వెళ్ళెను)

(తెఱలో)

గౌతమి : మన శకుంతలను దీసుకొని రమ్మని శార్ఙ్గరవులకు గొంచెము సెలవిమ్ము.

ప్రియం : (చెవియిచ్చి విని) ఇదిగో అనసూయా ఇటురా, ఇటురా. దబ్బున రమ్మనమనగా రావేమమ్మా, ఢిల్లీ పట్టపు పయినాల వారిని పిలుచుచున్నారమ్మా.

అనసూ : (గందపు గిన్నె చేతఁబుచ్చుకొని వచ్చి) ప్రియంవదా రాపోదము. (అని యిద్దఱు నడచిపోవుచున్నారు.)

ప్రియం : ఇదిగో, చూడు, అనసూయా! శకుంతల తెల్లవారు సరికే తలంటుకొన్నది. జలకాలాడినది. తలద్రువ్వుకొన్నది. ఎంతలో అన్నియు అయినవోచూడు. మన తపసిముత్తైదువులు అక్షింతలు చేతఁబుచ్చుకొని దీవించుచున్నారు. దాని దాపునకుఁ బోదమురా.

(అని యిద్దఱును దగ్గరకు బోవుచున్నారు.)

(పిమ్మట పైనఁజెప్పఁబడిన పగిదినిఁ గైసేయఁబడి పీట మీదఁ గూర్చుండి శకుంతల కానవచ్చుచున్నది)

ఒకముత్తైదువ : (శకుంతలతో) బిడ్డా. నీ పెనిమిటిచే నెన్ననలివి కాని మన్ననలు బడసి పట్టంపు రాణివై యుండుము. మావంటివారిని కనిపెట్టు. అమ్మా.

మఱియొక్క : ఒడ్డారంబుల నడ్డులేక పగరాయర గండలను, గండ పెండేరములు
ముత్తైదువ గట్టిన దొడ్డబిడ్డలం గనుము బిడ్డా.

ఇంకొక : అమ్మాయీ మీయింటి వారు నీకంటి చూపులలోనే మెలగవలె.
ముత్తైదువ మావంటివారికి మీకనికరమే కలcగవలె.

(అని దీవించి గౌతమితప్ప తక్కిన వారు వెళ్ళిరి.)

చెలులు : (దగ్గరజేరి) చెలియా నీకు అత్తవారింటికి అంపకాల తలంటుగాc బోలును.

శకుం : (చెలులను జూచి) ఓహో! అనసూయ, ప్రియంవదగార్లా. రండి, కూర్చుండుడు.

చెలులు : (ఆరతి పళ్ళెములు చేతcబట్టుకొని) చెలియా, శకుంతలా. నీకు మేము ఆరతి పళ్ళెములు పట్టి సింగారించెదము. తిన్నగా గూర్చుండు మమ్మా.

శకుం : అయ్యో! అలాగా, ఇంతకంటె నాకెక్కువ యేమున్నది. ఇకను చెలికత్తెలు నాకు సింగారించుట ఎన్నడైనcగలుcగునో కలుcగదో (అని కన్నీరు పెట్టుచున్నది.)

చెలులు : అమ్మా! సుబమంచు అత్తవారి యింటికిc బోవుచున్నప్పుడు కంటc దడి పెట్ట వచ్చునా! కూడదు, కూడదు. ఊఱుకో (అని కన్నీరు పైటచెఱcగునc దుడిచి నట్టువతో సింగారించుచున్నారు.)

ప్రియం : చెలియా, విలువగల తొడవులను సింగారించు కొనవలసిన నీ యొడలును ఈ తపసిపల్లెలో దొరికిన వానిచే వన్నె తగ్గించు చున్నాము.

తపసి కొమరులిద్దఱు : (కానుకలు చేతc బుచ్చుకొని వచ్చి) ఇవిగో సొమ్ములు. ఈ సొమ్ములు సింగారించుcడు (అందఱును ఆనగలనుcజూచి యబ్బురపడిరి)

గౌతమి : అబ్బాయీ! నారదా! ఎక్కడివోయి యీనగలు.

మొదటివాఁడు :–అయ్యవారైన కాశ్యపులవారి అపురూపమగు తపసిపేరిమిచేఁ గలిగినవి.

గౌతమి : ఏమి నాయనా, తలఁచగానే పుట్టినవా యేమిషి?

రెండవవాఁడు :కాదు వినవమ్మా ముసలమ్మా. అయ్యవారు మాతో చెప్పినారు కదా. శకుంతల కోసరము మ్రాని వేల్పులగు చెట్ల పూవులు గోసి తెమ్మని సెలవిచ్చినారు. మేము చెట్ల దగ్గఱకు పోతిమి.

ఉ॥ కట్టము గాగ మ్రానొకటి కట్టెను జందురు తెల్పుదెల్పుమేల్
పట్టును వేఱొకొండడుగు లందగు పూతకు లక్కజొత్తి డెన్
పెట్టిరి తక్కు చెట్లడవి వేలుపు గొమ్మలు కణ్పులంటఁగా
బట్టిన లేత కెంజిగురు వన్నియ చేతుల మంచి సొమ్ములన్

ప్రియం : (శకుంతలను ఁజూచి) ఈలాగున వగలుప్పతిల్లుట యున్నదే, ఇది ముందు రాచసిరికి మంచి సగినము షుమా.

శకుం : (సిగ్గునుఁజూపు చున్నది.)

మొదటివాడు :– ఓ గౌతమా! పని లేదను కున్నావా యేమి? పోవలె పద. అయ్యవారు తీర్తాలాడి వచ్చినారు. మ్రానివేల్పులు చేసిన మరియాదలను వారికిఁదెలుపవలెను. రా,రా,రా.

రెండవ వాడు : అవును పోదము పద (అని వెళ్ళిరి)

చెలికత్తెలు : ఈ నగలెన్నడైన పెట్టి యెఱుఁగుదుమా? చూచి యెఱుఁగుదుమా కానీ! చిత్తరువులలో వ్రాసుకొనుట కొంచెమున్నదిగదా. ఆ పోలికనుఁబట్టి పెట్టి చూచుచున్నాము.

శకుం : అబ్బా, మీ జాణతనములు నే నెఱుగుదునమ్మా, నోటిలో వేలు బెట్టిన గఱువ నేరరమ్మా.

చెలులు : (నట్టువతోఁ గైసేయు చున్నాడు)

(పిమ్మట మడిగట్టుకొని కాశ్యపుఁడు వచ్చుచున్నాఁడు.)

కాశ్యపు :

ఉ॥ గుండెలు జల్దరించెను శకుంతల యేగెడిఁగ్రుక్క మ్రింగి గొం
తెండిన మాట బొంగురగు నేడువ నేడువఁ జూపు మ్రాన్పడెన్
దండిగ గాన కాపునయి దగ్గిర దీసిన నాదు పాట్లె యి
ట్లుండగ గన్నగేస్తుల కెటో తొలుసారిగ బిడ్డ నంపుచోన్. 6

(అని నడచు చున్నాఁడు)

చెలులు : చెలియా శకుంతలా! నీకు సింగారించుటయైనది. ఈపట్టు పుట్టములు రెండును దాల్చుము.

శకుం : (పుట్టములు తాల్చుచున్నది)

గౌతమి : అమ్మాయీ శకుంతలా ఇట్టారా అమ్మా! మీ నాయన ఇచ్చుచున్నాఁడు చూడు. ఆయనకు ఎంత సంతోసమొ అంత సంతోసముగా నున్నది షుమా! నిన్నుఁ గౌగలించుకొన వచ్చుచున్నాఁడు కాఁబోలు. అమ్మా, మరియాదగా నడచివచ్చి మీ నాయనను, జూచుకో.

శకుం : (సిగ్గుతో) నాయనగారూ, ఇదే మ్రొక్కుచు ఉన్నాను.

కాశ్య : తల్లి శకుంతలా,

క. కనుమా పెనిమిటి చెంతన్
జనుమాసము నయ్యయాతి శర్మిష్ఠనుఁగా
గనుమా మెపూరు గనుజో
కనుమా రా బాసికంబు గట్టిన కొమరున్. 7

గౌతమి : మీరు చేసినవి నీ దీవెలనలుమట్టుకే కావు. తప్పక జరిగి తీరు ప్రాఁబలుకుల పలుకులు.

కాశ్య : అమ్మాయీ యీలాగురా. ఇప్పుడే వేల్చియున్న ఈ వేలి మరుగునకు గైవారము చేయుము. (అందఱు నడచుచున్నారు.)

(శకుంతల కైవారము చేయుచున్నది)

కాశ్య : (మొదటి ప్రాఁబలుకు పలుకులతో దీవించుచున్నాఁరు)

ఆ.వె. వేలి మఱుఁగు చుట్టు విడిముట్లు దబ్బలు
సమిదెల మరివేల్మి సాదములను
బుట్టు తావి దొసఁగు నెట్టు సోమాసుల
బ్రోచు నగ్గి నిన్నుఁ గాఁచు గాత. 8

ఇకను బయలుదేరు అమ్మా జాగు చేయవలదు. (చూచి) శాఙ్గఀరవ మిశ్రా ఎక్కడ?

చిన్నవాండ్రు : (వచ్చి) అయ్యగారు ఇదిగో వచ్చియున్నాము.

కాశ్యప : శాఙ్గఀరవా, నీ చెలియనికి దారి జూపు.

శాఙ్గఀరవుడు : అమ్మాయీ ఇదిగో ఈలాగున బయిలుదేరు.
(అందరు నడచుచున్నారు)

కాశ్య : దాపుగానున్న మా తపసిపల్లె మ్రాకులారా?

చు॥ మొనయదు మీరు ద్రాగుటకు ముందరి నీళులు ద్రావగై కొనం
దునుమదు మీ ననన్ నెనరుతో నగలాసనటారి యైనదా
నొనరుచు నబ్బ పబ్బముగ నోపిక మీతొలుపూఁత కాఱిదే
చనుమగ నింటికిన్ సెలవొసంగుఁడు మీరు శకుంతలమ్మకున్
9

(కోవెల కూత విని)

గీ. ఈ యడవి చుట్టములు మ్రాఁకులీవితాన
ఈ శకుంతలకును సెలవిచ్చి యికను

పోయి రమ్మని నట్లు కూ కూ యటంచు
జెలువు మీఱఁగఁ గౌదమ కోయలలు గూసె.

(నింగిం జూచి)

చ॥ చలువల తాన కమ్మలగు చక్కని తమ్మి కొలంకులీవలా
వలకడు నెండ వేఁడిమిని బాపగ మ్రాఁకుల నీడలున్ వెనుం
దలననువైన గాలిబుడుతల్ నునుదామర గంద వొళ్ళతో
బొలయగనీదురారి సుగమో సుగమై పదిలంబుగావుతన్. 11

(అందఱును అచ్చెరు పడిరి.)

గౌతమి : అమ్మాయీ తమవారిమీద మక్కువలుదై వారు ఈ పల్లె మ్రాకు వేలుపులు నీకు సెలవిచ్చినారు మ్రొక్కమ్మా.

శకుం : (చేతులు జోడించి నడచి అందఱికి వినరాకుండ) ప్రియంవదా, మగవారి యింటికి వేడుకతో నేను బోవుచున్నాను గదా. ఈ తపసిపల్లె విడిచి పోవుచున్నానని నాకు అడుగు ముందుకు సాగదే, వగపు నిలుపలేక యున్నానే.

ప్రియం : ఈ పల్లెను విడిచిపోవుచున్నానని నీవు వగచుట యెంత! నిన్ను విడిచి నిలువ వలసి వచ్చినందుకు ఈ పల్లె యెంత వగచుచున్నదో చూడు. దీని పాట్లేమి చెప్పుదు.

క. లేళ్ళా మేపులనుడిగె నె
మళ్ళా నట్టువకు విప్ప మానెనుఁ గుంచెల్
త్రుళ్ళాపక విడిచెను గ
న్నీళ్ళాయన తీగెలందునిగెఁ దెలనాకుల్ 12

శకుం : (తలపోసి) నాయనగారూ, అక్క తీగె అయిన అడవి వెన్నెల యొద్ద సెలవు దీసుకొని వచ్చెదను.

కాశ్య : మాయమ్మా ఆతీగెయందు నీకుగల అక్కజెల్లెంద్ర చెలిమిని నే నెఱుఁగుదును. ఇదిగో అది దక్కినముగా నున్నది.

శకుం : (తీగెంజేరి) ఓ యడవి వెన్నెలా, ఈ మామిడి గున్నతో నీ వల్లి బిల్లిగా నల్లుకొని యున్నను నీ కొమ్మలతో నన్నొక్కసారి కౌఁగలించు కొనుము. నేడు మొదలు నేను నీకు దవ్వైతిని గదా.

కాశ్య : అమ్మా శకుంతలా.

గీ. నిన్నుం గూఱిచి నేఁదలంచితిని మున్ నీనోములుంబండెఁగా
వన్నెన్ వాసిని సాటియౌ మగఁడె చేపట్టెంగదా తీరె నా
కున్నేడిచ్చలు మావిగున్న పయిఁబ్రాకుం గ్రొత్త పూజాజితీ
వెన్నీ యందును నొక్క పోలికయసూవే కొందలం బేటికిన్13

ఇకను దారివెంట నడువు అమ్మా.

శకుం : (చెలికత్తెలనుఁజూచి) చెలియలారా దీనిని మీ కైవసము చేసితిని.

చెలి : ఈ తీగెను మాకైవసము చేసితివి. సరే, ఈ యిద్దఱి నెవ్వఱివసము చేసినావు. (అని కంటఁదడి పెట్టుచున్నారు.)

కాశ్య : అనసూయా, ప్రియంవదా, ఏమిటది, ఆలాగున ఏడువ వచ్చునా? ఇంక మీరు శకుంతల నూఱార్చవలసిన వారు. అట్లుండగా మీరే దిగులుకొన్న యెడల ఎట్లుగా నుండును.

(అందఱును నడచుచున్నారు.)

శకుం : నాయనగారూ, ఇదిగో మనపాక దగ్గర తిఱుఁగుచున్న చూడి లేడి మెల్లఁగా నడచి వచ్చుచున్నది. ఇది యీనఁగానే నాకొక జాబు వ్రాయించి పంపించుండేమి. మఱవవద్దు సుండీ!

కాశ్య : కానిమ్ము ఆలాగేలే, మేము మఱచియుండము.

శకుం : (నడక తొట్రు పాటును జూపి) నా కొంగుఁబట్టి లాగుచున్న వారెవ్వరు (అని వెనుకకు తిఱిఁగి చూచుచున్నది.)

కాశ్యప :

చ॥ తడిపితి గారనూనియల దబ్బలు దాకి మొగంబుగందినన్
మెడ కొనగోళ్ళ గోకుచును మేపితి దోసెడు దోసెడేసి సు
త్తుడుఁగగ జామల న్నెనరు నోపిక మీఱఁగ గొంగునంటి వెం
బడి బడి వచ్చు లేడి పసిపాపడు వీడి దెసచూడు కూతురా. 14

శకుం : ఏమి చిన్నబిడ్డా. మన సావాసము విడిచి పోయినది కదా. ఇకనే మున్నది. ఏలనన్ను బట్టుకొనెదవు. తడవువాళ్ళు గొడ్డు మ్రోచి నిన్నుగన్న నీతల్లి లేకపోయినను నా చేతులలో నిన్నినాళ్ళ పెఱిగితివి గదా. నేను నిన్ను బెంచుట ఇక లేకపోయినను నాయనగారే కనిపెట్టి యుందురులే. పో!పో! (అని యేడ్చుచు బోవుచున్నది.)

కాశ్య :

ఉ॥ తెన్నిది మిట్ట పల్లములు దేలిన నేలసుమీ పరాకునం
దిన్నగఁబోవ లేము సుము తేఁకువఁ గాలిడఁ దొట్రు పాటగున్
కన్నుల ఱెప్పలెత్తెదవు కారును నీళ్లిక జాలి నిల్పుమీ
ఇన్నిటి మీది చెల్మివిడు మీ కడు మీ సరమైన నిల్కడన్. 15

శాఙ్గ౯రవుడు : చనువైన చుట్టాలను సంగదనుక బంపుమనికదా పెద్దలు చెప్పుదురు. ఇదిగో ఈ కొలని దాపునకు వచ్చితిమి, ఇక మమ్ము విడిచి దిగుబడుండయ్యా.

కాశ్య : అటులైన ఈ పాలచెట్టు నీడను నిలిచెదము (అని యందఱు నడిచి యచ్చట నిల్చిరి.)

కాశ్య : (తనలో) ఆ రారాజయిన దుష్యంతునకు మరియాదకు గొఱఁత రాకుండను ఆయనకుఁ జెప్పఁదగిన వితముగాను, ఏ మాటను జెప్పి పంపవలయును అని తలపోయుచున్నాఁడు.

శకుం : (అందఱికిని వినరాకుండ) చెలియా చూడుము, ఈ జక్కవ పడతి తామరాకు చాటుననున్న తన జోడుకానిఁ గానక త్రొక్కిస పడుచు గూయుచున్నది. అలాగే నేనును.

అనసూ : అలాగనవలదు.

క. ఇది చెలిమి కాని విడిచియు
ఎద వెతదానెంత మిక్కిలేనియు రేయిన్
దుద ముట్టించును నిలుపదె
మది నాస విరాళి యెంత బరువై యున్నన్. 16

కాశ్య : ఓ శార్ఙ్గరవా, ఈ శకుంతలను ముందుంచుకొని నీవా రారాజుతో నా మాటలుగా నిట్లు చెప్పుము.

శార్ఙ్గ : అలాగే చెప్పుచున్నాను, సెలవిండు.

కాశ్య :

చII తలపులు చిక్కఁబట్టు జడదాలుపులన్ మముఁబారఁజూచి మీ
కొలమున గొప్పనెంచి, నిను గుట్టుగ నెట్టులొ కట్టుకున్న యా
చెలిమినిఁ గాంచి, నీదు పెరచేడెల నెక్కువగం దలంచుమా
చెలినిక నాడు బందుగులు చెప్పరు తక్కిన నెగ్గ నోముదే. 17

శార్ఙ్గరవుడు : అయ్యగారూ అక్కడ చెప్పవలసిన మాటలు చక్కఁగాఁ దెలిసినవి.

కాశ్య : అమ్మా శకుంతలా, నీ కిప్పుడు కొన్ని మంచి బుద్ధులు చెప్పు చున్నాను. మేము అడవిలోనున్నామని నగరులవారి తగవు లెఱుఁగని వారము గాము.

శార్ఙ్గరవుడు : తమవంటి పెద్దలకుఁ దెలియని వేమున్నవి.

కాశ్య : శకుంతలా నీవు పెనిమిటి యింటికిఁబోయి అచ్చట,

చంII కొలువుము పెద్దలన్ సవతి కొమ్మల నీచెలికత్తె లట్లుగా
దలపుము పెన్మిటెంత బెడిదంబుగ నల్గిన మాఱు పల్క కి
మ్ముల బలగంబు పై నెనరు పూనుము గల్మికి నుబ్బఁబోకు మి
ట్లలరిన గేస్తురాల్ నలుగు రౌననఁ దక్కిన నింటి చేటగున్ 18

ఇక మన గౌతమి కేమి తోచుచున్నదో.

గౌతమి : ఇంతే చెప్పవలసినది, ఇంకనే మున్నది. అమ్మాయీ, యీ చెప్పినదంతయు వినుచున్నావు కదా. మఱచిపోకు షుమా.

కాశ్య : అమ్మా, నీ చెలికత్తెలను, నన్ను ఒకసారి కౌగలించుకొని పో అమ్మా.

శకుం : నాయనగారూ, ప్రియంవదా, అనసూయా యిక్కడి నుండియే వెళ్ళిపోదురా.

కాశ్య : అమ్మా వీరును నీవలె మఱియొకఱి పాలయ్యెడి వారే కనుక వీరు నీతోడ రాఁగూడదు. నీతో గౌతమమ్మ వచ్చుచున్నదిలే, పో అమ్మా బెంగబెట్టుకో వద్దు.

శకుం : (తండ్రిం గౌఁగలించి) గందపు కొండ మీది నుంచి విఱుఁగబడిన మంచి గందపు చెట్టుకొమ్మవలె నాతండ్రి తొడమీద నుండి పొఱుగు సీమలకుఁబోయి, నా యుసురెట్లు దక్కించు కొనఁగలను.

కాశ్య : అమ్మా యెందుకింత వగచెదవు.

యవనిక :

మంచి కొలమగు మగని పట్టపు మగువవై నీవుండఁగా
మించుఁ గలిమిని మేటి పనులను మీఱి తీరిక తగ్గఁగా
కాంచి బిడ్డను పెంచి తూరుపు వంచ ప్రొద్దును బోలఁగా
నెంచ వించుక నన్నుఁ బాసితి నంచు నీమది నమ్మరో. 19

శకుం : (తండ్రి యడుగుల మీదఁబడుచున్నది)

కాశ్య : నీ తలఁచిన కోరిక లీడేరును గాక.

శకుం : (చెలికత్తెలదగ్గరబోయి) చెలులారా మీరిద్దఱు నన్నొక్కసారి బిగ్గనఁ గౌగలింపుఁడు.

చెలియలు : (అట్లు చేసి) చెలియా, ఆ రారాజు నిన్ను మఱచిపోయినట్లు నీకుఁ దోచెనా నీయొద్దనున్న ఆయన పేరుగల యుంగరమునుఁ జూపుము.

శకుం : మీరు సందియపడుట నాకు వెఱపును బుట్టించుచున్నది.

చెలియలు : వెఱవకు, మిక్కిలిగా నెక్కడ మక్కువలుండనో అక్కడ సందియములు తోచుచునే యుండును.

శార్ఙ్గ : అమ్మాయి శకుంతలా. ప్రొద్దెక్కి పోవుచున్నది వేగిరపడవలెను.

శకుం : (పల్లెవంకఁజూచి) నేనీ పల్లెను తిఱిగి యెప్పుడు చూతునో.

కాశ్య : అమ్మా విను.

గీ. తడవు నాళ్ళన్ని మేరల నడిమి పుడమి
సవతివై సాటిలేని దుష్యంతువలని
బిడ్డఁగని పెత్తనము వాని మీద నిల్పి
తీరుబడిగల్గి నీవు నీవారు రండు
చేరి మా పల్లెకును మళ్ళు దోరణంబు. 20

గౌతమి : ప్రొద్దెక్కి పోవుచున్నది, మీ నాయనగారిని దిగుబడమని చెప్పు. (కాశ్యపుం జూచి) ఎంతసేపు జూచినను బిడ్డ పలుమాఱు నిట్లుగానే వలపోయును. ఈ తమకమెప్పటికిఁదీరునది. దిగుఁబడుండు.

కాశ్య : నేను నానేమములకుఁబోవలెను. అవి విడువ రాదుగదా. అమ్మా శకుంతలా, పో, తల్లి.

శకుం : (తిరిగి తండ్రినిఁగౌగలించుకొని) నాయనగారూ మీ బెట్టిదంపు నోములతోనే మీ యొడలు సడిలినది. ఇక నేను వెళ్ళి పోతినని కూడ స్రుక్కించకుండు.

కాశ్య : (ఊర్చి)

గీ. ఏ నెటుల సైతునా చిన్నికూనకాన
కొంప గుమ్మాన బూతాల కొఱకు నీవు
జల్లు నీవారి వరిగింజలెల్ల మొలచె
చూచి తలపోసి తలపోసి స్రుక్కవలసె. 21

నడువమ్మా, నీదారి మంచిదగుగాక.

(శకుంతలయు, ఆమె వెంటబోవు వారును వెళ్ళిరి.)

చెలులు : (దారిచూచుచు) అయ్యో! శకుంతల తోట చాటునకుఁబోయినదే (అని కంట దడిపెట్టిరి.)

కాశ్యప : అనసూయా, ప్రియంవదా, మీ చెలికత్తె మీకు దవ్వైనది. ఏడువ వలదు.

చెలులు : అయ్యగారూ, శకుంతల లేని పాడుపల్లెలోనికి మేమెట్లు పోదుము.

కాశ్యప : మీరు మిక్కిలి చెలిమి చేసితిరి కాన మీకిట్లున్నది. పిల్లలారా! ఇదిగో శకుంతలను అత్తింటికిఁ బంపినాను. ఇప్పుడు నా గుండె కుదిరి యున్నది. ఎందుకనగా.

గీ. ఆడు బిడ్డ మఱొక్కరిదైన సొమ్మె
ఈమెఁ బెనిమిటి యింటికంపించి లోన
నున్న దేవర కుదిరి కూర్చుండు నింక
నరిది తలపోతలను నిల్పినపుడు బోలె. 22

(అని యందఱు వెళ్ళిరి.)

శ్రీరస్తు

అభిజ్ఞానశాకుంతలము

అచ్చతెనుగు

అయిదవ యంకము

(తర్వాత గద్దెమీద గూర్చున్న రారాజును, విదూషకుఁడును వచ్చుచున్నారు)

విదూష : (వీనులిచ్చి) సామి మీ తలంపును కొంచెము నిలిపి మన పాటల సాల వైపుగా కొంచెము వినుండయ్యా. స రి గ మ ప ద ని స లు క్రింది నుంచి మీదికి, మీది నుంచి క్రిందికి ఏమి మడతలు పడుచున్నవయ్యా! ఎంత తియ్యగా నున్నది! ఆఁ ఆయంచకాళ్ళాబిడ కాఁబోలునుండీ, దేవేరిగారు సావేరితానమట్టు నేఱ్చు కొనుచున్నట్టున్నదే.

దుష్యం : ఊఱకుండవయ్యా, కొంచెముసేపు విందము.

(ఆకసమునఁ బాడబడుచున్నది)

గీ. క్రొత్త పూఁదేనియల యాన గొండివగుచు
నీవు క్రొమ్మావి విరివట్లు మోవిగఱచి
తమ్మియింటనె కడుహాయి సొమ్మసిల్లి
తుమ్మెదా దాని మఱువంగఁ దోచెనెట్లు 1

దుష్యం : ఈ పాట విన్నావా చెలికాఁడా. ఇది యేమిటో నాకుఁ దెలియదు. ఇందులో అక్కరములు తక్కువ. కూనతీగె లెక్కువ. దీని పేరు టొమ్రిూ అని వాడుదురు. విన్నావా.

విదూష : అయ్యా, టోమిరో గీమిరో నాకుఁదెలియదుగాని, ఆ, ఈ, ఊ, ఏ, ఓ, అంచు క్రింది నుండి మీదికి మీది నుండి క్రిందికి. ఈ ప్రక్క

నుండి ఆ ప్రక్కకు, ఆ ప్రక్కనుండి యీ ప్రక్కకు, ఊ...... పాటే వినబడినది కాని అందులోని పలుకుబడి యొకటైనను నాకుఁ తెలియలేదు. మీకేమైనాఁ దెలిసినదా?

దుష్యం : (చిఱునవ్వు నవ్వి) ఈ మానిసిని నేనొక్కమారు చూచినానయ్యా. అప్పుడు దీని పాట విని యున్నానులే. అందుచేత పలుకుబడులు నాకు చక్కగాఁ తెలిసినవి. వసుమతి మీద నాకుఁగల కనికరము దెలియఁజేయుచున్నది. యుల్లసాలాడుచున్నది. చెలికాఁడా! మాదవియ్యా, నన్ను నేర్పుగా తియ్యని మాటలతోఁ దిట్టితివని నేనన్నట్లుగా హంసపదికతోఁజెప్పేమి.

విదూ : ఆలాగే (అని లేవబోయి) ఓహో! బాగుగానే యున్నది మంచి పని కంపుచున్నావు. ఆ పిచ్చి కూత, ఈ పిచ్చి కూతగూసి మీదాపున బ్రతుకుచున్నాడను, ఇప్పుడు నేను బోయెడి పనిచేసి తిరిగి, బ్రతికి వచ్చి అక్కడి మాట యిక్కడ చెప్పఁగలనా? ఆసలుడిగినవాఁడు, అచ్చర దగ్గిరకుఁ బోవఁగా బానిసగత్తెలు పట్టుకొని బడబడ తన్నినట్లు కాదు గదా నాపని.

దుష్యం : పోవయ్యా, వెఱపు లేదు. ఇదిగో అచ్చట నాజూకుగా మాటలాడుమా.

విదూ : బాబూ! నాకేమి దారోయి! నాకుమూడినది! తప్పదు. (అని వెళ్ళెను)

దుష్యం : (తనలో) ఏమియిది. నేనెవ్వతిని విడిచి యుండలేదే. ఈ టోమిరీ విన్నప్పటి నుంచి దిగులు దిగులుగా నున్నదెందుచేత.

మ॥ రవురుల్ సౌరులు చూచి తేటలగు పాటల్ వీనులం జొన్పి బల్
చవికిం జంకలు కొట్టు కొందుఱు సుగాలంబొందియున్ జూడన
ట్లవుగాఁ దొల్లిటి పుట్టువందుగల నెయ్యంబుల్లముంబట్టి ని
క్కువ మా సుద్దితలంపులోఁబడు పరాకుల్ తెల్పకున్నప్పుడున్2

(అని కళవళ పడుచున్నాడు.)

(కంచుకి వచ్చు చున్నాఁడు)

కంచుకి : (ఊర్చి) అయ్యో! నాకీ దెస పట్టినది.

ఆ.వె. రాణి వాసములనుఁ బ్రాఁత వాడుకయంచు
విన్నకతనఁగొంటి బెత్త మిద్ది
అదియుఁ బట్టుఁగఱ్ఱ యాయెను నాకిప్పు
డేళ్ళు గడవ నడవ గూళ్లు కదలి. 3

ఇప్పుడే రాచగద్దియ నుండి లేచిన దొరవారిని తిఱిఁగి రాచ పనులలో దింప వలసి వచ్చినదే కాని, దొరలకు పొఁడి దప్పక యెల్ల పనులు విసుగక చేసుకొనక తప్పదు కదా. నా పనియు నేను చేసికొన వలసినదే కదా. ఇప్పుడు కణ్వుల వారి వద్ద నుంచి, వారి యొద్దఁజదువుకొను వారిద్దఱు వచ్చి యున్నారని చెప్పవలెను.

ఆ.వె॥ ఒక్కసారి కట్టి యూన్చును గుఱ్ఱాల
విడఁడు ప్రొద్దు గాలి విసరు రేయుఁ
బగలు, నెపుడు పుడమి బరువు మోచునుఁ బాప
ఱేఁడు, నాఱ్వపాలి గాఁడునట్లు. 4

నా పని నేను జేసెదను (అని నడచి) ఇదిగో ఏలిన వారు.

గీ. పజల బిడ్డల వలె వారి పాటులందు
విడచి యే కతమునఁ దీరు బడిగ నుండె
పలుగములఁదోలి పగలెండఁ బడిన హత్తి
పట్ట పగలింటఁజలి తావు పట్టినట్లు 5

(దగ్గరకుఁబోయి) జోహారు, జోహారు. అయ్యా. మంచుగొండ దాపున నున్న యడవులలోఁగాపురములున్న తపసులు, కాశ్యపులవారి పంపున ఆడువారితోఁగూడ వచ్చియున్నారు. ఆ పైన మీ సెలవు చొప్పున.

దుష్యం : ఏమీ! కాశ్యపులవారి పంపున మాటలాడ వచ్చినారా?

కంచు : అవును, అయ్యా!

దుష్యం : అలాగైన యెడల ఆతపసులను ప్రాఁబలుకులతోనుండు పలుకులతో మరియాదచేసి తోడ్కొని రమ్మని మన యొజ్జల వారైన సోమరాతులవారికి నేను చెప్పినట్లు చెప్పుము. నేను ఇచ్చట ఆ పెద్దలను దరిసెనము చేసి మరియాద చేయఁదగిన చోటనుండి వారికొఱకెదురు చూచు చుందును.

కంచు : ఏలిన వారి పంపు చేసెదను.

దుష్యం : (లేచి) ఎవరక్కడ.

పణిహారి : (వచ్చి) అయ్యా సెలవు సెలవు.

దుష్యం : వేత్రవతీ, మన వేలిమి సాలకు దారి చూపుము.

పణిహారి : అయ్యా, ఇటురండు, ఇటురండు.

దుష్యం : (ఇటు అటు నడచి దొర తనపు షోకుతో) జగమునందలి యెల్ల వారికి సుగము గలిగి యుండునుఁగాని, ఏలుబడి చేయువానికి మట్టుకు కోరికలు దీరిని వాఁడగా కనపడుటయే కాని తుదకది యంతయు చేటే, ఎందుచేననగా.

చ॥ అది యిది నాకు జేకుఱఁగ నౌనను కోరిక లిచ్చు, గొప్పవా
సి దొరతనమ్ము, తానటులఁ జేర్చిన దెల్లనుఁ గాపుసేయుట
న్నది పొగిలించు, రాచరిక మాఱ్చదు తీర్చదు కొందలమ్ము, చేఁ
గదియఁగఁబట్టున గ్గొడుగు కామయ పోలెడి నెంచి చూడఁగన్.
6

(తెఱలో)

(బట్టు వాండ్రిద్దఱు :- దేవరా, జోహారు.)

మొదటి : గీ॥ ప్రజల మేలునకై పాటు పడెదు, నీదు
బాగెఱుంగవు నీ నడవడిక యిట్లె
నిచ్చఁదన నెత్తిఁగాలంగ వచ్చి చేరు
నట్టి వారినిఁ దననీఁడ బెట్టు చెట్టు 7

రెండవ : గీ. నిలిపెదవు గట్టి కట్టడి నేరగాండ్ర
వాదుల నడంతు మంచియేల్బడి యొనఱ్ఱు
కలిమి గల చుట్ట లెందఱు గలిగి యున్న
నట్టి చుట్టఱికంబు నీయందు ముగిసె. 8

దుష్యం : విసికి విసికి యున్నాను. బడలికగా నున్నది (అని నడచుచున్నాఁడు)

పణిహారి : దేవరవారు ఈ క్రొత్తగా అలికి ముగ్గులు పెట్టి చక్కగా సింగారించియున్న వేలిమిసాల గడప నడగుబెట్టఁగోరుచున్నాము. వేలిమికిఁ బాలు, నెయ్యి, యిచ్చెడి జన్ని మొదవు కూడ నక్కఁడనే యున్నది.

దుష్యం : (గడపయెక్కి కొలువుకాండ్ర కైదండలీయఁగా నిలిచియుండి) వేత్రవతీ, కాశ్యపులవారు నావద్దికి తపసులం బంపుటకుఁ గతమేమో.

మ॥ పనుపాటొ ముకుమూత నోములని రాబారుల్ పనుల్తీఱ్చిరో
యనుపుల్లేక, యెవండ యే దుడుకుఁ జేయంజొచ్చెనో, వారికె
ల్లనుఁ బాళెంబుల యందునం జెడెనొ పూల్పాల్చెట్ల నా తప్పుచే
ననుచుం ద్రొక్కిసలాడుచున్న యదికట్టా నాదుడెందంబొగిన్ 9

పణిహారి : ఏలినవారిని యేలుబడి మిగులఁ బొగడదగియున్నందున మిమ్ముం గొనియాడుటకు దపసులు వచ్చినట్లున్నది.

(శకుంతలను ముందిడుకొని గౌతమియు, వీరిరువుఱను ముందు

బెట్టుకొని తపసులు నుండగా, వారి పురోహితుఁడును, కంచుకియు వచ్చుచున్నారు.)

కంచు : అయ్యలారా! ఇట్లుగా రండు

శాఙ్గ౯రవ : శారద్వతా!

మ॥ తన కల్మింగని మీఱడెప్డు మరియాదల్ రే , డొకండైనను
న్నన వీడండు కొలాల వారి కొదుగుం దాఁగొంచెఁగాఁడయ్యు నై
ననుఁబల్లెం బలునాళ్ళ నుండడవిలోనం జోగినై యున్ననా
మన మీపేటను మందిఁగాంచి తలచుం బల్మంటలో నిల్గుగాన్.

10

శారద్వ : ఈ నగరులోనికిఁజొచ్చిన నీకీలాగుననుండుట యొప్పిదమే. నేనూ

చ॥ అనువుగఁబున్నెపుం జలక మాడిన వాఁడు తలంటు కొన్నవా
నిని మడినున్నవాఁడు కడు నిండిన యంటుగలాని మెళ్కువన్
బెనఁగు నతండు కూర్కునతనిం దిఱుఁగాడెడి వాఁడు కట్టి నా
తని నెటు లట్టులీ కలిమి దట్టిన కావురగాంౖడ నెంచెదన్ 11

శకుం : (చెడ్డ సగిన మైనట్టు కనపఱచి) అయ్యో, ఏమియిది! ఏవంతల పాలగుదునో కుడి కన్నదఱుచున్నది.

గౌతమి : అమ్మా నీ కీడు తొలంగి పోగాక, నీ పెనిమిటి యిలువేల్పులు నీకు సేమమొసంగుదురు గాక (అని నడచుచున్నారు)

పురోహితుఁడు :-(పుడమిఱేనిం జూపి) జడదారులారా! ఈ కానం బడుచున్న వారే కొలములయంతరువులు బాగుగా పరికించి కాపాడు రారాజు, గద్దెమీది నుంచి దిగి మీ రాక కెదురు చూచుచున్నారు. వారి దరిసెనము చేయుఁడు.

శాఙ్గ౯రవ : మీరు పెద్దలు. జన్ని గట్టుల మిన్నలు అని మేము తెలుసుకొంటిమి. మీరు పురోహితులు గాన ఆహా, మీ దొరల నడవడి మిక్కిలి కొనియాడ వలసినదే గాని మాకు వలపచ్చము లేదు విను.

గీ. కలయఁగాచిన మ్రాఁకులు తలలవంచు
నీళ్ళనిండి మొయిళ్ళు దౌదౌల వంగు
మంచి వారెంతఁ గల్గిన మఱఁగి యుండ్రు
పెట్టు పోతలొనర్చు వారట్టివారె. 12

పణిహారి : ఏలిన వారికి మనవి చేసుకొనుచున్నాను. ఈ రుసుల మొగములు చూడగా విప్పారి యున్నవి. ఏదో మెత్తమెత్తఁగా తమ పనులు చక్కఁబెట్టుకో వచ్చిన వారుగానే యున్నారు గాని మఱియొక లాగులేరు.

దుష్యం : (శకుంతల వైపుఁజూచి) ఈలత కూన

క. నిండించె మేలుముసుఁగున్
మెండుఁగఁ గనరాని మేని మెఱుఁగులతోఁదా
నుండెం తపసుల నడుమనుఁ
బండాకుల లోనఁ గానఁబడు చిగురు వలెన్ 13

పణిహారి : ఏలినవారు కొలువుకత్తె మనవి చేసికొనుచున్నది. నా యుల్లము ఈమె చక్కఁదనమునుఁ దెలుసుకొన వలెనని యువ్విళ్లూరు చున్నది. కాని ఆమె చక్కఁదనము తెరచాటయినట్లున్నది. నాకెటులను దోచకుండ యున్నది. ఇంతకును మిక్కిలి చక్కనిదియే కాని మరియొకటి కాదు.

దుష్యం : అవును గాక. ఒరుల యాడు వారిని జూడ వచ్చునా?

శకుం : (ఱొమ్మున చేయి పెట్టుకొని తనలో) డెందమా యెందుకు గొందల పడెదవు. మగవారి యుల్లము నింకను బాగుఁగఁ దెలుసు కొనలేదే. తెలిసికొను వరకు గట్టిఁగా బిగఁబట్టుకొని యుండు.

పురోహి : (కొంచెము ముందఱికి వచ్చి) అయ్యా! వీరు చేయదగిన వరుసను మరియాద చేయఁబడిరి. వీరి పెద్దలు చెప్పి పంపిన దేదో యొకటి యున్నది యట. మనవి చేసి కొందురు. ఆలింపఁగోరుచున్నారు.

దుష్యం : మిక్కిలి యాసతో నున్నాము.

తపసులు : (చేతులెత్తి) పుడమి ఱేఁడా నీకు మేలగునుఁగాక.

దుష్యం : అందఱికిని గేలుమోడ్చి మ్రొక్కుచున్నాఁడను.

తపసులు : నీ కోరిక లీడేరు గాక.

దుష్యం : మీ వేలిమి సాలలు సేమముగా నేయడ్డంకులు లేక యున్నవా?

తపసులు: క. పున్నెపుఁ బనులకు నెట్టుల
బన్నంబులు గలుగు మంచివారి దొరవు నీ
వున్నపుడు, వేఁడి వేలుపు
జెన్నుఁగఁ దానెండఁ గాయఁ జీఁకటి యున్నే 14

దుష్యం : నేను రాచవాఁడ ననిపించుకొను చుంటినా? గొప్పవారైన కాశ్యపుల వారు సేమముగా నున్నారా?

శాఙ్గఁరవ : మీ యేలుబడిలో నున్నవారి సేమమంతయు మీ చేతిలో నున్నది కదా. ఏకలఁకులు లేక మీమేను చక్కఁగా నుండుటం గోరుచు మీతో మనవి చేయవలసినదని వారు కొన్ని మాటలు సెప్పినారు.

దుష్యం : వారేమి సెలవిచ్చినారు.

శాఙ్గఁరవ : మఱియొకఱికిఁ దెలియకుండ మీలో మీరే చేసుకొన్న చెలిమి బలిమిని నాకూతుం బెండిలైతిరి. మీ యిద్దఱి యందును నాకుఁ గల నెయ్యము వలన నేను ఆ పనిని ఒప్పుకున్నాను. ఎందుచేత ననఁగా.

ఉత్సాహ॥
నిన్నుఁ జూతు నెల్లదొరలకన్న గొప్ప వానిఁగా
బున్నెములకు రూపుఁగల్గెఁబో శకుంతలమ్మ దా
నన్ని సొగసులమరియున్న పొన్ని మగనిఁగూర్పఁగా
నిన్ని నాళ్ళు కనని బమ్మ కిపుడ వాదుతీరెఁగా 15

కావునఁ జూలు మోచిన యీ జవరాలిని నీవు నీకైన యిల్లాలుఁ గాఁ గైలుకో సేయుము.

గౌతమి : అయ్యా, నాకుంగూడఁ గొంత చెప్పఁదలంపువున్నది కాని నాకు ఏమి చెప్పుటకును సందు కానవచ్చుట లేదు. ఎందుచేత ననఁ గాఁ

ఆ. ఇదియు నీవునుఁ బెద్దల కెఱుకఁజేయ
లేదు, చుట్టాలకునుఁ జెప్పలేదు లేదు
మీరు మీరయి వియ్యాలు దీరినపుడు
నాకు నేమున్నదికఁ జెప్ప మీకు మీకు 16

శకుం : (తనలో) నామనికి యును కులగు చెలిమి కాఁడేమి చెప్పనున్నాఁ డో?

దుష్యం : ఏమిటిది. ఆఁ, ఏమిటిది. ఈలాగునఁజెప్పుచున్నారేమి.

శకుం : (తనలో) ఈ పలుకులు చెవులకు ములుకులుగా నున్నవే.

శాఙ్గరవుడు: ఇదేమి, యిదేమి యనియెదరేమి. ముజ్జగంబుల మీరెఱుఁగని మంచిచెడ్డలున్నవా?

ఉ॥ పున్నెపురాలు దానయిన పుట్టిన యింటనె యిచ్చ మెచ్చుఁగా
నెన్నది యేని పెన్మిటికయిం దగఁబట్టిన దాని కారదుల్
సున్నని యెన్న రాదు గద లోకులు కాకులుగారె కావునన్
జిన్నది చేసుకొన్న తన చెంతనె కోరుదురుండ బందుగుల్. 17

దుష్యం : అదియేమి? ఈ చిన్నదానిని మున్ను నేను బెండిలైతినా?

శకుం : (దిగులుకొని తనలో) ఓడెందమా. నీ కొందల పాటు నిక్కమాయెఁ గదా! చేటు మూడినదే.

శాఙ్గరవుడు: ఏమిరా రాజునకు తగవుదప్పి ఇట్లు చెప్పుట తగునా! కొంత మట్టునకు,

కం॥ ఏమీ ముగియించిన పని,
పై మళ్ళా, తగువు నందు మారు మొగంబా
మా మాట తోసివేతా,
ఆమెక్కునుఁ గలిమిమైక మందు దరుచుగాన్. 18

దుష్యం : ఏమయ్యా స్వామి, అంతకంతకు ముదురుగా సెలవిచ్చుచున్నారే.

గౌతమి : బిడ్డా... గడియనేపు సిగ్గువిడువుము. ఇంకనేమున్నది. నీ ముసుగు దీయుచున్నాను తర్వాత నైన నిన్ను గుఱుతు పట్టునేమో. (అని ముసుగుదీయుచున్నది).

దుష్యం : (శకుంతలఁ జూచి తనలో)

యోగిని :

బెడఁగైన తళ్కులును బెళ్కులునుఁ గల్గి నాకొడఁబడియె నిట్టిరూపున్
కుదువంగఁజాల మఱి విడువంగఁజాలనిక నడుబొడ్డు మంచుతోడన్
తడిగొన్న మొల్ల విరిపొడుపొందు ప్రొద్దుకడ బడియాడు తేటినైతిన్
ఎడలేక ముసు దీని కడ నుంటినని చెప్పఁబడుమాట కద్దొ లేదో.

19

కొలువు కాంౘ్రందరు (గుసగుసలు) ఆహాహహా యేమి యీరారాజు. ఇంత పాడి తప్పని పఋవు నెక్కడ జూచితిమి! ఈ పాటి చక్కని చుక్కను జూచిన వాఁడెవ్వడు వెనుక ముందు త్రొక్కిసలాడును.

శార్ఙ్గరవుడు : రారాజా, ఏమియుఁజెప్పక యూరక యున్నావేమి?

దుష్యం : తపసులారా, నేను మిక్కిలి మదిఁబరికించినాను. ఇంత వరకు నాకు రవంతయైన యీ యింతిని గైకోలు చేసుకొన్నట్లు తలపునకు రానేలేదు. చూలాలని బాగుగా దోచుచున్న దీనిని ఈలాగున నుండగా నేను గట్టుకొన్నదేయని యెట్టు చేపట్టెదను.

శకుం : (దిగులుపడి తనలో) అయ్యో, ఈ రారాజునకు నన్ను చేపట్టితినా యన్న పట్టుననే నట్టుగొట్టినదే. ఇక నాయడియాసలు అడుగంటినవి.

శాఙ్గఁరవుడు: పుడమి ఱేఁడా యిటు విను.

మ॥ అనుగుంగూతును నీవు పట్టితవటం బా కొండపై నెక్కుమా
గొణుగుం బాపని దూరనౌ నతఁడు నీకుంబేరు తెచ్చెం గదా
తన యట్లెత్తుక పోవుచుండఁగనియున్ దాఁబోయి రారమ్మటం
చును దానిచ్చితి వాయినం బనెడి యెచ్చుల్ గొన్న బల్గుమ్ముచ్చుగన్ 20

శారద్వతుఁడు :శార్ఙ్గరవా, నీవు కొంచెముఉండుమోయి. అమ్మా శకుంతలా, మేము చెప్పవలసిన దంతయుఁజెప్పితిమి కదా. ఇక ఈయనగారిని నీవు చూచుచునే యున్నావు. ఈపుడఁమి ఱేఁడు ఈలాగున మాటలాడు చున్నాడు గదా. ఈయనగారికి నమ్మిక కలుఁగులాగున నీవు మాటలాడుము.

శకుం : (తనలో) అంతకింతైనది గదా. "అప్పటి మాటలకు దుప్పటి యిచ్చితిఁగాని యెల్లప్పుడు కప్పనిచ్చితినా" యనట్లయినది గదా. ఇక నాడెందము, కొందలమ్ముచే గుందవలసినదే. ఈయడియాసల వలన నేమున్నది. అయినను (బిగ్గరగా) నాయునికి మనుకులు నీవని నమ్ముకుని యున్న నా సామీ! (అని సగము చెప్పి) ఆహా! మనము గుట్టుగా ఏచుట్టములకుఁ దెలియకుండ చేసుకున్న చెలిమి పట్టున నేనట్టు గొట్టినదా నీకు. ఇది నీకు మరియాద కాదు. ఓ పురువంగడమునఁబుట్టిన యొప్పుల కుప్పా. గోలయై బేల యై యున్న యీయాడుదానికి నీవు చేసినబాస లెంత లేసి. నా సాటివారిలో నాకు తలవంపులుగా ఇప్పుడీలాగున తేలిక మాటలాడి నన్ను గోల పెట్టుట నీకు నాయమా?

దుష్యం : (చెవులు మూసుకొని) ఏలినవాడా! ఎంత లేసి మాటలు వినవలసి వచ్చినది. నాదోసము పాసిపోవు గాక.

గీ. వంగడములోన మాకున్న పరువు చెఱిపి
గోతిలో నన్నుఁబడఁద్రోయఁ గోరి నావొ
నీళ్ళ దరిన మనమలాడ నిమ్మ చెట్టు
నీత మ్రోతల నొడ్డారు నేరుపోరె. 21

శకుం : కానిండు! కానిండు! అట్లే కదా, నేను మఱి యొకతి యిల్లాల నేమో యని కదా మీరిట్టి సందియము పాలైతిరి. మీకు గుఱుతు చూపి మీసందియము విడఁగొట్టలేనా?

దుష్యం : ఆలాగైన మంచిదే కదా. ఇకనేమి?

శకుం : (ఉంగరపు వ్రేలు చూచుకొని) తటపిట పడి .... అయ్యో! నా యుంగరమేది! ఇదేమమ్మా ఉంగరము కానరాదు.

(అని దిగులుతో గౌతమిని జూచుచున్నది)

గౌతమి : ఇదేమే బిడ్డా, దేవరాయని కొలని యొద్ద అత్రేవు కడ మ్రొక్కు లెత్తఁబోయినపుడు పోయినది కాఁబోలునే అమ్మా.

దుష్యం : (చిఱు నగవుతో) ఓహో! చూచితిరా “ఆడువారి మాటలు అదను మాటలు” అను సామితె తప్పిపోవు నేమో!

శకుం : కానీ యేమి చేసెదను, నా తలవ్రాత యెట్లాగా నున్నదో అట్లుగా జరుగ గలదు. ఇంకొక్కటి చెప్పుచున్నాను వినుసామీ.

దుష్యం : వినఁదగినదే కదా. చెప్పు.

శకుం : తలపోయుండు. ఒకనాడు మనమిఱువురము విరజాజి పొదరింట నుండగా పచ్చితామరాకు దొన్నెలో మీరు నీళ్ళు పోసుకొని యుండ లేదా?

దుష్యం : కానీ తుదముట్టించు కత.

శకుం : అప్పుడు "నిడుద చూపు" అని నేను పేరు పెట్టిన లేడిపిల్ల మన దాపునకు వచ్చియుండగా మీరు మీ చేతిలో నున్న నీళ్ళ దొన్నెను దాని మూతికందిచ్చితిరి. అది త్రాగక పోయెను. మఱిమఱి బతిమాలిన దానిని త్రావించబోతిరి. అప్పటికిని, అదిమూతి త్రిప్పెను. మీ చేచాయలకే రాకపోయెను. తఱ్వాత మీ చేతిలో నున్న దొప్పను నేను పుచ్చుకొనఁగానే నాలుక చప్పరించుచు ఆ లేడి పిల్ల నా దాపునకు వచ్చి నీళ్ళు ద్రాగెను. అంతట మీరు నన్నుఁజూచి పరియాచకముగాఁ, "దనవారు దాపునఁ జేరుదు రన్నమాట నిజమే కదా. మీకిద్దఱికి అడవి చుట్టఱికమున్నది." అని యనలేదా? గెపితికి రాలేదా ఇస్సిరో!

దుష్యం : ఇదే వరుస. ఇవే మాటలు. ఆహా! కమ్మని తిమ్మనాల వంటి కల్ల మాటలాడి ఉల్లములు కఱఁగించి వలపు కాంద్రను వలలోఁద్రొక్కించుకొని ఆడువారు గనుకనే ఆడువారైనారు.

గౌతమి : పుడమి రేడా! నీవు గొప్పవాడవు. ఎందుకిటువంటి పెడనుడుగులాడెదవు. పల్లెటూరి ప్రాంద్రకు కల్ల లెట్లుగా వచ్చును. ఈ పిల్లది కల్లలెట్టివో యెఱుఁగునా?

దుష్యం : వినుమమ్మా ముసలమ్మా.

గీ. కానమే పెంటి జీవాల గడుసుఁదనము
నేర్పుకయపుట్టు, నెట్టులో నేర్పఁబడిన
వింటికెగయక మును లాతి పిట్ట లొద్ద
పిల్ల బోదులఁగోయెలల్ పెంపనిడవె? 22

శకుం : (రోసముతో) ఎంత మాయకాడవయ్యా? ఇన్ని టక్కులు నీవు నేర్చిన దెఱుగఁక మోసపోతిని. తన వలెనే తక్కినవారను కొందురు. బయిల కెంతో తగవులదమ్మ రాయఁడవుగాఁదోచుచున్నావు గాని, పైన పాఱుటాకులు లోపటలోఁతు గోయిగా నున్న నీవంటివారు

మరియెవ్వరు నుండఁబోరు.

దుష్యం : (తనలో) ఈమె ఇట్లు కనలుట, ఇప్పుడున్న యీమె మొగమునుఁ జూడఁగా మెళకువ లెటిఁగిన మోసగత్తెఁగాఁ దోచుట లేదు. ఏమో ఏలిన వాని కొక్కనికే తెలియవలె.

గీ. మఱపుచే జాలిమాలిన మదినిఁజాటు
చెలిమి నొప్పని నామీద మలఁచి నట్టి
మలక బొమముడి కెంపు చూపుల మిటారి
కినుక మరువిల్లు విఱచెనో యనఁగ నొప్పె 23

(బిగ్గరగా) సిరిగల మొగముగల యో గరితా. దుష్యంతుని కతలెవ్వరెఱుఁగరు. అతని నడవడులందటికిఁ దెలిసినవే. అదియేమో కాని నీవు చెప్పిన పుక్కిటి కతలో నొక్కటి యైన నాకుఁ దెలియ లేదు.

శకుం : సామీ పురువంగడమునఁ బుట్టిన వాఁడవు గదాయని నమ్మితిని. ఇంత యంగట విసము, మున్నాల్కఁదేనెను బెట్టుకున్న వాఁడవని యెఱుఁగనైతిని. ఈఁతకు మిక్కిలి లోఁతు, చావునకు మిక్కిలి కీడును లేదు గదా. తెగఁబడితిని (అని మొగమున బట్ట వైచుకొని వలవల యేడ్చుచున్నది.)

శార్ఙ్గరవుడు : అంత తొందరపడి, తల్లికిఁజెప్పక తండ్రికిఁజెప్పకఁ చుట్టాలకుఁ జెప్పక, పక్కాలకుఁజెప్పక బుద్ధిమాలిన పని చేసుకొన్నప్పుడు కట్టి కుడుపదా యేమి? చేసుకున్నంత బోసేయ వద్దా?

క. కావున బాగుగ నారసి
కావింపఁగ వలసె, జాటు కలయిక యందున్
లోవెఱవెఱుఁగని వారల
సావాసం బిట్లు కొంత జరిగి పగయగున్ 24

దుష్యం : ఏమయ్యా, యీచిన్నదాని మాటలు వరాల మూటలా? నా

మాటలు వడగండ్ల మూటలా? ఆలాగున నన్ను గేలి చేసెదవేమయ్యా.

శార్ఙ్గరవుడు: (ఈసుతో) మీ తగవులకు తలలు క్రిందు కాళ్ళు మీదు.

గీ. పుట్టినప్పటి నుండియు మోసమె యల
వాటు పఱచఁబడని మాట సూటి కాదు
మొదల నుండియు మోసమే చదువుకొన్న
మానిసుల మాటలే తిరు మంతరాలు 25

దుష్యం : ఏమీ? తులిసి యుండలూడి పడుచున్నవి. మీ మాటలు మీరు చెప్పినట్లే యొప్పుకొనుచున్నాను. గాని యీగోలను గోలపెట్టి మేము మూటగట్టుకొనునది యేమున్నది.

శార్ఙ్గరవుడు: ఏమి యున్నది. ఇల్లాలిని యిలు వెడలు గొట్టిన దోసమే మూట గట్టుకొనునది.

దుష్యం : అట్టి దోసమును పురువంగడమునఁ బుట్టినవారు ఒడిగట్టు కొందురా?

శార్ఙ్గరవుడు: పుడమి తేఁడా, తీగెలాగిన పొద కదలును. 'నీళ్ళకు నాచు తెగులు మాటకు మాట తెగులు' అన్నట్లు, ఈ యెదురుబడి మాటలతో మాకేమి పని యున్నది. మా పెద్దల పంపు నెఱవేర్చితిమి. మేము మరలి వెళ్ళిపోయెదము.

క. ఆలాగునఁ గావున నిది
నీ లోఁగిటనుండఁదగిన నెయ్యపు నవలా
తోలెదొ యేలెదొ పెనిమిటి
పాలిదిగా యాలిజోలి పాలో నీళ్ళో 26

శార్ఙ్గరవుడు: గౌతమి ఇకచాలు, వచ్చిన పని వాకిఁటనే అయినదిలే, ముందుకు నడవండి. (అని యందఱు బయలు వెడలుచున్నారు.)

శకుం : అయ్యో – సామీ. నేనేమి చేయను. ఈ మాయలాని వగలు

నమ్మి మోసపోతిని. ఇక నాకు దారేమి? తెన్నేమి? మీరు కూడ నన్ను విడిచి పోవుచున్నారే. దెస మాలిన దాననైతి.

గౌతమి : (నిలచి) నాయనా, శార్ఙ్గరవా, ఏమిరా నడచిపోవుచున్నావు! శకుంతలనుఁ జూడరా, మింటికి గంటికి దారగా వలవల వాపోవుచున్నదిరా. ఇట్టి కట్టడి తనాన కొడిగట్టి గట్టిగా నాదానవు కావని వెళ్ళగొట్టిన యీ బెట్ట మగని యొద్ద ఈ చిట్టి పట్టె యెట్టు బ్రతుకును? వెంటనే వచ్చు చున్నదిరా

శార్ఙ్గరవుడు: (కనలి కన్నెఱ్ఱ చేసి) ఓసి యేమి నీవు తప్పు చేసిన దానవు. అది యట్లుండగా ఇప్పుడు విచ్చలవిడిగా మావెంట వచ్చెద వేమి?

శకుం : (గడ గడ వడఁకుచు నిలచి యున్నది)

శార్ఙ్గరవుడు: శకుంతలా!

చ॥ ఒడయఁడు సెప్పుచున్న యటులుంటివ యేనియు నింటి చేటువై
యడరెదు తండ్రి కేమియిక నయ్యెడి నీ వలనన్ సరే మఱి
య్యెడలను నీదు నేమమొక యింతయు మాయఁగలేదమేని యున్
బెనిమిటి యింటి యూడిగము మేలుగదా పరికింప నీకికన్. 27

నిలువుము మేము పోవుచున్నాము.

దుష్యం : ఏమయ్యా జడదారుల యొడయఁడా! ఏమి? యీ చిన్న దానిని మోసము చేసి పోవుచున్నారే?

క. చలువల ఱేఁడలరించుం
గలువలనే, ప్రొద్దు తమ్మిననలనె డెందం
బులు గట్టిన వార లొఱుల
నెలతలకై మొగము పెట్టనేరరు కలయన్ 28

శార్ఙ్గరవుడు: లాతి కూటములచే మున్ను జేసిన పనులే మఱచి పోయిన నీకు తగవేమి? తగవు చెడునని వగవేమి?

దుష్యం : (పురోహితుం జూచి) అయ్యా, యిందలి మంచి చెడ్డలు మీరే చెప్పవలెను.

గీ. నేనె బేలనో కల్లయో దీని మాట
కళవళం బాయె నేనైన గరిత విడుచు
వాఁడగుదు, కానిచో, మిండకాడ నగుదు
ముందు నూయి వెనుక గోయి యందు దీని. 29

పురోహి: (పరికించి) అలాగైన యెడల ఇప్పుడీలాగున చేయవచ్చును.

దుష్యం : మీరే ఆనతిండు.

పురోహి: ఈ యిల్లాలు నీళ్ళాడు నంత వరకు మా యింట నుండవచ్చును. ఎందుకీలాగున జెప్పెదరందురేమో, మీకు జగమంతయు నేలు పట్టి పుట్టఁగలఁడని పెద్దలు సెలవిచ్చి యున్నారు గదా. ఆ కణ్వుల వారి మనుమఁడు అట్టి వాఁడుఁగాఁ బుట్టు నేమో! అట్టయిన మనకు సంతోసమే కదా. అట్టి వాఁడు పుట్టెనేని నగరునకుం గొంపోవచ్చును. లేదా పుట్టిన యింటికి నెట్టివేయుట యుండనే యున్నది.

దుష్యం : మీకే లాగునఁ దోచునో అట్లు జేయించుఁడు.

పురోహి: తల్లీ నా వెంబడినే రా అమ్మా.

శకుం : తల్లీ, పుడమీ, నీలోనికి నాకు దారియిమ్ము.

(అని యేడ్చుచు అందఱితోను వెడలు చున్నది)

దుష్యం : (నాటి దూర్వాసుని తిట్టువలనఁబుట్టిన మఱపుచే, శకుంతలను గూర్చియే తలపోయు చున్నాఁడుఁ.)

– (తెఱచాటున)–

ఈ, యబ్బుర మేమి ఆఁ, ఆఁ, ఆఁ

దుష్యం : (విని) ఇది యేమై యుండును.

పురోహి: (వచ్చి అక్కజం పడుచు) అయ్యా వింత పొసఁగినది గదా.

దుష్యం : ఏమి వింతయేమి?

పురోహి : అయ్యా, కణ్వుల వారి యొద్ది నుండి వచ్చినవారు వెళ్ళిపోగానే

కII ఎలుగెత్తి కలికి వగc జే
తుల పై కెత్తిc దనకలిమి దూరుచునుండెన్

దుష్యం : పిమ్మట నేమి జరిగినది.

పురోహి: చెలి వెలుగొకటచ్చర తిరు
మల కేళా కూళికెత్తి మాయం బాయెన్ 30

(అందఱు వింత పడుచున్నారు.)

దుష్యం : 'కన్నుల యెదుటి దానిని కన్నములో ద్రోచి, యెలుక యెత్తుకొని పోయినదని' యేడ్చునట్టి చిన్న బిడ్డవలె, మిగిలిన దానికి వగచినc బనిమేమి?

పురోహి: ఏలిన వారికి సేమమవు గాక! (అని వెళ్ళెను.)

దుష్యం : వేత్రవతీ, ఓపిక లేక యున్నది. మది కుదిరియుండ లేదు. పడక టింటికి దారి తీయుము.

పణిహారి : ఈ లాగున దయచేయుండ. (అని నడచు చున్నది.)

దుష్యం : (తనలో)

కII హా పడతింబో నెట్టితి,
నా పెండ్లామైన దెఱుcగ నాడును నేడున్
గీ పెట్టి యేడ్చు నామది
యాపలు సోపలుగ నమ్మనాడుట పోలెన్ 31

(అని యందరు వెళ్ళిరి.)

శ్రీరస్తు

అభిజ్ఞానశాకుంతలము

అచ్చతెనుగు

అయిదాఱంకముల నడిమి ప్రవేశకము

(పిమ్మట ఆనగరు కొత్తవాలు బావమఱంది యు, ఇద్దఱు తలవరులును, పెడ ఱెక్కలు విఱిచి కట్టిన యొక మానిసిని గట్టిగాఁ బట్టుకొని వచ్చుచున్నారు.)

తలవరులు : (ఆ మానిసిని దెబ్బలు కొట్టి) ఏమిరా ముచ్చా! అచ్చరాలు చెక్కిన పచ్చల యుంగరము నీకెచ్చటిదిరా. చెప్పు, చెప్పు, చెప్పు.

మానిసి : (వెఱఁగు పడుచు) బాబో! బాబో! ఎప్పుడూ నేనట్టాంటి పని సేసి నోణ్ని కానయ్యో!

మొదటి తలవరి : ఓరీ, నీవు దొడ్డ బాపనయ్యగారవని దొరగారు నీకిది దార బోసినారాయేమి?

మానిసి : నా యిన్నపాలిన్నారా అండి. మఱగల్తే నేనుండి, అల్ల దేవరాయ కోనేటికాడ ఆల్రేవు దగ్గరండి, గుడిసేసుకొని కాపరాలుండె జాల రోణ్నండి బాబూ.

రెండవ తలవరి : ఓరీ దొంగ, నీవు, ఏ యింటి వాఁడవని మేమడిగినారమురా నిన్ను!

బావమఱిది : ఈ దొంగ ఏమి చెప్పునో చెప్పనిండు. నడుమ నడ్డు పెట్టవలదు.

తలవరులు : బుద్ధి, బుద్ధి.

బావమఱిది : ఓరీ చెప్పురా, చెప్పురా.

జాలరి : అయ్యా, పెద్దబాబుగారుండో దణ్నాలు బాబూ దణ్నాలు బాబూ.

వలలూ, మావులూ, వూతలూ, గాలాలూ మెట్టి, శాపల్నూ, జల్లల్నూ మట్టుకుని యిల్లు గడుపుకుంటా వుండానండి.

బావమఱిది : అలాగా, సరే చెప్పవేమి. నీ బ్రతుకు సుద్దమైన బ్రతుకు.

జాలరి : అయ్యగారండి. తమరట్లా మనవి శయ్యకండి. నే శలవిచ్చేది ఆలకించండి బాబో.

గీ. బమ్మ యేర్పాటు సేసిన పనులు పాట్లు
గోరమై యుండఁ జేయక తీరదయ్య
నల్లమేకను బిగబట్ట గొల్లు మనుచు
జాలి గుండెల సోమాసి చంప లేదొ? 1

బావమఱిది : ఆ పైన యేమో చెప్పు.

జాలరి : అయ్యగారూ, ఈ కత ఏందీ అని అడగతారా అండి. వగనాడండి ఏట్లో వలేశానండి. యఱ్ఱని శాపోటి బడ్డదండి, ఆ శాపను అమ్ముకోటం యేంది అలా అనుండి, ఆడోళ్ళతో దాన్ని దరిగి వండమన్నానండి. తరుగుతుండగానే బాబో దగదగ మెరిసిందండి, ఆళ్ళు జడిసి నాతో శప్పేరండి. మీముందామొయ్య యే ముండదేమీ నేనొత్తుండాను అని యెల్లి, ఆశాప పొట్టలో యేలెట్టి లాగి సూత్తుగందా, బాబో బాబో, ఈ వుంగరం అగుపడాదండి. తర్వాతనండి, మఱగల్తే యిది నాకెందుకు, యేం చేసుకుంటానని తోసిందండి. అందుకని అమ్ముకుందామని పేటలో బేరమాడుకుంటా వుండగా నన్ను మట్టుకుండారండి, నన్ను సంపితే సంపండి, యిడిస్తే యిడిసెయ్యండి. బాబో బాబో బాబో యింతకంటె యేమీ యెరగనుండి.

బావమఱిది : ఓరి జానుకా, వీని రూపు చూచినావా? వీని మేని కంపు సరిగా చేపల కంపేఁ. వీఁడు జాలరివాఁడే. కాని ఉంగరము వచ్చిన

వితమే పరికించ వలసి యున్నది. గనుక వీనిని దివాణానకే తీసికొని పోదము.

తలవరులు : బుద్ధి బుద్ధి – (అని చెప్పి జాలరిం జూచి) ఓరీ దొంగా నడవరా నడవరా.

(అందఱును నడచుచున్నారు)

బావమఱంది : సూచకా! వీనిని పెద్దగవిని మొగసాల యొద్దఁబెట్టుకొని కాచియుండుండు. నేనీకతయంతయు దివాణమువారికి విన్నవించి, వారి సెలవునకు గాచియుండి కొనివచ్చెదను.

తలవరులు : బాబూ పోయిరండి.

బావమఱిది : (వెళ్లెను)

మొదటితలవరి : ఓరీ జానుక ఏమి? కొత్తువాలు గారి బావమఱంది యింకను దివాణము నుంచి రాలేదే.

రెండవ తలవరి : పోవద్దా? రావద్దా? దొరలతో పని.

మొదటి తలవరి : ఓరీ జానుకా, వీనిని, జంపవలెనని నాజబ్బలు మిక్కిలి అదరిపడుచున్నవిరా.

(అని జాలరి తట్టు జూపుచున్నాఁడు)

రెండవ తలవరి : ఓరీ దొంగ, కూర్చుండ వోయి, నీ మెడను పూలదండ జుట్టుచున్నాము. (అని వానిని జూచుచున్నాఁడు)

మొదటి తలవరి : (నవ్వుచున్నాఁడు)

జాలరి : బాబూ ఏమి నేరం సేసానని సంపుతారు బాబూ. నాయంగాదు, బాబూ

రెండవ తలవరి : అదిగో కొత్వాలు బాబుగారి బావమఱంది గారు దివాణము వారి సెలవు పుచ్చుకొని వచ్చుచున్నారు. ఓరీ నీకండలు గద్దల

పొలవుచున్నవి. చూడరాయికను.

బావమఱఁది :(వచ్చి) సూచకా యిక జాలరివానిని విడిచివేయుండు. ఉంగరము వచ్చిన కతను గూర్చి వాఁడు చెప్పినది సరిగానే యున్నది.

మొదటి తలవరి :– అయ్యా బుద్ధి బుద్ధి, అట్టే చేసెదము.

రెండవ తలవరి :– ఓరీ వీఁడు జముని యొద్దికిఁబోయి తిటిఁగి వచ్చినాఁడురా (అని జాలరిని విడుచుచున్నాఁడు)

జాలరి : (కొత్తువాలు బావమఱిఁదికి మ్రొక్కి) బాబో! నా బ్రతుకందా మీసేతిలోనుండది.

బావమఱిఁది:– ఓరీ దివాణము వారు ఉంగరము తీసుకొని, దాని సరియైన వెలను నీకు బగుమతి చేసినారురా (అని జాలరి వానికి సొమ్ము ఇచ్చెను.)

జాలరి : (మ్రొక్కి సొమ్ము తీసుకొని) బాబూ బాబూ మీ అనిగ్గిరం వుండాల. దండాలుండి.

సూచకుఁడు : ఓరీ అనిగ్గిరం అంచున్నావు, కొఱత మీది వానిం దెచ్చి యేనుఁగు హోదాలో గూర్చుండఁ బెట్టుటరాయిది.

జానుకుఁడు : వీనికి సరియైన వెలయిచ్చుటఁ జూడఁగా దివాణము వారికి ఈ యుంగరము మీద మిక్కిలి మక్కువ యున్నట్లు తెలుపుచున్నది.

బావమఱిది : ఇదిగోనోయి, మన దివాణము వారికి ఈ యుంగరము మీద మిక్కిలి మక్కువ చేత ఇట్లు చేసినట్లు నేను తలచను. ఆ యుంగరమునుఁ జూడఁగానే ఎవ్వరో తలంపునకు వచ్చినారోయి. అంత నిబ్బరముగల దొరగారు గదా. రెండు గడియలు కంటఁ దడి పెట్టినారోయి.

సూచకుఁడు : బాబు గారికి దివాణాల దరిసెనాలు దొరికినవి గదా. అయ్యా!

జానకుఁడు : సరిగాని వీడాలిమగడు చేపలను సోపపెట్టు చెంబడి వీని యెదానఁ బోయుటకే యీసొమ్ము మూటగట్టి తెచ్చి ముందఱ బెట్టినారని చెప్పు. (అని జాలరి వంక గోరచూపు జూచుచున్నాఁడు)

జాలరి : బాబో పెద్దయ్యగారు, శిన్నయ్యగార్లండి, లంచంలేని మాట పుంజంలేని బట్ట వుండదండి. మీకూ వుండదండి, సగం నాకియ్యండి బాబులారా.

జానుకుఁడు : ఇది బాగుగానే యున్నది.

బావమఱఁది : ఓరీ పల్లెవాఁడా. మనకు నేస్తము గలసినది గదా, మన మెన్నటికి ఈ సావాసము వదల వద్దు. ఇదిగో యిది తొలునేస్తము గనుక బాస చేసుకొందమురా. కల్లుకుండ మీద చేతులు బెట్టుకొని చేసుకోవలె. కాబట్టి కల్లు దుకాణము వద్దకే పోదము రారా.

జాలరి : అట్లాగే బాబూ, అందు కబ్బేంతరాలుండాయా అండి.

(అని యందఱును వెళ్ళిరి.)

శ్రీరస్తు

అభిజ్ఞానశాకుంతలము

అచ్చతెనుగు

ఆఱవ యంకము

(అంత నింగి నుండి సానుమతి యను నచ్చర మచ్చెకంటి వచ్చుచున్నది.)

సానుమతి : నా వంతు చొప్పున పెద్దలు తానాలాడు వరకు ఈ యచ్చర కేళాకూళి దగ్గిరనుండఁదగిన పనిముగిసినది. ఇకను రాచ తపసి నడవడికలను గన్నులారా చూచెదను. మా మేనక చుట్టఱికాన శకుంతల కూడ మేనితో నీడైన చుట్టమైనది కదా. మా మేనక శకుంతలను దోడుకొని రమ్మని మున్ను నన్నుఁ బంపియే యున్నది. (చూచి) ఇదేమి? వింతగా నున్నది. ఈ ప్రోలిలో ననకాఱు పండుగ లేనే నట్టున్నది. అయినను మనకు దెలియదా యేమి? తలంపు చేసి చూచెదను. కానీ ఇప్పుడంత పనియేల. చెలికత్తెలు చెప్పినట్లు చేసెదగాక. ఈ తోట కాపుఁగత్తెలు చూడకుండ కనుమాయగారిడి మనకు దెలుసు గదా. ఈ గారిడిచే ఆ యిద్దఱికి గానరాకుండ ప్రక్కనే యుండి నడచుచు ఇక్కడ నడచు దాని నంతను జూచెదను. (అని నట్టువతో దిగుచున్నది.) (అంత మామిడిచెట్టు లేఁత చిగురాకుమీద చూపునిల్పి యొక చేడెయు దాని వెంబడి నింకొక్క చేడెయు వచ్చు చున్నారు.)

మొదటిది : క॥ ఆమెతయై కోయెలలకు
నామనికిన్ మనికి పోలి కై జలజలలై
యామికఁ దుమ్మెద ద్రొక్కిన
మామిడి విరి గుత్తిఁ సేసఁ బ్రాలుగ ఁనెంతున్ 2

రెండవది : చెలియా! పరభృతికా, యేమిటి నీలోనీవే మాటలాడు కొనుచున్నావు.

మొదటిది : మధుకరికా మామిడి మొగ్గనుఁ జూడఁగానే ఈ పరభృతికకు దాని యొడలది మఱచి పోయినది.

రెండవది : (చెలఁతేఁగి డాయఁబోయి) పువ్వుల కాఱు వచ్చినదా యేమి?

మొదటిది : ఓసీ మధుకరికా; ఊఁ, లెస్సగా మత్తెక్కి చిత్తడి పాటలు పాడు కొంచు తెత్తెయ్యని ఆడుకొంచు బిత్తరితనాలు చూపుకొనుట ఇత్తఱి నే కాదా)

రెండవది: ఓసీ నన్ను కొంచెము పట్టుకోవే, కాళ్ళెత్తి కొనవేళ్ళ నిలచి మామిడి చిగుళ్ళు కోసి వలరాయుని కొలువు చేసెదను.

మొదటిది : వలరాయని వేలుపులోఁ గలిగిన దానిలో సగము నాకిచ్చెదవా!

రెండవది : నేనీవలెనా, తనంతటదే వచ్చును. ఎందుచేత నందువా! మన యిద్దఱికి మేనులు వేఱుగాని యుసురులు వేఱుగావు. (అని మొదటిది పట్టుకొని యుండగా రెండవది మామిడి మొగడ తొడిమె దునుమగానే) ఓసీ ఈ మామిడి మొగ్గ యింకను విరియ లేదు గదా, చూడు, తొడిమ కోయఁగానే తావులుప్పతిల్లుచున్నవి.

(చేతులు రెండును జోడించి ముగియఁబట్టి)

క. విలుదాల్చి యున్న రతికో
మలి దొర కొసగితిని నిన్ను మామిడి మొగ్గా
అలిగిన జవ్వనులం గుఱి
లలినిడి చౌవంచ తూపులకు పై నిలుమా 3

(అని మామిడి విరిగుత్తుని విసరి వేయుచున్నది.)

కంచుకి : (తెర లేకయే వచ్చి) వద్దు ఏమి పని అది. ఒడలు తెలియదా!

ఇంత మత్తెక్కినదా. దివాణము వారు ననకారు పండుగ మానివేసి నారని నీ వెఱుఁగవా? ఎందుకా మామిడి మొగ్గ గోయుచున్నావు.

ఇద్దఱు : (వెఱచి) అయ్యా తెలియదు. తెలియదు. ఈ తప్పుకాయుఁడు.

కంచు : మీారు వినలేదా, చూడనైన లేదా, ఈ పూఁతకాఱులో పూయవలసిన చెట్లు పూయలేదు. చిగిర్చవలసిన చెట్లు చిగుఱ్చలేదు. పయిగా చెట్లమీాది పిట్టలు కూడ దివాణము వారి ఆనకుఁ గట్టుపడి యున్నవి.

చ॥ తడవున కుప్పతిల్లియునుఁ దాఁబొడ కట్టదు మావిమొగ్గ పు
ప్పొడి విఱియంగ, నెప్పటటు మొగ్గగ నుండె గొరంట, కుత్తుకం
గుడుగుడు కూఁత పుట్టె మగ కోయెలకున్ జలికాఱు పోటుయున్
జడిసి మరుండు నంపదొన సాము వెడల్చిన తూపు నాపునో. 4

సానుమతి : ఓహో! రాచతపసి యింత వాఁడగును సందియము లేదు.

మొదటిది : అయ్యా, దేవేరి గారి తోఁబుట్టువుగారు మిత్రావసు గారు మమ్మున రాచనగరు కొలువులో నుండగా, ఈ పూఁదోటకుఁ బంపినారు. కొన్నాళ్ళయినది, కాఁబట్టి ఈ నడమ నడచినది మాకేమియుఁ దెలియదు.

కంచు : కానీ, ఇఁకమీాదట మీరీపని చేసినయెడల నేరముచేసిన వారగుదురు.

ఇద్దఱు : అయ్యా! ఈలాగున కట్టు చేయుటకుఁ గతమేమో వినవేడుకవు చున్నది. మాకు చెప్పుటకు వీలేయని మీాకు తోచెనా సెలవిండు.

సానుమతి : పుడమి లోనుండు వారికందఱికి పండగలయందు మిక్కిలి వేడుక గదా. అట్లుండగా పండుగ మానుటకేదోయొక గొప్పకతము ఉండును.

కంచు : అయ్యో తెలియదా? ఇది జగమెల్ల యెఱిగినదే. చెప్పుటకు సందియ యేమి? శకుంతలమ్మను మన రారాజుగారు వెళ్ళఁగొట్టినదే మొదటి కతము.

ఇద్దఱు : పుడమితేనికి ఉంగరము చిక్కిన వరకు మనము మిత్రావసు గారి వలన వినియే యున్నాము.

కంచు : ఆలాగైన యెడల ఇకను చెప్పవలసినది కొంచెమే. తర్వాత ఆ పుడమిఱేఁడు ఆయుంగరము తమదేయనియు, తాము శకుంతలమ్మను పెండ్లాడినది నిజమే యనియు, ఏదో మాయ మఱుపుచేత అప్పుడు తెలిసికోలేక పోతిమనియు చెప్పుచు నాట నుండి మిగుల వగలం బొగులు చున్నారు. ఇది యెల్ల వారికిఁ దెల్లమే.

చ॥ సొగసుల నొల్లఁ,డేలుబడి జోలికనందు మునుం బలెన్ సతం
బుగఁబడి పాన్పుపైఁ బొరలు బుచ్చును రేలు మెళంకువన్ సరిన్
దగఁగని రాణివాసపు పడంతులకున్ మఱుమాట లిచ్చుచో
వగఁ బొరపాటు పేరు లిడి మ్రాన్పడి సిగ్గునఁ బ్రొద్దు పుచ్చెడిన్
5

సానుమతి : ఆహా! యెంత మేలు మాట వింటిని.

కంచు : ఇందువలన పుడమి ఱేనికి వేడుకల మీది బుద్ధి తిఱిఁగిపోయి పండుగ మాని వేసినారు.

ఇద్దఱు : ఆఁ ఆలాగా? సరి సరి!

(తెఱచాటున)

రండి యేలినవారు దయచేయండి.

కంచుకి : (చెవి యిచ్చివిని) ఓహో! యేలినవారిక్కడకప్పుడే విచ్చేయు చున్నారు. మీరు మీ పని మీద పొండు. పొండు.

ఇద్దఱు : ఆలాగే, ఆలాగే (అని వెళ్ళిరి).

విదూష : రండు సామీ రండు.

కంచు : ఆహా, ఎప్పటి రూపు అప్పటికిఁ బాగుగానే యుండును.

చ॥ పయి తొడ వేదియున్ గొనక బంగరు కద్యము నొక్కదానిడా
కయినిడి, యూర్పుచే నెఱుపు కట్టిన వాతెఱతోడఁ, గూర్కుపో
యి యెఱుఁగనట్టి కన్నులకు నెల్గుఁదనంబొదవంగ, సానబ
ట్టియు, రతనంబు నట్లలరె ఠీవినిఁ, బుట్టిన చాయ పోవునే.
6

సానుమతి : (దుష్యంతు వైపు చూపిడి) ఎంత తేలికఁగాఁ జూడఁబెడి వెళ్ళఁ గొట్టఁబడినను మా శకుంతల యీ రాచసింగమునకై తలపోయుచు నుసురు నిల్పుకొని యుండును. తగియే యున్నది.

దుష్యం : (మదిలోఁ బరికించి)

క. తొలు లేడికంటి నెచ్చెలి
దెలిపిన మేల్కొనని పాడు డెందము నేడే
మురి వెఱుఁగక తెలివొందెను
తలఁచి తలఁచి మిగులఁ బొగులు తగులుట కొఱకే. 7

సానుమతి : దెసమాలిన మాశకుంతల తలవ్రాఁతయు నిట్లుగానే యున్నది గదా. (అని చేయి చాటు చేసికొని)

విదూష : ఇస్సో! ఇస్సో! ఈయనకు శకుంతల పిచ్చి యెత్తినదే. ఎపుడు చూచినను శకుంతలా! శకుంతలా! ఏమిటిది ఈపిచ్చికి మందున్నదో లేదో కూడా నాకుఁ దెలియఁదు.

కంచు : (చేరువకు వచ్చి) జోహారు! జోహారు! ఈ యాటపూఁదోటలను చక్కఁగా బరికించినాడను. ఏలిన వారి కిచ్చ వచ్చినట్లు విచ్చల విడిగా తిఱుఁగ వచ్చును.

దుష్యం : ఓ వేత్రవతీ, తడవు నాళ్ళ మెళకువవలన మాకు రాచ గద్దియ నెక్కుటకు వీలులేక యున్నది. కాన రాచపనులన్నియు నీవే పొసఁగు బాటుచేసి లేకలంపుచుండవలెను. అని మంతిరితో నేను చెప్పినట్లు చెప్పు పో.

పణిహారి : బుద్ధి, బుద్ధి అట్లే చేసెదను. (అని వెళ్ళెను)

దుష్యం : ఓరీ వాతాయనా. నీ పనిమీద నీవు పో.

కంచు : సెలవు సెలవు. అట్లే చేసేదను. (అని వెళ్ళెను)

విదూష : ఇప్పుడీగెనయినను దగ్గర లేకుండ జేసితిని. ఇకను ఈ చల్లగాలికి మెల్లగా అల్లనల్లన ఎల్లచోటులఁ దిరుగాడుచు, ఈ యుబ్బుతీఱ్ఱుకొని నిబ్బరముగా నుండవచ్చును.

దుష్యం : (ఊర్చి) ఓ సంగాత కాఁడా, "చోటు గలిగినప్పుడే చేటు మూడు" నన్న సామిత నిజమే సుమా.

గీ. కొన్న తపసికన్నె చెలిమి గుంట బెట్టి
గంట వాయింపఁజేయు చీకటి తొలంగె
మరుఁడు మామిడి తూపునమర్చి వింట
వ్రాసినదె యిక నెచ్చెలీ వాని పోటు. 8

విదూష : కొంచెము సేపు తాళ్ళు. మరుడు, గిరుడు, తూపు, గీపు మక్కు మాత్చి వేయుచున్నాను. చూడు చీకటిలో చెటుకు మనిపించెదను. ఇదిగో దుడ్డుకఱ్ఱ. అయిదు తూపులతో దండి గలిగి నిండుగా మెుండితనముగల దుండగపు మామిడి చిగురు పని ఏమవుచున్నదో. ఇదిగో (అని హుమ్మంచు తన చేతి కఱ్ఱతో మామిడి చిగురును రాలఁగొట్టఁబోవుచున్నాఁడు)

దుష్యం : (చిఱునవ్వు నవ్వి) ఇకచాలు. చాలునయ్యా. ఊరకుండుడు. మీరేలాగో బాపనయ్యలు. అదను గుదిరిన విఱువక మానరు.

విదూష : ఏమిటి విఱచునది – బూరెలా.

దుష్యం : అవును గాని కొంచెము ఎక్కడ కూర్చుండి ఆ ముద్దుల గుమ్మను పోలిన తీగెలను ఆసతోఁ జూచు చుందును.

విదూష : ఇంతలోనే మఱపువచ్చినదో ఇదివరకు మీదగ్గిర నుండు

నూడిగపుగత్తె చతురికతో బండిగురివింద పొదలో బ్రొద్దు బుచ్చఁ దలంచినాను. నేను, శకుంతలను వ్రాసి యుంచిన చిత్తరువు పలకను తీసికొనిరా అని మీరు చెప్పియుండలేదా.

దుష్యం : డెందమును సంతోసపెట్టుకొను చోటు అదే. దారిచూపుము

విదూష : ఈలాగున రండు. (అని యిద్దరును నడచు చున్నారు.)

సానుమతి : (వారి వెంబడించి పోవుచున్నది.)

విదూష : ఈ లాగున రండు. ఈ మానికపు రాతి పలకను జుట్టుకొని పూవులు, చివుళ్ళు మొదలైన వానిచే మీకూడిగములు చేసెదనని బండి గురివింద యీరము ఎదురు చూచుచున్నది.

(అని యిద్దరును బోయి కూర్చున్నారు)

సానుమతి : ఈ తీగెల మఱుఁగున గూర్చుండి చిత్తరువునుఁ జూచు చుండెదను. తర్వాత ఇచ్చట ఈ పుడమితేని పలుతెఱంగులను పోలికలు చూచి నీ మగని కతలిట్టివని యాశకుంతలకుఁ జెప్పెదను.

దుష్యం : చెలికాఁడా, ఇత్తరి నత్తవిరుబోఁడితో పొత్తుఁజేసినప్పటి మొదటి చెల్లాటలెల్ల నుల్లమునకు మరల్చితిని. నీవును వినియుంటివి కదా. నేనా లతకూనను నీవు నాదానవు కావు. పొమ్మనినప్పుడు నీవు లేవైతివి. అంతకుఁ గొంత ముందెప్పుడును ఆయొప్పులకుప్ప పేరైనఁ జెప్పవైతివి, ఇది యేమి? నా దెయ్యమే నిన్ను గూడఁ బట్టినదా యేమి?

విదూష : ఆ మఱచిపోవుటలు తెఱచిపోవుటలు మీవికాని మావి కావు. మీరు నన్ను వీటికిం బంపినప్పుడు 'నవుటాలు సుమీ' అని చెప్పలేదా? ఆ మాట మంటియుండవంటి నామదిలో నతుకుకొని పోయినది. ఇంతకును "కానున్నది కాకపోదు గదరా సుమతీ" అన్నట్లు, ఎట్లు జరుగవలసిది అట్లు జరుగును.

సానుమతి : ఆలాగే అవును.

దుష్యం : (డెందమున బాగుఁగాఁ బరికించి) చెలికాఁడా, ఇప్పుడు నీ పాలఁ బడితిని. నీవు కాపాడవలెను.

విదూష : సరే యిది బాగుగనే యున్నది. మీరీలాగున సెలవీవచ్చునా. మీ వంటి గొప్పవారు ఇట్లు గుండె నిబ్బరము విడువరు. ఓరు గాలి యెంత వైచినను కొండలు కదలునా.

దుష్యం : చెలికాఁడా! ఏమియు లేదు. నా బంగారు బొమ్మను కాని మాటలచేత నీసడించి తోలినాను. దాని దెసమానిన తనము ఇప్పుడు తలంచుకొనిన గుండెలదరిపోవుచున్నవి. నేనెవ్వఁటి ప్రాపునఁజేరెదను. ఎందుచేత ననగా,

చ॥ మనమిట లేచి పొమ్మనిన మాటకు, దాదనవారిఁగూడిపో
వను సమకట్ట తండ్రి బడి వాఁడ తనంతటి వాఁడు వల్దటుం
డన మరలం గనుల్తొళుకు లాడెడి నీటను ముంచె, నక్కటా,
కన నది కూళనైన నను గాల్చు విసంబిడినట్టి ముల్కిగాన్. 9

సానుమతి : ఈతఁడు దిగులు పడుట నాకు సంతోసముఁగా నున్నది. ఎవ్వరును తమ మేలే చూచుకొందురు గదా.

విదూష : ఇదిగో నయ్యో, నేననుకుంచున్నాను గదా, ఆ చిన్న దానిని మింట నడచు వారెవ్వరో యెత్తుకొని పోయినారయ్యా. ఇట్లని నాకు దోచుచున్నది.

దుష్యం : మంచిది. అయిన మగనాలిని గొంపోవుటకు తెంపు జేయు వారెవ్వరు. ఇది మేనక కూతురని కదా మనము వింటిమి. దాని పంపు చేత దాని చెలికత్తెలలో నెవ్వరో అయి యుందురు.

సానుమతి : తెలియక పోయిన యెడల అచ్చెరు పడుదురు గాని తెలుసుకొంటిమి అనరాదు.

విదూష : తల్లిదంఁడ్రులెక్కడనైన మిగుల వగలం గుందుకూతుఱు నింటి దగ్గిర బెట్టుకొని యుందురా. మీ ఱొట్టె నేతఁబడనే పడ్డది.

దుష్యం : చెలికాఁడా

గీ. కలయొ, గారిడియో, మది కళవళమ్మొ,
పున్నెముల లెక్కలో నిల్వ సున్నబడెనొ,
మఱలి రాకుండ జవరాలు మాయ మాయె,
కోరికలు పాఱు వరదలై మేర మీఱి. 10

విదూ : ఆలాగున కాదు. నీయుంగరము నీచేయి జిక్కుటయే ముందు మేలును దెలుపు చున్నది. నీవేమియు వగవ వద్దు. మీ కిద్దఱకిఁ తిఱిగి యున్నది.

దుష్యం : (ఉంగరమును జూచుకొని) ఇది యెవ్వరికిని జెందనలవి కానిచోటునకెక్కి జారిపోయి యింత దిగులు పడదగినదై యున్నది.

క. నా పున్నె మెంత కొదవో
నీ పున్నెము నంతె నిజము నెరవై కెంపుల్
చూపట్టు గోళ్ళ వ్రేళ్ళన్
దాపడియుం జారితివిగ దా యుంగరమా. 11

సానుమతి : ఇది మఱియొకఱిచేఁ జిక్కిన యెడల నిజముగానే యేడువవలసి యుండును.

విదూష : నెచ్చెలీ నేను తెలిసియో తెలియకయో అడుగు చున్నాను. నీ పేరు చెక్కిన రాచముద్దరగదా. ఈ యుంగరమును, నీకామె మీద నెంత తమకమున్నంగాని యాడుదాని వ్రేలినెందుకు బెట్టితివయ్యా.

సానుమతి : ఈమాట వినవలయునని నాడెందము గొట్టుకొనుచున్నది.

దుష్యం : అప్పుడు మనవీటికి రాదలంచిన ఆ చక్కని చుక్క నన్నుఁ జూచి యెన్నాళ్ళకు మిమ్ము గన్నుల జూతునని యడిగెను. అడిగి కన్నుల నీరు విడిచెను.

విదూష : తర్వాత యేమి జరిగినది.

దుష్యం : అప్పుడే ముద్దుటుంగరమును ముద్దియ, ముద్దు వ్రేలం బెట్టి యీలాగున జెప్పినాను.

ఉ॥ మేలిమి బొమ్మ, యుంగరము మీదను వ్రాసిన యక్కరాలనా
వ్రాలును నొక్కనాడొకటి వాసిని లెక్కను బెట్టుకొమ్ము యె
న్నాలకు నన్నియున్ ముగియు నాటికి మా నగరింట జేర్పఁగా
జాలిన వాని నొక్క నిహజారపు లెంకను నీకుఁ బంపెదన్. 12

సానుమతి : పెట్టిన గడువు బాగుగానే యున్నది గాని పట్టిన దెయ్యము దిట్టమైనది.

విదూష : అదియెట్లు చెంబడివాని చేపలోనికి వచ్చినదో.

దుష్యం : దేవరాయని కొలని దాపున, ఆత్రేవు కడ, ఆ బంగారుబొమ్మ వ్రేలినుండి జారిపడినదట.

విదూష : ఏమీ! అంతయు కతగా నున్నది బాగు.

సానుమతి : కాఁబట్టి దోసానకు వెఱచెడి యీ రాచతపసికి అంత వంతల పాలైన మా శకుంతలను తాఁగలసినదియు, లేనిదియు తెలియక పోయినది. సరేకాని, వీరి కూరిమికానవాలేల కావలసి వచ్చినదో తెలియదాయెనె.

దుష్యం : ఇప్పుడీ యుంగరమునుఁ బట్టుకొని తిట్టుదునా.

విదూష : (తనలో) దొరగారికి వెట్టి క్రింద బడినది. (బిగ్గఱఁగా) ఇప్పుడీ కఱ్ఱను నేను దిట్టెదను.

దుష్యం : కఱ్ఱనెందుకుఁ దిట్టవలె.

విదూష : ఉంగరము నెందుకూ –

దుష్యం : క॥ ముద్దియ చక్కని చేతుల
ముద్దుల వ్రేళ్ళల విడిచి మునిగితి నీటన్

మొద్దిది యెఱుగునె దొరికిన
నద్దద్దా యనుచు తూలనాడితినేనే. 13

విదూష : (తనలో) ఏమి యీ వగపు ఆకలికే ఆకలి యైనది. నన్ను మ్రింగి వేయునట్లున్నదే.

దుష్యం : ముద్దియా, నిన్నూఱక వదలి వేసితిని గదా. నిన్నుం దలచు కొనుచు నేనిట్టి వెతల పాలైతిని. మఱల నిన్నుం జూచునంత పున్నెము నాకుఁ గలిగించెదవా?

చతురిక: (చిత్తరువు పలకనుఁజేత పట్టుకొని తెరలేక వచ్చి) ఇదిగో పటమున వ్రాసియున్న పట్టపురాణి.

విదూష : నెచ్చెలీ, బాగు బాగు. అన్ని వన్నెలు, చిన్నెలు, కులుకులు తళుకులు, బెళుకులు, వగలు, వద్దికలు సరిగానే యున్నవి కాని, యెత్తు పల్లాల దగ్గిర నా చూపు తిన్నగా ఆనుటలేదుఁ.

సానుమతి : ఆహహా! చిత్తరువు వ్రాతపనిలో ఈ పుడమిఱేని కెంత చేయి దిఱిగినది. నాకూర్మి నెచ్చెలి నా యొద్దనే యున్నట్లున్నది.

దుష్యం :

క. చక్కఁదనము తక్కువయినఁ
జిక్కింతురు పటములోనఁ జేనేర్పు వడిన్
జక్కంగా నటులైనను
ఇక్కన్నియ సొగసు వ్రాఁత నించుకఁ జేరెన్.... 14

సానుమతి : ఇప్పుడు నా నెచ్చెలి నెడబాసి యున్నందునను ఈ రాచతపసికి గరువమనుమాట లేనందునను సుమా, ఇట్లు తలపోయుచున్నాఁడు. ఇది సరిగానున్నది.

విదూ : నెచ్చెలీ! ఎవరయ్యా వీరు. వీరి గరువంపుఁదన మేమీా. మింటి చుక్కల వలె మిడిసిపడు చున్నారు. ముగ్గురున్నారయ్యా. ముగ్గురును సొగసుల వగలాడులే. వీరిలో మీా సయ్యాటల యొయ్యారి యెవరయ్యా.

సానుమతి : అయ్యో! బాపనయ్యా, ఇంతేనా, శకుంతల రూపిదియని తెలిసికొన లేకున్నాడే. ఈయన కన్నులు నెమలి కన్నులే.

దుష్యం : బాగుగనేయున్నది. ఇందులో నెవ్వరని యిప్పుడు నన్నడుగుచున్నావా?

విదూష : ఆఁ తెలిసియున్నది. అయినను ఏమో కదా. ఎటు బోయి యెటు వచ్చునో యని, అడిగిన యెడల మంచిది అని అడిగితిని. ఇదిగో ఈ కీల్గంటు వీడిపోయి పెన్నెరులు పెందొడల క్రిందికి జారబడినవే, పూవులు రాలుచున్నవే, మొగమున చెమ్మటలు గ్రమ్మినవే, బుజాలు మెత్తబడి సాగినవే. ఇదిగో నీళ్ళు బోసి యలసి యున్నది. క్రొత్తగా జిగిర్చిన గున్నమామిడిక్రింద నిలచి యున్నది. ఈ చిన్నదే శకుంతల యని నేననుకొనుచున్నాను. తక్కిన యిద్దఱును చెలికత్తెలను కొనుచున్నాను.

దుష్యం : నీవు నెరజాణవు. సందియములేదు. ఈ చిలుకలకొలికికి నా యందు గలిగిన తమకముచే బుట్టిన చిన్నియ కూడ ఇందున్నది చూచినావా.

ఆ.వె. చెమరు వ్రేళ్ళు సోఁకి చిత్తరు గీతల
ప్రక్కలందుఁగానఁ బడియె మాపు
మించి తోచు, పొటకరించిన రంగుగా
గంటి నీరు చెక్కు కవను బడియె. 15

ఈ యాటపట్టును సగమే వ్రాసితిని గనుక నీవు బోయి చిత్తరు దాను కొనిరమ్ము.

చతురిక: అయ్యా, మాదవీయగారూ, ఈ పలకనుఁ గొంచెమిటు పట్టుకొనుఁడు. నేను చిత్తరుదానుం గొనివచ్చెదను.

దుష్యం : నేనే పట్టుకొందులే పో. (అని యట్లు చేసెను)

చతురిక : (వెళ్ళెను.)

దుష్యం : క॥ నిక్కపు చక్కెర బొమ్మే
దక్కిన మునుఁబాయఁద్రోచి తగుననుచుఁ బటం
బెక్కినది చూతు నీటిం
జక్కవిడిచి యెండమావు చవిఁబడితి చెలీ. 16

విదూష : (తనలో) నిక్కముగా నీతఁడు నీళ్ళు విడిచి యెండుమావులను జేరిన వాడే. (బిగ్గరగా) అయ్యా! ఇంకను ఇందులో వ్రాయవలసి యున్నదా?

సానుమతి : నా చెలికత్తెయగు కులుకులాడి తళుకులు బెళుకులు ఇంకను వ్రాయఁబోవుచున్నాఁడు కాఁబోలును.

దుష్యం : ఇటు విను.

ఉ॥ దీటగునంచ జోళ్ళిసుక తిన్నెలు మావిని చుట్టు జింకలుం
గూటువ గట్టు మంచుమల గుట్టలఁ జక్కని చెట్లు కొమ్మలం
బాటిగ వ్రేలు నారవలువల్గల మ్రాఁకుల నీడ జింకరా
పోటరి కొమ్ముతో దురద బోవఁగ దాపటి కన్ను గోకికో
మీటెడి నాడు లేఁడి మురిపెంబును వ్రాయఁదలంచెదన్ చెలీ. 17

విదూష : (తనలో) అట్లయిన యెడల నేలకు జీరాడుచున్న చింపిఱి గడ్డంబులతో జుట్టలు చుట్టుకొని యున్న జడలతో జడదారు లందఱితో నీపలక నింపవలెనా యేమి. ఇంకొక్కటి మఱచి పోయినాను. వారి దాపున త్రోలు తిత్తులతో తపసి ముసలమ్మలనుఁ గూడ వ్రాసిన బాగుగా నుండును.

దుష్యం : మేము తలంచియున్న రంగైన సింగార మొక్కటి శకుంతలకు వ్రాయ మఱచితిమి.

విదూష : అది యేమిటి సామీ!

సానుమతి : అడవిలో గాపురమున్న వారికి, అనువైనట్టియు, మా చక్కని చుక్క చక్కదనమునకుఁ దగినట్టియు, ఏదో యొక్కటి మఱచి పోయినట్టు చెప్పుచున్నాఁడు సుమా.

దుష్యం : చెలికాఁడా!

ఉ॥ వ్రాయనె లేదుగా తొడిమ పట్టును వీనుల జెక్కుటద్దపుం
దోయిని వ్రేలు జూలుకల తోరపు దిర్సెన పూవు గుబ్బలం
గీయనె లేదు తెల్లుపువు గేరెడి కాఱునఁ జందమామక్రొం
జాయల సోగ వెన్నెలల సాలుపు తామర తూఁడు త్రాడునున్ 18

విదూష : నెచ్చెలీ! ఇదేమి చెంగలువల వంటి రంగులు దేఱియున్న కెంగేల మొగము చాటు చేసుకొని బెదరి బెదరి చూచు చున్నదదేమి? ఎందుచేతను? (బాగుగాఁ బరికించి) ఛీ, ఛీ ఇదేమి? ఈ తొత్తుకొడుకు, విరితేనెల దొంగ గండుతుమ్మెదగాడు ఈ ముద్దులమూమొగము మీదికి ఎగిఱిగంతులు వేయుచున్నాఁడు.

దుష్యం : ఈ గండు తుమ్మెద కీచేటేమి? తోలు తోలు.

విదూష : కొంటెలను గెంట నేర్పుగల నెఱదంటవు నీవే గెంటి వేయ వయ్యా.

దుష్యం : మంచిది పూఁదీగెల వారియింట పొట్ట నిండించు కొనుటకు విందులు గుడుచు గండు తుమ్మెద రాయఁడా! ఇంకను ఇక్కడఁ బడి మొత్తుకొనుచున్నావేమి?

గీ. ననల మీదనుఁ గూర్చుండి నాలు కెండి
యున్నదైనను నీపెంటి నిన్ను మిగుల
దవిలికన్నెట్టి యున్నదిద్దానిఁ జూడు
మదిని నుందిగ నాడియానదుగ తేనె. 19

సానుమతి : ఇప్పుడు గదా దీని పొగరడఁగినది.

విదూష : నీవు నిలువ గొట్టగానే సరియా, ఈ కొంటె మూకకు బుద్దెక్కడిది?

దుష్యం : ఈ తీరున నెంతఁ జెప్పినను నా మాట సరుకు సేయక యున్నావు? ఇటు విను.

శా॥ ఏరా తుమ్మెద కూటముల్కులుకనే నేజాలితో గ్రోలితిన్
గారాబంబున చిన్నమొల్క చివురుంగానెంచి నేదాచుకొ
న్నారా, యీరతనాల మోవి నిటులంటన్ వచ్చెదే కట్టెదన్
బోరా సంకిలి వైచి తామరనునుం బూసాలలోఁ దట్టునన్ 20

విదూ : ఇదిగో నా చేతిలో దుడ్డు గఱ్ఱ యున్నది. ఈ దుడ్డు గఱ్ఱతో ఒక్కటి బెట్టితినా, దాని పని కుయిక్కు మనదటయ్యా. (తనలో నవ్వు కొని) ఇది వరకు ఈయన గారికి వెఱ్ఱి యెత్తినది గదా. ఇప్పుడు నాకు దానిపైదియెత్తినది, పిచ్చి. ఆరునెలలు సావాసము చేసిన వారు వీరవుదురు ఏమి. ఆఁ ఇది చిత్తరు పటమా.

దుష్యం : ఓహో, ఇది చిత్తరువా. మఱచిపోతిని.

సాను : ఏమో కాని నాకేయిది శకుంతలగాఁ దోచుచున్నది కాని చిత్తరువుగాఁ దోచుట లేదు. ఈ వ్రాతలో నెట్లు వ్రాయఁబడినదియో అట్లే తలంచుకొనుచున్న ఈ పుడమి రేని ననవలసిన దేమున్నది.

దుష్యం : ఏమి చెలికాఁడా, 'ఎప్పుడు జూచిన తప్పులే పట్టరా త్రిప్పల మారీ' యన్నట్టు ఈచదువెక్కడ నేర్చు కొంటివయ్యా నీవు. ఏదో ఒక తప్పు బట్టి నన్ను త్రిప్పల బెట్టుచున్నావు.

క. పొఱ లేక కలసిన మదిన్
దెఱవంగని హాయి హాయిఁ దేలెడి నాకే
యెఱుకం దెచ్చితివీ మా
ఱ్ఱుఱలం బూబోఁడి పటము వ్రాతాయె గదా. 21

(అని కంటఁదడి పెట్టు చున్నాడు.)

సానుమతి : ఆఁ, ఏమియిది. వింతైన విరాళిగా నున్నది. శకుంతల యెదుట నిల్చి యేడ్చినపుడు కాసింతయైన కనికరము లేక, కాదు పొమ్మన్న వారికి ఎంత జాలి పుట్టినది. ఆహా!

దుష్యం : కడుపులో నిలువక పొరలి పొరలి వచ్చుచున్న ఈ వగపును నిలుపలేను.

క. మేలుకొని యుంటి కలసి సు
గాలం దేలంగ జాలఁ గలలో నైనన్
దేలఁగ నిండిన యాక
న్నీళులఁ జిత్తరువు నైన నేరం జూడన్ 22

సానుమతి : నీవు మున్ను వెడల గొట్టితివన్న వగపును, దూరును మా శకుంతలకు లేకుండ జేసినావు పో.

చతురిక : (వచ్చి) జోహరు. దేవరవారు చెప్పిన చొప్పునఁ బోయి నేను చిత్తరు దానును తెచ్చుచుండఁగా.

దుష్యం : ఏమి జరిగినది.

చతురిక : నడు త్రోవలో తరలికతో వసుమతమ్మగారు నా కడ్డు పడి నేనే తీసుకొని పోయి యిచ్చెదను, నీవు తీసుకొని పోవలదు అని నా చేతిలోని చిత్తరుదాను బలిమి చేసిలాగు కొని వెళ్ళినారు.

విదూ : నీతల వ్రాత మంచిది. నిన్ను తిరిగి మాయొద్దికి వచ్చునట్లు బంపినారు.

చతురిక : రాణిగారి పైటకొంగు గొజ్జంగి చెట్టు కొమ్మనుఁబట్టినది. తరళిక దానిని వదలించు చుండఁగా సందుఁ జేసుకొని బ్రతికి వచ్చినాను.

దుష్యం : చెలికాఁడా! అదిగో రాణిగారు వచ్చుచున్నదట, చూచితివా? ఆమెకు ఏమి గరువము, ఏమి గొప్పతనము ఎరుగుదు గదా. నీవీ బొమ్మను దగ్గిర నుంచుకొని యుండు. పదిలము సుమా.

విదూష : (చిత్తరు పలక తీసుకొని లేచి) అయ్యో నన్నని చెప్పరేమి! సరే కాని మీరు రాణీ వాసము చేరిన తర్వాత అచ్చుటి దెబ్బలాటలలో గెల్చి బయిటికి రాఁగల్గిన యెడల, నేను మన మొయిలారు మేడమెట్లమీద నుండెదగాని, నన్నొక్క కేక వేయుఁడు. వెంటనే

నడుము గట్టుకొని బయలు దేరి వచ్చుచున్నాను. (అని బడబడ పరుగెత్తు చున్నాఁడు)

సాను : ఉల్లము మఱియొక తట్టు తిరిగినదిగాని తిఱిగిన నేమి, మన చెలి మీద నిల్పిన గారవమును విడిచి యుండువాఁడు కాఁడు. ఆ చెలిమి యీఱక విడువఁబడునది కాదు.

పణిహారి : (కాగిదము చేతఁ బుచ్చుకొని వచ్చు చున్నది.) జోహారు, జోహారు.

దుష్యం : వేత్రవతీ, నీకు దారిలో రాణిగా రెదురు పడిరా.

పణిహారి : కనబడినది కాని నన్నును నా చేతిలోని కాగిదమునుఁ జూచి దొరసానిగారు ఊరకయే వెళ్ళిపోయినారు.

దుష్యం : దాని కన్నియును తెలియును. రాచరికముల కడ్డు రానీయదు.

పణిహారి : ఈనాడు పంటకాపులు సిస్తు దస్తు కట్టుచున్నందునను వానిం బరికించుట, లెక్క పెట్టుట చేతను, ఒక ప్రోలి కాపు మనవి మట్టుకు వినుటయు, తీరుమానించుటయు జరిగినది. అవి లేకలో వ్రాయఁబడినదని సెలవిచ్చి, ఈ కాగితమును మంతిరి గారిచ్చినారు.

దుష్యం : ఏదీ కాగితము చూపు.

పణిహారి : (చూపుచున్నది.)

దుష్యం : (చదువుకొని) ఓహో! యిదేమి యీలాగున వ్రాసినాడు మంతిరి. "పేటలో నున్న యోడబేరి మిత్రావసు అనువాఁడు తన యొక్క యోడ మునిగిపోయినందున దిగులు పడి చనిపోయినాడు, ఆయోడ బేరి సొమ్ము కలవాడైనందున అతని సొమ్ము కొన్ని వేలు వరాలును, కొంత నేలయును అయియున్నది. అది దివాణము వారికి చేరవలసినదికా తీరుమానించినాను." అయ్యో ఆ సెట్టికి బిడ్డలు లేరు కాఁబోలును. బిడ్డలు లేని గొడ్డు తనము కంటె గడ్డయిన దేదియు లేదు గదా. వేత్రవతీ ఈ బేరికింబెండ్లామయినా లేదా.

ఈతఁడు సొమ్ము కలవాఁడే. ఇద్దఱు ముగ్గురుండవలయును. వీరిలో నెవ్వరైన చూలాండ్రై యుందురేమో కొంచెము తెలిసికొనియెదవా?

పణిహారి : ఈ బేరి యిల్లాలైన సాకేతాబాయి యను నామెకు మొన్న మొన్ననే గాజులు దొడిగించినారు, అయ్యా.

దుష్యం : ఓహో అలాగుననా, అట్లయినయెడల తండ్రి సొత్తు కడుపులోని బిడ్డకే చెందవలసినది కాని, దివాణమునకు చేరదు. ఇది మంతిరికిఁజెప్పు.

పణిహారి : ఏలిన వారి సెలవు (అని వెళ్ళబోయెను).

దుష్యం : వేత్రవతీ యిటురా.

పణిహారి : అయ్యా సెలవు.

దుష్యం : బిడ్డలున్నారు, లేరను పరికింపు లేదు.

గీ. ఎవఁడెవండంటుఁ గలియు బంధువుడుపాసి
చను బజకు వాఁడువాడును మునుపు గన్న
మేన వడిగట్టు కొన్నదో సానగాక
నెలమి దుష్యంతుఁడనుచుఁ జాటింపుడింక. 23

పణిహారి : అయ్యగారూ ఇటు చాటింపుఁ జేయ వలసినదే కదా? (అని వెళ్ళి తిరిగి వచ్చి) తటిలోఁ గురిసిన వానవలె మీ చాటింపు విని వీటి వారందఱును మిక్కిలి సంతోసపడినారు.

దుష్యం : (ఊర్చి) ఆహా. బిడ్డలు లేని వారికి యెంత కలిగి యున్న నేమి, ఆ బొంది కాసంత అట్టిట్టుగాగానే ఉన్నది. కాసంత యొరులపాలు కావలసినదే. నాకు పిమ్మట పురువంగడము పేరిమియు, తఱిదప్పిన వెనుక విత్తులు చల్లిన నేల పోలిక యగును.

పణిహారి : అంత మాట యేల సెలవిచ్చెదరు. అట్లు పొసఁగకుండ నుండుగాక.

దుష్యం : ఇస్సిరో, ఎందుకీ బ్రతుకు. కన్నుల యెదుటికి వచ్చిన కఱుకుల సంచిని కాళ్ళతోఁ జిమ్మి వేసిన వాఁడను.

సానుమతి : నిక్కము నిక్కము, మన శకుంతలను దలంచుకొని తన్నుదాను తిట్టు కొను చున్నాఁడు.

దుష్యం : గీ॥ నన్నుఁ దనలోన నిడికొని యున్నదైన
వంగడము నిల్పుపున్నెంపు వన్నెలాడి
విడిచితిని గార్తెఁ బరికించి విత్తినట్టి
పుడమిఁ బండిన పిమ్మట విడిచినట్లు. 24

సానుమతి : ఇక నీ కోవ తామర తంపర యగు గాక.

చతురిక : (మెల్లఁగా) అయ్యో, బేరివాని కత వినగానే దొరవారి యుల్లము తల్లడిల్లినది. వీరి నిత్తఱి నూరడించుట కెవ్వరునుఁ గానంబడరు. మొయిలారు మేడ మీద మాదవియ గారున్నారు. పోయి వారిని దీసుకొని వచ్చెదవా వేత్రవతీ.

పణిహారి : (వల్లె యని వెళ్ళెను)

దుష్యం : చీ, ఈ దుష్యంతుని పెతరులు దిగులు బెట్టుకొని యున్నారు కదా. ఎందుచేత ననగా.

ఉ॥ ఎవ్వఁడు వీనికిం బిదప నీతని కోవను మాకుఁ దప్పనా
లివ్వఁ గలండటంచు దురటిల్లుచు, బిడ్డలు లేని నేనుబల్
నెవ్వగఁ గన్నులం దొఱఁగు నీళ్లడుగం మిగులైన నీళులన్
రువ్వినఁ ద్రావు చుండ్ర పెతరుల్ నిజమింతయు నక్కటక్కటా! 25

(అని వగచి వగచి మేను మఱచి పూల పానుపునకొఱఁగు చున్నాఁడు)

చతురిక : (తొందరపడి) సామీ యేమియిది. ఓర్చుకొనుండు. ఓర్చు కొనుండు.

సానుమతి : అయ్యో! చేతి ప్రక్కను దివిటి యుండగా చీకటియని తడవులాడు చున్నాడు గదా ఈ పుడమిరేఁడు. నేనిప్పుడే యితని సంతోష

పెట్టెద. ఆ! గెపితికి వచ్చినది. "జన్నాల చవులకు చంకలు గొట్టుకొను తెఱగంట్ల రాయబారము చేతనే నీ మగండైన రారాజును నిన్నుం గూర్పించెదను." అని వేల్పులతల్లి శకుంతల నూఱడించు చుండఁగా నేవినియుంటిగదా. కావున నింతలో నిచ్చట జరిగినదంతయు శకుంతలకుం జెప్పి యూఱాఱ్చు చుండెను.

(అని నింగి కెగసి పోవుచున్నది)

(తెరచాటున) కుయ్యో మొఱ్ఱో శరణు. నన్నుఁ జంపగూడదు, చంపకూడదు.

దుష్యం : (చెవియిచ్చి విని) ఏమిటిది! మాదవియకేదో బాద గలిగినట్లున్నది, కేకలు వేయుచున్నాఁడే. ఎవరక్కడ, ఎవరక్కడ.

పణిహారి : (వచ్చి) ఎవ్వరో గొంతుఁబట్టుకొనుటచేతఁ జెలికాని కేదో బాద గలిగినది. అయ్యో, కాపాడవలెను.

దుష్యం : ఎవ్వడురా ఆ పిల్లవానినిఁ గొంతు పట్టుకొని బాద పెట్టు చున్నాఁడు.

పణిహారి : అయ్యగారూ! ఏదో గాలి పట్టుకొన్నది. కాకున్నఁ గన్నులకుఁ గనపడదా? మాదవియనుఁ దీసుకొనిపోయి, మన మొయిలారు మేడ తుదను బెట్టినదయ్యా.

దుష్యం : (లేచి) ఆలాగున నుండునా! మనమేడ మీదికేమి! దెయ్యమేమి!

క. తన పూట పూట పొఱపడి
యొనఱుచుఁ దప్పులనె యెఱుఁగ నోపండొక్కం
డునుఁ బజలం దెవ్వండెటు
చనునోయది యెల్ల దెలియఁ జాలెడి నొక్కో 26

విదూష : (తెరలో) ఓ చెలికాఁడో, ఓ చెలికాఁడో, చచ్చితి చచ్చితి.

దుష్యం : (ఇటు నటు నడచి) చెలికాఁడా వెఱవకు వెఱరకు.

విదూష : (తెఱచాటున) ఓ చెలికాఁడో, ఓ చెలికాఁడోఁ చచ్చితి, చచ్చితి.

ఎట్లు వెఱవక యుండగలను. ఎవ్వఁడో మెడ వెనుకకు వంచి చెఱుకు గడను విఱుఁగ దీసినట్టు విఱుఁగ దీయు చున్నాఁడు.

దుష్యం : (చూపు నిగుడించి) విల్లేది. విల్లేది.

అంపసాని : (సింగాణి చేతం బట్టుకొని నిలిచియున్నది) ఇదిగో అయ్యగారు. అత్తెపుతుండుతోఁ గూడను విల్లు.

దుష్యం : (విల్లమ్ములు పుచ్చుకొనుచున్నాఁడు)

(తెఱలో)

గీ. క్రొత్త కుత్తుక నెత్తురు గోరు చుండె
నిదిగొ, బెబ్బులి పసరంబు నెట్టులట్లు
పొరలఁబడవైతు, బీదలఁ బ్రోవ విల్లు
సాచు దుష్యంతుఁడే నీకు శరణు నేడు. 27

దుష్యం : (రోసముతో) ఏమీ! నా పైనే కాలు ద్రువ్వు చున్నాఁడే వీడు! ఓరీ!మూల మూలల బింకాలు గొట్టు ముచ్చురాకాసీ! ఉండు, ఉండు, ఇప్పుడే నీ రూపుమాపు చున్నాఁడను (అని సింగాణి నెక్కు బెట్టి) వేత్రవతీ మెట్ల దారి చూపుము.

పణిహారి : ఇటు దయచేయుండయ్యా. (అందఱును బిరబిర నటు పోవుచున్నారు.)

దుష్యం : (నాల్గువైపులకు దిఱిగి చూచి) ఇక్కడ నేమియు లేదే

(తెరచాటున)

కుయ్యో! మొఱ్ఱో! చచ్చితి. ఇదిగో నేను నిన్నుఁజూచు చున్నాను, నీవు నన్నుఁ జూచుట లేదు. ఇక్కడ, పిల్లికిఁ జెల్లాటము ఎలుకకుఁ జావుగా నేనున్నాఁడను. ఇక నా బ్రతుకుకాస పోయినది.

దుష్యం : ఓరీ తెలసినదిలే! కనుమాయ గారిడి యున్నదా నీ యొద్ద. నా తూపు నిన్నుఁ జూడఁ గలదులే. ఇదిగో, అమ్ము గూఱ్చుచున్నాను. కాచుకో.

క. పరిమార్చఁ దగిన నిన్నున్
బరిమార్చుం బ్రోవఁ దగిన బాపనిఁ బ్రోచున్
గఱుకమ్ము; పాలు గైకొని
పొరసిన నీర్విడుచునంచ పోలిక నిదిగో 28

(అని యమ్ము గూర్చు చున్నాఁడు)

(అంత విదూషకుని విడిచిపెట్టి మాతలి వచ్చుచున్నాఁడు)

మాతలి : గీ॥ కేల గుఱి యిచ్చె మబ్బుగుఱ్ఱాలవాఁడు
రక్కసుల మీద నీ విల్లు నెక్కు బెట్టు
సాదు లెప్పుడు చెలులపై చల్ల నైన
చూపు లిడుదురు మొఱకైన తూపు విడరు 29

దుష్యం : (విల్లెక్కుడించి) ఓహోహో మాతలీ, ఓ వేగంటి సాహణి, బాగుగనున్నావా?

విదూ : (వచ్చి) ఏమిటిది, మా చక్కఁగనే యున్నది. నన్ను జన్నములలో నల్ల మేకల నూపిఱి బిగియఁబట్టినట్టు పట్టిన యాతనినిఁ జూచి, 'బాగుగా నున్నావా?' అని అడుగుచున్నాఁడయ్యా! అయిన వాండ్ర కాకులోను, కాని వాండ్రకుఁ గంచములోను.

మాతలి : (చిఱునగవుతో) అయ్యా, మీ వద్దకి నన్ను వేగంటి దొర పంపిన వితము దెలుపు చున్నాఁడను.

దుష్యం : వినుటకు గనిపెట్టుకొని యున్నాడను.

మాతలి : కాలనేమిగాడను రక్కసినిఁగూర్చి మీరు వినియే యుందురు గదా, వాని కోవలోని కొందఱు రక్కసులు మందలు మందలై పెచ్చు పెఱిఁగి యున్నారు. అది పెద్ద గుంపు.

దుష్యం : అవును, కలదు, ఇంతకు ముందే ఆ జగడాలదిండి తపసి వాండ్రనుఁ గూర్చి చెప్పి వెళ్ళినాఁడు.

మాతలి : గీ॥ నూఱు జన్నాల వాఁడు నీకూరిమీఁడు
దానిఁ గెలు వంగలేడు నిన్దలఁచినాఁడు
సూఁడుఁగా; నేడు గుఱ్ఱాలవాఁడు కాఁడు
సొఱఁగ రేయిరులది తమ్మిసూఁడుఁ బోలె 30

కాఁబట్టి మీరు విల్లునమ్ములనుఁ దాల్చి వేళంబ యరదంబెక్కి గెలుపు గైకోలు సేయుటకు వెడలుము.

దుష్యం : సరే, వేలుపులదొర నన్నింత మన్నన జేయుట కంటె నెక్కువ నాకు మఱొక్కటి లేదు. కాని మా మాదవియను మీరు తిప్పలు పెట్టుటకు గతం బేమి?

మాతలి : అదియును విన్నవించెద, ఏమి కతముననో నాకుఁ దెలియదు. మీరు ఓపిక లేక యేదో తలపోయు చుండుట నేను చూచినాను. తమకు అలుక గలుఁగు లాగున ఏదో ఒకపని చేసినఁగాని మీరా వంతను ఆవంతను మానరని, ఈ పనిఁ జేసితిని. ఇంత కంటె మఱి యొకటి లేదు.

గీ. కట్టెఁ గదలింప భుగ భుగల్ కట్టు నగ్గి
అడుఁగు బడఁదాచు బుస బుసఁ బడగ విచ్చు
తరుచుగా మనము చూచునంతటను దనదు
తోక జాడించు నెవడేని తాకుదగిలి. 31

దుష్యం : ఇట్లు మీరు చేయుట సరియే. (గుస గుస) చెలికాఁడా, మెడలు నొప్పులా. రాతిరి సున్నము పట్టు వేయించెద. నక్కల నోట గడ్డపడి నదిలే. (బిగ్గరగా) వేగంటి యానతి తప్పరాదు. నేను చెప్పినట్లు మంతిరితో నిట్లు చెప్పుము.

క. నా విల్లిది వేఱొక పని
పై వైచుక దాని మీద బారెడి నింకన్
బ్రోవగల నొక్క వితమున
నేవచ్చెడి దనుక బజలనీ తెలివి మెయిన్ 32

విదూష : సెలవు చొప్పున జేయు చున్నాఁడను.

మాతలి : అయ్యగారు తేరెక్క వచ్చును.

దుష్యం : మంచిది (అని తేరెక్కుటం జూపు చున్నాఁడు)

– అదఱు వెళ్ళిపోయిరి. –

శ్రీరస్తు

అభిజ్ఞానశాకుంతలము

అచ్చతెనుగు

ఏడవ యంకము

(అంతట నాకసమునం దేరెక్కి దుష్యంతుఁడును, మాతలియు వచ్చుచున్నారు.)

దుష్యం : వేగంటి యానతిచ్చిన చొప్పునఁ బనులు నెఱవేఱ్పఁ బడినవి. తెరగంటి రేఁడు నా కొనర్చిన మన్ననలకును, మరియాదలకును, దగని వాడనని గట్టిగా నేను చెప్పఁ గలను సుమా.

మాతలి : (చిఱునవ్వు నవ్వి) అయ్యా, మీరిద్దఱునుఁ దనివి లేని వారే.

గీ. నీవు చేసిన మేలు కొంచె మనియెదవు
బత్తి జేజేల ఱేనిపైఁ బట్టి, నీకు
నెట్టి మరియాద లొప్పునో యేమొయనును
నీదు మగఁటిమి కాతండు నివ్వెఱపడి. 1

దుష్యం : ఓ మాతలీ ఆలాగనరాదు, వేలుపుల రాయఁడు నన్ను వీడు కొల్పినప్పుడు నాకుఁ జేసిన మన్నన మరియాదలిట్టివని యుగ్గడింప నలవికాదు. తన గద్దియ మీఁద సగము విడిచి నన్నుం గూర్చుండఁ బెట్టుకొని తక్కిన సగము మీఁదఁ దానుఁ గూర్చున్నాఁడు. పలువుఱు జేజేలు బలసి కొలువ నాకట్టి మరియాద జరిగించినారు. అది యుంగాక.

క. ఉవ్విళ్ళూఱుచుఁ జేరువ
నివ్వటిలు జయంతుఁ గనియు నీదొర నాకున్
నవ్వియిడెను మందారపుఁ
బువ్వు సరము ఱొమ్ము గంద పూఁతల తోడన్ 2

మాతలి : అయ్యా, మీరేమరియాదకుఁదగరు?

గీ. వినుము మాఱేఁడు వన్నెల విసినె గఱ్ఱ
వేలుపుల చక్కి సోకు దయ్యాల తాఁకు
నణచి ఱిఱ్ఱువరు, నీవిప్డు కణుపు మణచి
యమ్ములను, మున్ను నరసింగ డరిది గోళ్ళ. 3

దుష్యం : ఈ పట్ల మట్టుకు, ఆ నూఱుజన్నాల సోమాసియే కొని యాడఁ దగిన వాఁడు.

ఉ॥ రాయల మంచి మన్ననలు గ్రోలినచో నెఱవేఱు చుండుఁగా
దే యెటువంటి గొప్ప పనులేనియు, జక్కటిదిద్దఁగా దొడల్
నోయని వేల్పు చేతనగునో యిరు లాఱ్పుఁగనెన్నఁడేనియున్
వేయి వెలుంగు లాఁడు తన వెన్కనుఁ బట్టుగ నుండకుండినన్. 4

మాతలి : ఇది సరిగానే యున్నది కదా. (మఱియొక కొంచెము దవ్వఱిగి) అయ్యా ఈ వైపుగాఁజూడుము. నీ పేరు ఆకసము మీదఁ జెక్కఁ బడినట్లున్నది.

ఉ॥ వేలుపు ముద్దియ ల్పిసరు వెచ్చము చేసి మిగిల్చి యక్కరా
టాలను నిల్పి యున్ననును డాల్దినుసుల్ కయి కొంచు నిందు జే
జేలు తలంచుచుం బుఱుకు చెట్ల చివుళ్ళను పాట కొప్పఁగా
వ్రాలొనరింత్రు నీవు దయివార నొనర్చిన కర్జపుంగతల్. 5

దుష్యం : మాతలీ! నిన్నను మనమీదారినిఁబోయినప్పుడు ఆ రక్కసుల నెప్పుడు చెక్కి చెండ్లాడుదునాయను నక్కస్సుతో బోవుట వలన నేదియు దిన్నగాఁ జూడనైతిని. మన మిప్పుడు ఆవహము, ప్రవహము, ఉద్వహము, సంవహము, వివహము, పరివహము, పరావహము, అను నీ యేడు గాలి తెరవులలో నేతెరవుననున్నామో చెప్పుము.

మాతలి : ఓ రారాజా! ఇటు వినుము.

ఉ॥ నింగి మెలంగు గంగనుఁ బనింగొని మ్రోయుచు నేడ్వెలుంగులన్
రంగులు బంచి దేనికది నాఁగమలంచుచు గుజ్జులచ్చి తే
డుంగులికించు రెండవ యడుంగు దొసంగులు వాప మేటి చా
యంగను నియ్యదే పరినహంబను గాలితెఱం గనంబడున్. 6

దుష్యం : ఔ, కాఁబట్టియే సుమా. బయిలను లోపలనుఁగూడ నాకు మిక్కిలి తేటయగు తెలివి పుట్టుచున్నది. (అరదవు కన్నులను జూచి) మనము మబ్బులు దిఱుగు పట్టు పట్టి నట్లున్నాము.

మాతలి : మీకెట్లు తెలియ వచ్చినది సామీ!

దుష్యం : ఉ॥ ఆకుల సందులన్వెడలి యాడెడి వానపులుంగు పిండులున్
సోకి మెఱుంగు దీవియల సొంపుల గాంచుచుఁ బోవు గుఱ్ఱముల్
తాకిన చిన్కులందదుపు దట్టిన యీ యరదంబు చూచినన్
గేకలు పెట్టెడిన్ మనము నీళ్ళ మొయిళ్ళకు మీదఁబోవుటన్. 7

మాతలి : ఇంకొక నిమిషము ఓపికపెట్టిన యెడల దొరవారి మాగాణము లోనికేవచ్చి చేరుదుము.

దుష్యం : (క్రిందఁజూచి) మాతలీ! మిక్కిలి బిరబిర వచ్చుట చేత ఈ పుడమి నాకు వింతఁగా జూపట్టినది సుమా.

తరువోజ :
కడునిక్కు కొండ సిగలమీద నుండి
పడినట్లు తోచు నిప్పుడమి క్రిందికిని
వడినాకులనుఁ జిక్కుపడినట్టులుండి
వెడదకుదుళ్ళఁ గన్పడు మ్రాక్రు లెల్ల
సడలి నీళ్ళుల సన్నబడియున్న యేళ్ళు
కడలేని తొల్లింటి బెడఁగులే తాల్చె
కడఁగి యెవ్వండొ యొక్కఁడు నేలనెల్లఁ
దొడి నాకడకుఁదెచ్చి యిడినట్టు లుండె 8

మాతలి : తమరు సరిగాఁ దెలుసుకున్నారు. (గారవముతోఁ జూచి) ఆహా! పుడమి యెంత సొగసుగా నున్నది.

దుష్యం : మాతలీ, ఇదియేమో చెప్పుము, తూరుపు పడమర సంద్రములకంటి యున్నది; సంజకెంజాయలారిన కోటవలె బంగారు నిగ్గులుదేఱుచు కొండ యొకటి గన్పడు చున్నదే.

మాతలి : అయ్యా, యిది హేమకూటమను పేరుగల కొండ. తపసుల నోముల పంట లిక్కడనే, ఇది మానిసితలలు, గుఱ్ఱపు మొండెములు గల వేలుపుతెగవారి కాటపట్టు.

గీ. బమ్మదేవర కొడుకైన యమ్మరీచి
ముద్దు బిడ్డండు వేల్పుల మూకలకును
సోకు మూకలకునుఁ దండ్రి సువ్వె, పజల
రాయఁడీ పున్నెములపల్లె రాణిగూడి
జడలడర ముక్కు మూఁతలు నడపుచుండు. 9

దుష్యం : ఆలాగైన యెడల మంచిచోటులు పట్టినప్పుడు ఆచోటున నిలువక దాటిపోరాదు. మనము ఆ పెద్దలం గొలిచి పోవలెనని నా కోరిక యున్నది.

మాతలి : మీ తలంపు గొప్ప తలంపు. (అని దిగుటనుఁ జూపుచున్నాఁడు)

దుష్యం : (అచ్చెరు పడి) మాతలీ.

క. తిఱిఁగెడి కన్నుల సడివిడె
పఱుఁగులిడెడి దుమ్ము కానబడదిది నేలం
బొరయక నిలుపంబడి నీ
యరదము డిగ్గియును డిగ్గ నట్లే తోచున్ 10

మాతలి : అయ్యా, దేవరవారికంటె వేయిజన్నాల వేలుపునకు గల యెక్కువ యింత మట్టునకే కదా.

దుష్యం : మాతలీ! మారీచులవారి తపసిపల్లె యేది?

మాతలి : (చేతితో ఁ జూపి).

చిత్ర వృత్తము :

తన మేని సగము పుట్టనెయుండ
ఔమ్మునను బెనసి కుబుసము జుట్టగా
పెనివెట్టి ముదితీగెలను
జుట్టుకొని గట్ట గను కుత్తుకనుఁ బట్టగా
కొనజంపు జడచుట్టలను దట్టముగ
గూడులనుఁ బిట్టలునుఁ గట్టఁగా
తనరారె నీపట్టు ననుఁదపసిని
బ్రొద్దు మొగమునఁగంబ మెనలెట్టగా. 11

దుష్యం : ఇంతగోరముగా తపసి నడవడికలోఁ గడదేరిన ముదితపసీ, నీకు మ్రొక్కు చున్నాఁడను.

మాతల్లి : (పగ్గములు బిగియలాగి) రారాజా, ఇదిగో, చూచితివా. వేలుపుల తల్లిచేఁ బెంపఁబడిన మందారపు చెట్లుగల బమ్మపాళెము, ఇదే వచ్చి చేరినాము.

దుష్యం : ఏమి! ఆహా! వేలుపుల ప్రోలిలోని హాయి కంటే ఇక్కడ నెక్కువ హాయిగా నున్నది.

మాతలి : జేజేల బువ్వ పాలేటిలో మునిఁగి నట్లున్నదే.

మాతలి : (అదరము నిల్పి) అయ్యా దిగ వచ్చును.

దుష్యం : (దిగి) మాతలీ మీరిప్పుడేచోటం దిగెదరు.

మాతలి : అరదము నిల్పినాము. నేను దిగుచున్నాఁడను. (అనిదిగి) అయ్యా ఈ వైపుగా రండు (నడచి), పెద్దలుండు చోటులు చూచెదరు గాని రండు.

దుష్యం : ఎంత వింతగా నున్నదిచ్చోట!

చ ॥ పుడుకుల మ్రాకుఁదోటగుడు పుల్కరు వళ్ళుగఁ, బైఁడితమ్మి పు
ప్పొడి పసపాటు నీళులను బున్నెపు జల్కము, మానికాల రా

ళ్ళదరినచోఁ దలంపులును నచ్చర రచ్చల డెందమందు సం
దడుడుపఁగల్గి, లాఁతిజడదారుల కింపగు చోట నిన్నక
చ్చడములు గట్టి వీరు మదిఁజంపి యొనఱ్తుఱు ముక్కు మూఁతలన్
12

మాతలి : గొప్పతపసులు కోరు కోరికలు మిక్కిలి గొప్ప కోరికలు జుండీ. (అని నడచి నింగిఁజూచి) ఓ పెద్ద శాకల్యులవారూ, మారీచులవారేమి పనిమీద నున్నారు. చెప్పుటకు మిక్కిలి వేడుచున్నాను. ఇల్లాలు పెనిమిటిపట్లనెట్లుగా నడచు కొనవలెనో దానిని అదితమ్మగారు అడుగఁగా తపసి యిల్లాండ్రతోఁ గూఱ్చుండి యున్న ఆమె గారికి ఆ నడవళ్ళు వక్కాణించుచున్నారనియా చెప్పుచున్నారు.

దుష్యం : (చెవి యిచ్చి) ఆలాగయిన యెడల వారి పనులు తీరువఱకు మన మిచ్చట నుండవలసినదేనా యేమిటి?

మాతలి : (పుడమిఱేనిఁ జూచి) ఈ యశోకపు చెట్టు నీడను మీరు దయచేయుండు. మీరు వచ్చినట్లు పెద్దలకుఁ దెలియఁ జేయుటకు నేనుఁ బోయి కాచి యుండెదను.

దుష్యం : మీ యిచ్చవచ్చినట్లు చేయుండు.

(అని నిలుచుండి యున్నాఁడు.)

మాతలి : అయ్యా నేను బోయి వచ్చెదను.

దుష్యం : (సగిన మైనట్టు చూచుకొని)

క. అడియాస లుడిగి యుంటిన్
గుడిబుజమా యదరెదవు పనుల్ కల్లసుమీ
కడుమేలును వద్దని మును
పడఁగొట్టుక యున్నఁ జేటు పాటుగ మాఱున్. 13

(తెఱచాటున)

కొంటెతనము చేయఁబోకు. నీపుట్టుకతోఁబుట్టిన బుద్ధులు పోవునా? యేమి?

దుష్యం : (చెవి యిచ్చి) ఈ చోటు దుండగముల చోటు కాదే. ఎవ్వఁడు వీఁడు నలుగుఱిచే మాటలు పడుచున్నాఁడు. (ఆ చప్పుడు వచ్చినవైపుచూచి నవ్వి) అవురా ఇదో, ఇఱువురు తపసి యిల్లాండ్రతోనున్న యీ పసిపాపడెవ్వఁడై యుండును. పసిపాపల కింత సత్తువయుఁ తెంపునుఁ గలుగుట వింతగా నున్నది.

క. ఒక సగము తల్లిపాల్మ
చ్చిక మీఱఁగఁగుడిచి యున్న సింగపు పిల్లన్
మొకము జడ బిగియఁ బట్టుకఁ
తకథై యని బలిమి బల్లిదంబుగ లాగున్ 14

(అటు తర్వాత ముందుఁజెప్పిన నడవడిగల చిన్నవాఁడును, ఇద్దఱు తపసి యిల్లాండ్రును వచ్చుచున్నారు).

చిన్నబిడ్డ : ఓసీ సింగపు కూనా, నోరు దెఱువు, ఆవలించు నీ పండ్లెన్నో లెక్కలు బెట్టుచున్నాను. ఊఁ! ఆవలించు. ఆవలించెదవా? లేదా?

మొదటియామె : ఓరి ఆకతాయా! ఓరి ఆకతాయా! మనయింటి బిడ్డలవలెఁ బెఱుఁగుచున్న జీవాలను, అయ్యో ఏమిషిరా, యిది. ఇంత బాద పెట్టుచున్నావు? అవురా, ఏమి సంబరాలురా? ఏమి దుండగాలురా? నీకుఁ బెట్టిన పేరుకు దగినట్లే చేయుచున్నావు. ఇందు చేతనే నీకు తపసులందరు మెకాల గండడని గండపెండేరము దొడిగినారు.

దుష్యం : ఏమో కాని కడుపునఁ బుట్టిన బిడ్డని యందుఁబుట్టు తమకము నాకు వీనియందు గలుఁగుచున్నదే. బిడ్డలు లేకపోవుటనుఁ బట్టి కాఁబోలును.

రెండవయామె : ఇదిగోనురా దుండగీడా, ఈ సింగపు కూనను విడవవుషరా,

చూడు! దీని తల్లి నీమీదికి ఎగిరి పడుచున్నది షుమా. నామాట వినుషుమా.

చిన్నబిడ్డ : అబ్బో! త్రూవే! అన్నారట. ఎక్కడనైనా దాగుకొందునా యేమి? దట్టమైన పొదైన లేదు గదా. (అని పెదవిని విఱుచు చున్నాడు).

దుష్యం :

క. కనులకు నాకీబిడ్డడు
కనపడెడిం గొప్పతేజు కలవారికిఁ బు
ట్టిన వాఁడుఁగఁ గడు వెలుఁగం
గను మిణుఁగురుఁ దనమునందు గలయగ్గి బలెన్ 15

మొదటియామె : నాయనా, నాయనా, ఈ సింగపు కూనను విడిచి పెట్టరా, నీకాడుకొనను మఱియొక దానినిచ్చెదలే.

చిన్నబిడ్డ : ఏదీ! తీసికొనిరా చూపు, మఱి, తే. (అని చేయి సాచుచున్నాఁడు).

దుష్యం : (చూచి యచ్చెరు పడి) ఈతనిచేతిలో నాలుగుసంద్రముల నడిమి నేలనంతను ఏలగల రేకలున్నవే. ఆఁనిజమే నిజమే.

గీ. మక్కువయినది కొన బతిమాలి సాచి
సళ్ళనీయకఁ బట్టిన వ్రేళ్ళు గలిగి
కై కనంబడెఁ దెలవారుగట్ల నెఱుపు
దగిలి పూచిన క్రొత్త నెత్తమ్మిఁబోలె. 16

రెండవయామె : ఏమే సువ్రతా! వీనిని యుత్తమాటలతో మాన్పించగలము షే; పోయి మన పాకలో మార్కండిగాని కొఱకుఁ, జేయించిన మట్టి నెమలి యున్నది గాని, వేగిరమే తీసుకొనిరా.

మొదటియామె :ఆలాగాలే (అని వెళ్ళెను)

చిన్నబిడ్డ : నేను ఈ సింగపు కూనను విడవనూ! దీనితోనే ఆడుకొందునూ! (అని ఆమెనుఁజూచి నవ్వు చున్నాఁడు)

దుష్యం : ఈ కొంటెసొంటికాయ మీద నాకు మక్కువ బుట్టుచున్నది గదా.

చ॥ పకపక నూఱకే నగిన పల్మొగడల్ కనవచ్చి యొప్పఁగా
తికమక వచ్చి రాని బడిదేరని పల్కులు ముద్దు గుల్కఁగా
చకచక లాడుచుం దొడల చక్కని వేడుకలిచ్చు చుండఁగా
వికవిక మేని దుమ్ములయ బిడ్డల నెత్తిన మేలు చాలుగా 17

తాపసమ్మ : వీఁడు నిన్ను లెక్కజేయునా? నా మాట వినునా యేమిషి? (అని చుట్టుప్రక్కలఁ దపసిపిల్లలెవ్వరైన వచ్చుచున్నారేమో యని చూచి) ఎవ్వఁడురా అబ్బాయీ (అని చేఱువం గానవచ్చిన పుడమిఱేని జూచి) నాయనా! మంచి వాఁడవుగాఁ గనబడచున్నావు కొంచెము ఇటు వచ్చెదవా? ఇదిగో ఈ చిన్నబిడ్డ యెంత సెప్పిన వినక ఈ సింగపు పిల్లను విడవకఁ బట్టుకొని యున్నాఁడు, కొంచెము విడిపించు నాయనా.

దుష్యం : (నవ్వుచు దగ్గిరఁబోయి) ఓయి గొప్ప తపసి యింటి బిడ్డా!

గీ. ఇట్టులను దపసి పట్టున కెఱవు బెట్టి
బెట్ట నీ పుట్టు పున్నెంపు పట్టు జెఱచు
చెట్ట యగుఁ బిల్ల నల్లతా చట్టె పుట్టి
గట్టి వలపుల గందపు చెట్టు నట్టు. 18

తాపసమ్మ : నాయనా ప్రొద్దునలేచి నామొగము చూచినఁజాలు, వీఁడు తపసుల బిడ్డకాఁడు షుమా, నాయన.

దుష్యం : వీని రూపు రేకలే చెప్పుచున్నవి. ఈపిల్లవాఁడు ఈ పల్లెలో నుండుట చేత మేమట్టు తలంచితిమి (మెల్లిగా బతిమాలినట్లు చేరి, చిన్న వానినిఁ బట్టుకొనుచున్నాఁడు.)

ఆ.వె. ఎవని యింటను మొలకెత్తెనో యీబిడ్డ
యిట్టె తాఁకి మిన్నుముట్టఁ గంటి
వీని మేను తనదు మేన నుండియ కన్న
పున్నెకాని సుగము నెన్నఁదరమె. 19

తాపసమ్మ : (ఇద్దఱినింజూచి) ఏమి యీ వింత!

దుష్యం : ఏమి, తాపసమ్మగారు ఆలాగున అంచున్నారు?

తాపసమ్మ : నాయనా, మఱేమియు లేదు. అచ్చున గ్రుద్దినట్లు మీ యిద్దఱి రూపులు ఒక్కటిఁగా నుండుటనుఁ చూచినాను నాయనా. నీ వెన్నడును చనవు చేసుకొన్న వాఁడవు కావు గదా. మఱి మాటాడక మారము చేయక నీ చేతిలోకి యిట్టే వచ్చినాడే. ఇది చూచిన నా కబ్బురమైనది.

దుష్యం : (ఆ చిన్న బిడ్డని ముద్దుజేయుచు) అమ్మా తాపసమ్మగారూ. ఈ చిన్నవాఁడు తపసి బిడ్డఁడు కాఁడని చెప్పితివి గదా! వీని పుట్టుక వితమేమి?

తాపసమ్మ : పురువంగడము నాయనా.

దుష్యం : (తనలో) ఇతఁడును నేనును ఒక వంగసములోని వాండ్రమేమో. ఇది యేలాగో ఏమో? ఈ యమ్మగారు వీఁడు నన్నుఁ బోలిన వాఁడే యని చెప్పుచున్నది. వంగడమొకటి కాబఁట్టియేయని తోఁచు చున్నది. మా పెద్దలు కొంత కాలమునకు అడవుల పట్టుటయు కలదు.

గీ. పాల గచ్చుల మేలిహ వేలులందు
నేల నేలుచు మున్నాడిగాలమన్న
వారి కాదట మ్రాఁకుల వేఱిపట్లు
ఎప్పుడొక్కటికే కూఱ్చు నిళ్ళు సుమ్ము 20

(అందఱికిఁ దెలియునట్లు) ఈ చోఁటులకు మానిసులు నడచి వచ్చెదరా?

తాపసమ్మ : రారు, అవును నిజమే కాని ఒక యచ్చరలేమ చుట్టరికము వలన ఈ బిడ్డని తల్లి యిచ్చట నీతనిఁ గన్నది. ఇది వేల్పులతండ్రి కశ్యపుదుండు కాన.

దుష్యం : (తనలో) ఇది నాయడియాసలకు నొక పుట్టుక అహహా! (వినఁ బడునట్లు) సరిగాని ఈ చిన్నవాని తల్లి యేపేరు కలవాని యిల్లాలు.

తాపసమ్మ : పున్నెంపు గేస్తురాలిని కన్నులఁ జూడక కడగండ్లఁబెట్టినవాని పేరు ఎవ్వఱు తలంచు చున్నారు. వారి పేరు మేము నోట బట్టి వక్కాణింపరాదు.

దుష్యం : (తనలో) ఓహో! యిదేమో నాకే తగిలి వచ్చు చున్నదే. ఈ బిడ్డని తల్లి పేరడుగుదునా. (తలపోసి) బఱుల యిల్లాండ్రను గూర్చి యడగఁగూడదు గదా.

రెండవ తాపసమ్మ : (మంటి నెమలిని గొని వచ్చి చూపి) ఓరీ మెకాల గండడా, పులుగులలో మిక్కిలిగా గన్నులఁగన్న దానింజూచితివా?

బిడ్డడు : ఎక్కడ మాయమ్మ? మాయమ్మను కోడిగాలాడుచున్నావా?

ఇద్దరు : (ఇద్దఱును నవ్వి) – ఇదిగో చూచినావుషమ్మా, వీని కడుపు కంద పిలకఁగాను, పులుగులలో మిక్కిలిగాఁ గన్నులఁ గన్నదాని నన్నావు కాదుషే. పిట్టలచేతఁ బెతంపఁబడినదిగా వీనితల్లి. అది అనుకున్నాఁడు షుమా.

రెండవయామె : అబ్బాయీ నేనన్నది అదికాదు. పులుగులలో చాలకన్నులు గలది నెమలి గనుక దానిం జూచితివాయని యడిగినాను.

దుష్యం : (తనలో) ఇదేమి! వింతఁగా నున్నదే! పులుగులలోఁ బెఱిఁగినది శకుంతలయే కదా. అందుచేతనే కదా శకుంతల యని పేరు వచ్చినది. ఇట్టివారెందరుండరు. నాయడియాస లెండమావులనుఁ జూచి నీళ్ళనుకొనుటయేమో.

బిడ్డడు : ముసలమ్మో బాగుగా నున్నది. ఊఁ–ఊఁ–ఊఁ– నాకీవూ – ఈవూ (అని నెమలినిఁగై కొనుచున్నాఁడు)

మొదటియామె : (వేగిరపడచు) కుఱ్ఱవాని మణికట్టున తాయెత్తుండ వలెనే. ఏదీ లేదే, నేనేమి చేయుదు.

దుష్యం : తొందరపడకు అమ్మా! బిడ్డడు సింగపు గూనను లాగినప్పుడు అది జారిపడినది. (అని తీయఁబోవు చున్నాఁడు).

ఇద్దఱు : నాయనా యెత్తవద్దు, ఎత్తవద్దు, అయ్యో యెత్తినాడేఁ (అని యచ్చెరిపడి చూచుచున్నారు.)

దుష్యం : నన్నెందుకు ఎత్తవద్దంటిరి?

మొదటియామె : ఓ రారాజా. ఇటు వినుము. పత్రామి, ముత్రామి, యని రెండు మందు చెట్లున్నవి. ఆవేళ్ళుపెట్టి యీతాయెత్తు ఈ బిడ్డడు పుట్టినప్పుడు మాపెద్దలు కశ్యపులవారు వీనిమణికట్టున గట్టినారు. ఈ తాయెత్తు ఈ బిడ్డను గన్నవారికిని, కశ్యపుల వారికినిఁ దక్క మఱి యొకఱికి ముట్టనలవి కాదు.

దుష్యం : ముట్టెదరనుకొండి. ఏమి కలుగును.

మొదటియామె : తాచుబామై వెంటనే కఱచును.

దుష్యం : ఎప్పుడైన నెవ్వరైన ముట్టిచూచిరా?

ఇద్దఱు : ఒకసారి కాదు నాయనా యెన్నో సారులు తార్కాణము అయినది.

దుష్యం : ఇక నేమి, నా కోరిక లీడేరినవే, (అని యుబ్బి చెలఱేఁగుచు, బిడ్డనుఁగౌఁగిటఁ జేర్చెను)

రెండవయామె : సువ్రతమ్మా, ఇష్టారా, ఇక్కడ నడచినదంతయు నేమముతో నున్న మన శకుంతలకు జెప్పి వత్తము. రాపోదము. (అని వెళ్ళిరి).

బిడ్డడు : నన్ను విడువుమయ్యా, విడు. నేను అమ్మ దగ్గిరకుఁబోవలెను.

దుష్యం : కొడుకా, నీవును నేనునుఁగూడ కలిసి మీయమ్మ దగ్గిరకుఁబోదము తొందర ఏమి?

బిడ్డడు : నన్ను కొడుకా యంచున్నావు, నీ వెవ్వఱు. మా తండ్రి దుష్యంత సక్కర వరితి.

దుష్యం : (చిఱునవ్వు నవ్వి) వీని మాటలే చాలియున్నవి గదా నానమ్మకమునకు.

(అప్పుడు ఒకే జడగానల్లుకొనిన తలకట్టుతో మాసిన ముతక నార బట్టతో శకుంతల వచ్చుచున్నది).

శకుంతల : (తనలో) ఈ తాయెత్తును ఒరులు ముట్టిన యెడల పాము కావలసినది. కాలేదు. అయినను నేనుఁబొందిన యిబ్బందులను బట్టి నాకు ఆసలు లేనేలేవు. కాని ఆ సానుమతి చెప్పినట్లు జరుగునేమో.

దుష్యం : (శకుంతలనుఁజూచి) అహహా. ఇదిగో, యెల్లఱచే గొనియాడదగిన గొప్పతనమును, మంచి తనమును గల యొప్పులకుప్ప శకుంతల.

క. మాసిన పుట్టము గట్టెను
చేసిన నేమమున మొగము చిక్కెనొకజడన్
వేసెను గనికరము దొఱఁగి
పాసితినని తడవు నోముపట్టిన కతనన్ 21

శకుంతల : (వెనుకఁటి నెయ్యమును దలంచుకొని మోమువాడి మిక్కిలి దిగులపడి రూపుమాఱి కూర్చుండి యున్న దుష్యంతుం జూచి) ఇతఁడు నామనికి యునుకులని నమ్మిన యేలిక యేని కాఁడు. కాఁడు. తాయెతు గట్టియున్న నా ముద్దు బిడ్డని నుద్దంపుమేనును తన యొడలిచే మైలఁబడ జేయుచున్నాఁడేమి?

బిడ్డడు : (తల్లిం డాసి) అమ్మాచూడూ, వీడెవ్వఁడో వచ్చి కొడుకా అంచున్నాఁడు. కౌఁగలించుకొని ముద్దుపెట్టుకొన్నాఁడే.

దుష్యం : నా ముద్దుల మూటా, నిన్ను నేను బలుబాములపాలు చేసినవాఁడ నైనను తుదకనువుగానే ముగిసినది. ఇప్పుడైనను నీవు నన్ను గుఱుతు పట్ట గలిగితివని తలంచెదను.

శకుంతల : (తనలో) డెందమా ఎందుకు నీకీ గొందలము, తొందరపడకు,

తొందరపడకు. నేటికి నాసామికి నాయందు కనికరము గలిగినది. నా నెయ్యంపు సామియే యీతఁడు.

దుష్యం :

గీ. ఎఱుక గలుగంగ నాకును మఱపుబోవ
దారిపట్టున మఱలునంతనె వరాల
మోముగలదాన నీవు నాముందె యుంటి
పట్టువిడి నెలరోహిణి బట్టినట్టు. 22

శకుంతల : నా సామికిదే జోహారుసే – (అని సగము చెప్పి, వగపు సిగ్గు, గల గలసిన కన్నీళ్ళు గొంతులో గ్రుక్కుచు నూఱక యున్నది).

దుష్యం : నా చక్కని చుక్కా.

క. గ్రుక్కిళ్ళు గ్రుక్కి యణగం
ద్రొక్కిన జోహారు మాకుదొరికె గెలిచితిన్
నొక్కక చిక్కిన చక్కని
చుక్కగు కెమ్మోవి మొగము చూచిన కతనన్. 23

బిడ్డడు : అమ్మా, ఈతడెవ్వఁడే? చెప్పవు, చెప్పవూ.

శకుం : బిడ్డా, నా మంచిరేక నడుగు.

దుష్యం : (శకుంతల యడుగుల మీదఁబడి).

మ॥ ననబోఁణీ నినుకాదు పొమ్మనినదంతన్ మాపుమీ నీ యెదన్
ననుఁబట్టెన్ మఱుపన్న చీఁకటొకటానాడెద్దియో దెయ్యమై
కనుమాయట్టుల చీకువాలయినచో గన్పట్టుబో మంచి యం
దునుఁ బూదండనునెత్తి నిడ్డఁబడనొత్తుం గ్రుడ్డి పామోయనున్. 24

శకుంతల : (కన్నీళ్ళతో) నా సామీ, నా యుసురుల యేలికా, నా మనుగడ ఱేఁడా, నేనోచిన నోములవలనను, నా తలవ్రాలు వలనను ఇట్లు జరిగినది. మీరేమి చేయగలరు. అట్లేకాకున్న యెడల యిట్టి నెనరుల యాట పట్టులైన మీరు నన్నేల విడనాడుదురు. లెండు.

దుష్యం : (లేచెను)

శకుంతల : నా సామీ, ఇన్ని చిక్కులు జిక్కియున్న నేను నా సామికి గెపితికి వచ్చినదియెట్లో తెలియం గోరుచున్నాను.

దుష్యం : నీయుల్లములో డాగియున్న బెట్టిదంపు వగపు అను కఱకుటమ్ము పెఱికివేసికొనిన పిమ్మటఁజెప్పెదను.

చ॥ మఱుపున మున్ను నేను కనమానితిఁ జిన్కులు గట్టి నీదు వా
తెఱ నలయించు సాము గడిదేరిన కన్నుల నీళ్ళు నేడు నున్
దురటిలఁ జేయసాగె నును దొంగలి ఱెప్పల వంపులంటి బి
ట్టొఱయుచు జక్కఁగాఁ దుడిచి యూడ్చెదఁ
దొల్లిటియంగలాఱ్పులన్. 25

(అని యట్లు చేయుచున్నాఁడు)

శకుం : సామీ, ఆయుంగర మిదియేనా.

దుష్యం : ఇది దొరికిన తఱ్వాతనే నామొద్దుతనమంతయుఁదిఱిఁగి బుద్ధి గలిగినది.

శకుం : నా మనుఁగడ యేలికకు నమ్మిక పుట్టించుటకుఁ బూని నప్పుడిది యెన్ని యిబ్బందులు తెచ్చిపెట్టినది.

దుష్యం : అటులైన యెడల ననకాఱు వచ్చినదని తెలియఁజేయుటకుఁ గుఱుతుగా తీగెపూవును దాల్చిన బాగుగా నుండును.

శకుం : అబ్బబ్బా! దీనిని నేను నమ్మను. దీనిని నాసామియే తాల్చవలసి యుండును.

మాతలి : (వచ్చుచున్నాఁడు, వచ్చి) ఓహోహో ఏమి నాపున్నెము, నేను వచ్చు సరికే దేవరవారు ఇల్లాలిని, బిడ్డనుఁ గన్నులఁ జూచు కొని చెలరేఁగు చున్నారు గదా.

దుష్యం : మీవంటివారి సావాసము గలిగిన యెడల మేలుగలుగుట నిక్కమే

కదా. మాతలీ, ఇప్పుడిక్కడ నడచినది వేగంటికి దెలిసి యుండలేదేమో కదా.

మాతలి (చిఱునవ్వు నవ్వి) అన్నియుఁదెలిసికొనువారికి ఇది తెలియక యుండునా? అయ్యా పెద్దలైన కశ్యపులవారు కనిపెట్టి యున్నారు.

దుష్యం : శకుంతలా, ఈ బిడ్డను చంకనుఁ బెట్టుకో. నిన్ను ముందుంచుకొని యా గొప్పతపసి యొద్దికి పోయెదను.

శకుం : మీతోఁగూడ పెద్దల యెదుటికి రాసిగ్గువు చున్నది.

దుష్యం : మంచి మంచి వేడుకలు గలిగినప్పుడు ఇట్లు చేయవలెను, సిగ్గేలా? రా (అని యందఱు నడుచుచున్నారు అంత అదితితోఁగూడ గద్దెమీదఁగూర్చుండి కశ్యపులవారు వచ్చుచున్నారు).

కశ్య : (పుడమిఱేనిం జూపి) దాక్షాయణీ!

ఉ॥ ఎంతయు నీదు బిడ్డనికి నెల్లపనుల్ నెఱవేఱ్చుచుండు దు
ష్యంతుఁడు నాఁబడున్ జగము నంతయు నేలెడివాఁడు వింటిమే
ల్బంతిన నూఱుజన్నముల వానికి నూర్మొన వాలు సొమ్ముగా
బంతముతో నొనర్చి పనిపాటలు లేనిది చేసె వాడొగిన్ 26

అదితి : ఈతని రూపురేకలు మిక్కిలి కొనియాడఁదగియున్నవి.

మాతలి : అయ్యా వేలుపులఁ గడుపాఱఁగన్న తల్లిదండ్రులు వీరిద్దఱు. మిమ్మున బిడ్డనుఁ జూచు చూపుతోఁజూచుచున్నారు, దగ్గఱకుంబొండు అయ్యా.

దుష్యం : మాతలీ!

చ॥ నలువకు నొక్క యంతరువునంగల దక్షునకు న్మరీచికిన్
గలిగె నిఱాఱు వెల్గులనుఁ గాంచె జగంబుల మూటి నేలుచున్
జెలువుగ జన్నపుం గడులుచెందు దొరంగనెఁదాత కెక్కుడై
యలరెడి వేలుపుంబడసె నంచును బెద్దలు సెప్పుజోడిదో. 27

మాతలి : అవును సామీ.

దుష్యం : (సాగిలి మ్రొక్కి) మీ జోటికి వేలుపులతేని కొలువు కాఁడు వంగి మ్రొక్కుచున్నాఁడు.

కశ్య : తడవునాళ్ళు పుడమి నేలుము బిడ్డా.

మాతలి : బిడ్డా యడ్డులేని వాఁడవు కమ్ము.

శకు : ఈ చిన్నబిడ్డనితోఁగూడ మీయిద్దరి యడుగుఁదమ్ముల కెఱఁగు చున్న దానను.

కశ్యపుడు : అమ్మాయీ!

క. పెనిమిటి వేలుపు రాయని
నెనయున్ గొమరుఁడు జయంతు నెనయు మఱొక దీ
వన యనువుగ నుండదు నీ
వెనయుదువు పులోము కూతు నిది నిక్కమగున్ 28

అదితి : పెనిమిటి వలన మంచి గారవమును పొందుము. ఈ కొండిక రెండు వంగడముల వారికి పేరు తెచ్చి పెక్కేండ్లు బ్రతుకుఁగాక. కూర్చుండుడు, కూర్చుండుఁడు.

కస్య : (ఒకటొకరిం బేరు వరుసను.)

క. బలు సాదురాలుగా యీ
పులుగుల పెంపకపుఁగూతు బుడుతఁడు వీడొ
ప్పుల కుప్పనీవు నీవి
మ్ములఁ, బూనిక, సొమ్ము, పనియు మూడొనఁగూడెన్ 29

దుష్యం : సామీ మాకీపట్టున మేళ్ళు ముందుగా నీడేఱినవి. పిమ్మట మీదరిసెనమైనది. మీదరిసెనము అందరి దరిసెనముల వంటిది కాదు. అయ్యా!

ఆ.వె. పూవు మొదటఁబూచుఁ బుట్టు నాదట కాయ,
మొగులుమున్ను పిదప దిగును వాన

కతము కర్జములకు వితమిదియే, నీదు,
కనికరంబు వెనుక కలిమి మున్ను. 30

మాతలి : పుట్టించు నేర్పుగల నెరజాణల నేర్పులిట్టియవ కదా.

దుష్యం : సామీ మీ కొలువుగత్తెయైన యీయాడుదానిని గాణవేల్పుల పెండ్లి కాను వాయినిఁబట్టి నేచెట్టఁబట్టి తర్వాత నేదో యొక మరుపు దట్టి, చుట్టాలతో నిది నా యెట్ట యెదటికి వచ్చినప్పుడు గుఱుతు పట్టలేక నెట్టి వేసితిని. ఇట్టు చేయుట వలన తమ వంగసములోఁబుట్టిన కణ్వులవారి యెడల గట్టికొల కొడిగట్టితిని. తఱ్వాత నాకీ యుంగరము దొరుకుట చేత, తెలివిగలిగి యిది యంతయు దెలిసికొంటిని. ఏమిటో యీకత నాకొక్కింతయుఁ దెలియక యున్నది.

ఆ.వె. ఎదుట నున్న యప్పుడేనుఁగు గాదని
యరుగు వెనుక సందియంబు పుట్టి
యడుఁగు జాడ బట్టి యౌనవునను కొన్న
మాడ్కి నుండెనాదు మదివితాన. 31

కశ్య : బిడ్డా, నీతప్పని నీవు సందియ పడవలదు. ఆ మరుపు నీకుఁ జెఱుపు గాదు వినుము.

దుష్యం : అయ్యా వినుటకుఁ జెవియొగ్గి యున్నాడను.

కశ్య : బిడ్డా, అచ్చరపాళెమునుండి శకుంతలను మేనక యిచ్చుటికి దెప్పించి యుంచినప్పుడే నేను నా లోచూపునఁదలపోసి తెలిసి కొంటిని. నీకామఱుపు గల్గుట దుర్వాసుని తిట్టు వలనఁ గలిగినది. అందుంబట్టి నీ పున్నెపుటిల్లాలయిన యీ గోలంగోల పెట్టితివి కాని మఱియొకటి కాదు. ఆ యుంగరమునుఁ జూడగానే నీకా తిట్టుపట్టు వదలినది.

దుష్యం : (నిట్టూర్పు నిగుడించి) ఇప్పుడు నా దూరు తొలఁగి పోయినది.

శకుం : (తనలో) ఔను, సరిగా నున్నది గదా. నాసామి నన్నూఱక గెంటి వేయలేదు. దుర్వాసుఁడు తిట్టినట్టు నేనును దలచలేదే. ఆ విరాళితో దుర్వాసులవారు వచ్చిరి కాని అప్పుడు నాకొక్కటి తెలిసి యున్నదా. కాఁబట్టే సుమా. నన్నుఁబంపునపుడు నాచెలులు నాసామి కుంగరమునుఁజూపుమని నొక్కి నొక్కి చెప్పినారు.

కశ్య : (శకుంతలనుఁజూచి) నీకీ నడచిన దంతయుఁ దెలిసినది కదా, ఇక నీ పెనిమిటి మీద దూరున్నదని యను కొనరాదు. చూడు.

గీ. తిట్టునం బుట్టి మైకంబుదట్టి వెళ్ళ
గొట్టెగా నిన్ను నది తప్పె నిట్టి తఱిని
యేలుబడి నీదె యద్దంబు మైలగొన్న
గానరాదది తుడిచినఁ గాన వచ్చు. 32

దుష్యం : సామీ, నా కొలము నిలుచుటకు ఇదే కదా ఈ నలుసు. (అని బిడ్డనిఁ జేరఁ దీసుకొనుచున్నాఁడు.)

కశ్య : అవును, ముందుజూడు. వీఁడేడు దీవుల నేలువాడవు గదా.

చ॥ దడబిడ లేకపోవు నరదంబున సంద్రము దాటి వీఁడు గె
ల్చెడి నిక నేడుదీవులనుఁ జేరిన నేలను మాఱుతేరు గ
న్పడదెటనేని సత్వ దమనా యన నొప్పెమెకాలఁజంపి యి
క్కడ భరతా యటందురు జగంబులఁబ్రోచుటచేత నాదటన్ 33

దుష్యం : సామీ మీకనికరము నిండుఁగా గలిగినది. కావున దీని కెల్ల కలుములు గలిగినవే యని నిక్కముగా నమ్ముచున్నాము.

అదితి : నా మనికి రాయఁడా, ఈ నడచినదంతయు ఈ శకుంతలం బెంచిన కణ్యునకుం దెలియచేయుట కెవ్వని నైనఁ బంపుడు. దీని తల్లి యిదిగో యిక్కడనే యున్నది. నాకు వీవనఁబట్టి విసరుచు నంతయుఁ జూచుచునే యున్నది కదా.

శకుం : (తనలో) నాకున్న కోరికయె యీయమ్మగారుకూడను సెలవిచ్చినారు!

కశ్య : అదియేమి! కణ్వునకు లోచూపు గలదు. అతనికి నెల్లచోట్ల జరిగినది తెలియును.

దుష్యం : అందుచేతనే సుమా! ఆ తపసి నా మీద రోసగించలేదు. లేకున్న నా మనికియునుకులన్నియు నొక్క తిట్టునకుఁజాలవు.

కస్య : అయినను ఇది మేలు మాట గనుక ఆయనకుం దెలియఁజేయుట మంచిదే. ఓరీ, ఎవరురా అక్కడ.

ఒకచిన్నవాఁడు : (వచ్చి) అయ్యగారూ ఇదిగో ఇక్కడ నున్నానండి.

కశ్యపుడు : ఓరీ గాలవా. ఇప్పుడే నీవు నింగి తెఱంగునం బోయి కణ్వునితో నేను జెప్పునట్లుగా నిట్లనుము. “మేలు మాట. మీ శకుంతలకు గొన్ని నాళ్ళ క్రింద ఇచ్చటనే మాయింటనే బిడ్డ కలిగినాఁడు. ఇది మీ రెఱిఁగియే యున్నారు గదా. దుష్యంతునకును శకుంతలకును దుర్వాసుని తిట్టు యొక్క పట్టు దొలఁగి పోయినది. దుష్యంతుఁ డు వచ్చి మా బమ్మపాలెములోనే శకుంతలను తిరిగి గైకోలు చేసుకున్నాఁడు. సుగముగా ముప్పుఱునుఁ బ్రోలికిం బోవుచున్నారు” అని చెప్పు. పో.

ఆచిన్నవాఁడు : అయ్యవారూ, సెలవు చొప్పున బోవుచున్నాను.

కశ్య : బిడ్డా! దుష్యంతుఁడా, ఇదిగో నీ యిల్లాలు, ఇదిగో నీ బిడ్డ. వీరిం గలసి నీవు వేగంటి తెరెక్కి వీటికిం బయనముకమ్ము. పొమ్ము.

దుష్యం : దేవరవారి సెలవు చొప్పున జరిగించు చున్నాను.

కశ్యపు : ఇదిగో మఱియొకటి చెప్పెద విను.

ఉ॥ పంటలు బండి కాపులకు వానలొసంగుచు వేల్పుఱేఁడు నీ
వెంటనె యుండుగాక, తగవేల్చుము వేల్పులఁ గూర్చి వారు కొ
న్నింటను నీకు వారలకు నీ వొక గొన్నిటకై జగంబులన్
రెంటినిఁ బెక్కు లేండ్లు పచరించిన మేళులఁ బొందఁ జేయుఁడీ.
34

దుష్యం : సామీ నాకుఁజేతనైన వట్టులో, మఱియొకలాగు నడువను. అందఱి మేలు కొఱకే నడచెదను.

కశ్య : బిడ్డా నీ కోరిక యేమి.

దుష్యం : ఇంత కంటె నాకు మిక్కిలి కోరిక లేమున్నవి. అన్ని కోరికలు మీ వలన దీరనే తీరినవి. అయినను వినుడు. మీరు కనికరమున నడుగుచున్నారు గాన, ఈ నట్టువకాండ్ర పెద్ద ఏమి పలుకునో అది తప్పక నిక్కమగు గాక.

చ॥ కరము జగంబు మేలు కొఱకై పరికింతురు గాక రేండ్లు, పె
ద్దఱికము వాసిఁబల్కు చెలి తన్పెడి విద్దెల వారి, సత్తితోన్
వరలి తనంతఁదాఁబొడము నల్లని యెఱ్ఱని రూపువాఁడు వే
మఱలగఁ బట్టువెత్తుటను మాటయె లేనటు జేయుఁగావుతన్.
35

– అని యందఱు వెళ్ళిరి –

ముగిసెను.

శ్రీ

పదునెనిమిది టోమిరీల వరుస కూర్పు

మొదటి యంకము

మొదటి టోమిరీ : నాల్గవ పద్దెమునకు ముందు పాడవలెను (పుట 5)

అయారే యీపూత

రాగము : యవన వసంతము

నటి : అయారె యీపూత – కాతే బాగనరే ॥ రా ॥
కోయెల చివురు జొంపముల నిదెమేయఁగ గోరె ॥ అయారే ॥

1. తుమ్మెద, కొంచెము, ముట్టిన, జూలు, కమ్మని, తావుల, దిరిసెన, పూలు,
కొమ్మల, కివిజువి, కీలు, బాలి, లీలు, వీలు, గ్రాలు, మే ॥ లయ్యా ॥
2. చిలుకలు, కులుకుచుఁ, బలుకులు, బలుక,
చెలువల, వలపుల, తలపులు దొళుక;
కలువల, చెలిబలు, జోక, మేని, కాక, వీక, పోక, మన ॥ కయ్యారే ॥

రెండవ టోమిరీ : ఇరుబది యారవ పద్దెమునకు ముందు (పుట 19)

ఏరా, ఏరా తుటారి తుమ్మెద

రాగము – ఖమాచి

దుష్యం : ఏరా, ఏరా, తుటారి తుమ్మెద,
యేలా నీ పొగరిదిగో యిదిగోర చూడర,
యొక నిమిసమున నంతయు నడంతు ॥ ఏరా ॥

1. ఓరి యీ మితారిని, తరాయించెదవు బలిమినిఁజేసి ;
యారి, తీరి, కేరి, మీరి, సారె, సారె, తిరిగి, తిరిగి ॥ ఏరా ॥

మూడవ టోమిరీ : సకియా నాకును అనుమాటకు ముందు, (పుట 21)

అందకాండ, నీదే చోటో

రాగము - బేహాగ్

అనసూ: అందకాండా నీ, దే, చోటో,
ఓ, అందకాడా నీదే చోటో, ఓ, బళీ ॥ అం ॥

ఏరాచ తపసి కోరి నినుగాంచెనో,
యెఱుఁగ దెలుపు మనవి విని ఓ, ॥ అం ॥

రెండవ యంకము

మొదటి టోమిరీ : ఈలాగున నీవు ఇటువంటి పనులు అనుమాటకు ముందు

(పుట - 32)

చెలికాడ నా పనేమి చెప్పుదు

రాగము : యమునా కల్యాణి

విదూ : చెలికాండా నాపనేమి చెప్పుదు - జిమ్మదిఱిఁగి పోయే

1. నిలువంగలేను నామేను నొచ్చె కటకటా;
నొచ్చె కటకటా నొచ్చె కటకటా ॥ నిలు వంగ ॥

2. కడుపుమంట సరేకదా యిక కాళ్ళు కదలలేవు;
నడచి నేనెట్లువత్తు నయ్యా కటకటా;
యయ్యా కటకటా యయ్యా కటకటా ॥ నడచినే ॥

3. పగలు రేయును వేటలాయె పక్కటెముకలెండె;
నగరు నేనెట్లుజూతు నయ్యో కటకటా;
అయ్యో కటకటా అయ్యో కటకటా ॥ నగరు ॥

మూడవ యంకము

మొదటి టోమిరి : పదునెనిమిదవ పద్దెమునకు ముందు (పుట - 54)

ఏమని తెల్పుదురా

రాగము : తోడి

శకుం : ఏమని తెల్పుదురా, నే, ॥ నేమని ॥

నీమది దెలియదు నే నిన్నుఁదలచితి -

వలచితి పిలచితిరా సామి ॥ వలచి ॥ సామి ॥ ॥ ఏమని ॥

1. పాయక వలరాయడేయ - బడలితి, వడలితి, నడలితి, సడలితిరా;

నే నడలితి నడలితిరా ॥ సామీ ॥ ॥ ఏమని ॥

రెండవ టోమిరీ : ఇరుబదినాల్గవ పద్దెమునకుఁ తర్వాత (పుట : 57)

పెద్దల చాటుదాన, నీకిది తగునట రా

రాగము : హిందూస్థానీ భైరవి

శకుం : పెద్దల చాటుదాన, నీకిది, తగునట రా

రద్దిర నాదరి, రాకుర రాకుర ॥ పెద్ద ॥

1. వద్దుర వద్దు పురు, వంగడములోఁగల

వారికిగల పరు వైననుఁ జూడర. ॥ పెద్ద ॥

2. పేరుగల మీకును, పెండ్లిసేయ

నాయన గారైన లేరుగద, యూరనిపుడేమి సేతు ॥ పెద్ద ॥

మూడవ టోమిరీ : ఇరువది యాఱవ పద్దెము తర్వాత తెఱలో (పుట : 58)

జక్కవ చక్కని చుక్కా మక్కువ కాని

రాగము : బేహాగ్

తెఱలోనిది : జక్కవ చక్కని చుక్కా మక్కువ కాని;

ప్రక్కనుండి పంపుమిక రాతిరి వచ్చె.

నాల్గవ యంకము

మొదటి టోమిరి : ఆరవ పద్దెమునకు ముందు (పుట 71)

చను చున్నది యిదే నేడు

రాగము : సాకి

కాశ్యపు : చను చున్నది యిదే నేడు, శకుంత లను
విడువఁగ గలనా; అయ్యో - లను విడువఁగ గలనా -
యీగో లను విడువఁగ గలనా; జాలి చేతవే సరినా గుండెలు;
జలు జలు జలు మనియే - అయ్యో - జలు జలు జలు మనియే॥

1. మక్కువ గ్రుక్క లణఁచి యణఁచి - మాటగొణుఁగుఁబోయె - అయ్యో;
మాట గొణుఁగుఁ బోయె; స్రుక్కుచు వెక్కి వెక్కి యేడువగఁ;
జూపు సన్నమాయె - అయ్యో - చూపు సన్నమాయె,

2. కాన కాపునై కన్నులఁబెంచిన - వానికె యిటులాయె; అయ్యో;
వానికె యిటులాయె - కాపురాలుసేయుచుఁ దమ కడుపునఁ
గన్న వారికెటులో; అయ్యో - కన్న వారి కెటులో ॥

3. పెనిమిటి యింటి, కినిఁ దొలు సారిగ - బిడ్డనుఁ బంపెడిచో, అయ్యో;
బిడ్డనుఁ బంపెడిచో; మునుఁజేసిన చేతల తలపోతల;
మునిగి నిలువ గలనా - అయ్యో; మునిఁగి నిలువ గలనా ॥

_రెండవ టోమిరీ : పదు నాల్గవ పద్దెము తర్వాత (పుట : 76)_

నిడుద చూపుల దాన

రాగము : హిందూస్థానీ కాఫీ

శకుం : నిడుద చూపుల దాన - లేఁడి పసికూనా ॥నన్ ॥
విడిచి వెన్కకు పో పోవే వెఱ్ఱి దానా । నిడు ॥

1. చనుచున్న నను వెంబ, డించెదవేలా -
నెనరున నా తండ్రి కనిపెట్టు చాలా ॥ నిడు ॥

2. గొడ్డు మోచి కన్న తల్లి లేకున్న -
బిడ్డవలెనే నిను పెంచితి చిన్న ॥ నిడు ॥

మూడవ టోమిరీ: చెలికత్తెల దగ్గర బోయిబిల్చి చెలులారా అన్న తర్వాత (పుట 77)

ఏలా మఱచి పోదు చెలీ

రాగము : కానడ

శకుంతల : ఏలా మఱచి పోదు చెలీ

1. మాలినిలో, నీలోయని, యాడినది –
యేలా మఱచిపోదు చెలీ ॥ ఏలా ॥

అనసూ : పూలతోట, లోనుయ్యాల

2. లూగినది, యేల మఱచి–పోదు చెలీ. ॥ ఏలా ॥

ప్రియం : గొబ్బి తట్టి, కోలాటము

3. లాడినది, యేలా మఱచి, పోదుచెలీ ॥ ఏలా ॥

అయిదవ యంకము

మొదటి టోమిరీ : మొదటి పద్దెమునకు ముందు (పుట :80)

తుమ్మెదా క్రొత్త తేనె

రాగము : సావేరి

ఆకసమున తెఱలో –

1. తుమ్మెదా క్రొత్త తేనె జిమ్మకింపుగాగ్రోల,
క్రొమ్మావి కొమ్మనిరి గుత్తి ముద్దు బెట్టి;
తమ్మియింట నే హాయి సొమ్మసిల్లి దాని
నిమ్మాడ్కి మఱచుట యిది నాయమా ॥

రెండవ టోమిరీ : తలపోయుఁడు, ఒకనాఁడు మనము అనుమాట ముందు (పుట 91)

ఓనాసా, మీ మీా యల్ల, నాటిమా, టలెల్ల

రాగము : హిందుస్థానీ భైరవి

శకుం: ఓనా సా, మీా యల్ల, నాటిమా, టలెల్ల ॥
మానక, నీయుల్ల, మందుఁదలంచుకో, యెంచుకో ॥ ఓనా ॥

1. కోనలో, జాజియీా, రా నసుం,డ నీరు;
తేనేలే, దా తామ, రాకు దొన్నె లోను ॥

2 పిల్లలే, డికి దొన్నె, నీళ్ళునీ, వీఁబోవ,
మెల్లఁగా నదిమోము, ద్రిప్పఁగా, ద్రిప్పఁగా;
చల్లగా, నీదొన్నె, నా చేతఁ బట్టిన;
నీళ్ళు లే, డిపిల్ల, త్రాగిన, దికదా ॥ ఓనా ॥

3 చేడెరో, యడవి, వారిక, దవివా
రేడఁదో, డేకాని, వాడవా, రౌదురా, యౌదురా
నేడు నా, నీరేల, లేడిక్రో, లునని,
కోడిగ, మాడిన, జాడను, జూడరా

మూడవ టోమిరీ : ఇరువది రెండవ పద్దెమునకు తరువాత (పుట : 92)

ఔరౌరౌ, రా అందఱు నీవలె

రాగము : జంఝూటి

శకుం : ఔరౌరౌ, రా అందఱు నీవలె
కాఱులాడ నొడిగట్టరు పోరా ॥ ఔ ॥

పై పై పాలు లోపలి విసము
నేపగు గాదము గప్పిన నూయి ॥ ఔ ॥

నాల్గవ టోమిరీ : సామి పురువంగడమునఁబుట్టిన వాఁడవు గదా యని నమ్మితిని అనుటకు ముందు (పుట : 93)

ఔరౌరా రాజా, ఆరడి బడితి

రాగము : పీలు

శకుం : ఔరౌరా రాజా, ఆరడి బడితి – నకటా యింతటి వాడ
వని నేనెఱుఁగక, హామోసపోతి – తగునా నాయమేనా ॥

1. అంతంత లేసి, బాసలు చేసితి – వయయో కట్టడి వైతి;
వని నేనెఱుఁగక, హామోసపోతి – తగునా నాయమేనా ॥

॥ జౌరౌరా ॥

ఐదవ టోమిరీ : 'తల్లీపుడమీ–నీలోనికి నాకుదారియిమ్ము' అనుమాటకు ముందు (పుట – 96)

ఎవరి దాన నౌదునే ఇపుడు

రాగము : హిందూస్థానీ భైరవి

శకుం : ఎవరి దాన నౌదునే ఇపుడు, నెనరు, విడిచి,
మగడు చూడక పోయె, నింత మోసమాయె;
తంద్రికిని గానైతి, తల్లిఁజూఁడనైతి,
తక్కిన వారెవరును లేరు లేరులేరూ –
తల్లీ పుడమీ నిన్నె నెర నమ్మతి ॥ నెవరి ॥

ఆఱవ యంకము

మొదటి టోమిరీ : రెండవ పద్దెమునకు ముందు (పుట–103)

ఆమని నేమని, పొగడనేచెలీ

రాగము : ఖరహరప్రియ

మొదటిది – ఆమని నేమని, పొగడనేచెలీ ॥
ఆ మామిడిపూఁత బెడంగ్ – చూడు చూడు మీ॥ ఆమని ॥

1. చల్లని పయ్యెద విసరఁగ నెంతో
సంతోసము; హా హోరంగ్ – చూడు చూడు మీా ॥ సంతోసము ॥

2. కోయెల కొమ్మల తలిరులు మేసి
కూకూ యని కూయు తెఱంగ్ – చూడు ॥ కూకూ ॥

రెండవ టోమిరీ : పదునొకండవ పద్దెమును ముందు (పుట – 111)

నేనోచిన నోము

రాగము : శ్యామ

దుష్యం: నేనోచిన నోము నీవు నోచితివే
దానిఁ రప్పించుకో దరమా ॥ యుంగరమా ॥

1. నునుగెంపు గోరువ్రేలున కెక్కి పడితివి
తనియ నందే యుండ దరమా ॥ యుంగరమా ॥

2. ఒడిసి వీకడకను నీవుండలేవైతివి
తడబాటు లేకుండఁ దరమా ॥ యుంగరమా ॥

ఏడవ యంకము

మొదటి టోమిరీ : ఇరుబది నాల్గవ పద్యమునకు ముందు (పుట–140)

మానవే శకుంతలా

రాగము – శంకరాభరణం

దుష్యం : మానవే శకుంతలా – మదిని వంతల

1. తడఁబడి నేఁజేసియున్న – తప్పుగావవే
2. జాలమేలా యిక నా మాట – యాలకింపవే
3. మ్రొక్కెదనే నెనరు తోడ – మోడివీడవే.

ముగిసెను

శ్రీ దాసు శ్రీరాములు గారు 1897లో అచ్చతెనుఁగులో అనువదించి 1898లో ప్రచురించిన 'అభిజ్ఞానశాకుంతలము'
అవతారిక

శ్రీ

అభిజ్ఞానశాకుంతలము

అచ్చతెనుఁగు

ఇది

మున్ను కాళిదాసుచే వేలుపుబాసలో జేయబడి యిపుడు

మొదటితరగతి ప్లీడరుగా ఏలూరులో నుండు

దాసు శ్రీరాములు

అనువానిచే అచ్చతెనుఁగులోజేయఁబడినది.

-

చెన్నపట్టణము

ఆనందా ముద్రాక్షరశాలలో

ముద్రింపించి ప్రకటింపఁబడియె.

1898

మహాకవి దాసు శ్రీరాములు స్మారకసమితి

హైదరాబాద్

ప్రచురణలు

మహాకవి దాసు శ్రీరాములు గారి రచనలు


1. తెలుగునాడు (1974)
2. అభినవగద్య ప్రబంధము (1974)
3. శ్రీదేవీభాగవతము (1978)
4. సూర్యశతకము (1979)
5. కురంగ గౌరీ శంకర నాటిక (1981)
6. చక్కట్లదండ (1984)
7. భృంగరాజమహిమ, శ్రాద్ధ సంశయవిచ్ఛేది (1989)
8. దురాచారపిశాచ భంజని, ఆచారనిరుక్తి, విగ్రహారాధన తారావళి (1991)
9. పదములు – జావళీలు (1991)
10. కృతులు పదములు – జావళీలు (2007)
11. అభిజ్ఞానశాకుంతలము (అచ్చతెనుఁగు) (2014)

ఇతర ప్రచురణలు

1. మహాకవి దాసు శ్రీరాములు జయంతి సంచిక (1975)
2. "మహాకవి దాసు శ్రీరాములు గారి కృతులు – ఒక సమీక్ష"
(శ్రీమతి వెలగపూడి వైదేహి గారి పి.హెచ్‌డి. సిద్ధాంత వ్యాసము)
ప్రథమ ముద్రణ (1986), ద్వితీయ ముద్రణ (2014)

MAHAKAVI DASU SRIRAMULU SMARAKA SAMITHI
F 201, Sri Sai Ram Aditya Residency, Engineers Colony, Yellareddy Guda,
Hyderabad - 500 073. Phone : 23734864





మహాకవి మహావాగ్గేయ కారులు

శ్రీదాసు శ్రీరాములు గారు

MAHAKAVI DASU SRIRAMULU (1846-1908)



Acclaimed as *"Second Srinatha"* by Chellapilla Venkata Sastry, Dasu Sriramulu was the most distinguished of the Telugu poets of the latter half of the nineteenth century.

Dasu Sreeramulu was born, the only child of Kannayya and Kamamma, the opulent family and rulers of *'Alluru Agraharam'* in Mudinepalli sector, of Krishna District, Andhra Pradesh, on April 8th, 1846 at Koorada. He married Janakamma in 1859. His father's home became the venue of his early years of schooling. For a brief period he attended the Noble School in Bandar and later moved to the *'Andhra Geerwaana Peethamu'* Akiripalli, seat of great learning and scholarship, where he mastered Telugu and Sanskrit grammar and classics. He taught Telugu at an English school in Gudivada and was a popular and much sought after teacher. Working as a teacher, he taught himself English, Parsee and Law and qualified himself as a 'First grade English Pleader' and practiced at Masulipatnam and Eluru for over seventeen years and earned fame and fortune. Latter, he devoted himself totally to literary and social pursuits. He was actively involved in the reformist movements for women's education, widow remarriage, eradication of social evils like dowry and child marriages. Kandukuri Veeresalingam and Gurajada Appa Rao were his contemporaries. As a staunch and fearless nationalist, he presided over a meeting addressed by Bipin Chandra Pal at Bezawada in1905, when others were reluctant, fearing the wrath of the British Government.

His works, numbering over 35, encompassed every genre of literary creativity of which *'Telugu Nadu,' 'Surya Satakamu'* and *'krutulu, javalilu, padamulu'* are widely known. His last work of crowning glory is the rendition into Telugu of *Sri Devi Bhagavatham*, an epic, comprising over six thousand verses in a variety of metres, which he composed extempore *(aasuvu)* in just five and a half months!

Prompted by some students in Madras in 1897 he translated *'Abhijnana Sakuntalam'* into *Achcha* Telugu (pure and unmixed with Sanskrit) in just 20 days! Scholars consider that this work would help enrich the Telugu language. The play was staged some time in 1902 in Bandar at the National Theatre.

The multifaceted genius attained the heavenly abode on May 16, 1908, bequeathing to posterity a legacy of priceless oeuvre.